




www.aksharamtelugudaily.com

# అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

మంగళవారం 12 డిసెంబర్ 2023 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా

పేజీలు : 12+12 సంపుటి : 06 సంచిక : 266 వెల : రూ.3/- కొత్తగూడెం తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


## 20లోగా పోలీసుల బదిలీలు!

అసెంబ్లీ సమావేశాలు ముగిశాక హోంశాఖపై సమీక్ష



2లో..

# నేటి నుంచే రైతుబంధు పంపిణీ

- -నిధుల విడుదలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- -ఈసారికి పెట్టుబడి సాయంగా పాత మొత్తమే..
- -2 లక్షల మాఫీ కార్యాచరణకు నిర్దేశం
- -గతంలో మాదిరిగానే జమ చేయాలని సీఎం ఆదేశం
- -ఖరారుకాని రైతు భరోసా విధివిధానాలు
- -ప్రతి అన్నదాతకూ అందజేయాలని స్పష్టీకరణ
- -వ్యవసాయ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- -నిజంగా సాగు చేసే భూములకే రైతుబంధు: జీవన్‌రెడ్డి





**హైదరాబాద్, డిసెంబరు 11 (అక్షరం న్యూస్):**
యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుబంధు నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను తక్షణమేప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఏ ఒక్క రైతుకూ ఇబ్బంది కలగకుండా మంగళవారం నుంచిపెట్టుబడి సాయం పంపిణీ చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖపై సచివాలయంలో సోమవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగానే రైతుబంధు పంపిణీపై ఆదేశాలిచ్చారు.



## కేసీఆర్‌కు చంద్రబాబు పరామర్శ

- -త్వరగా కోలుకొని ప్రజల్లోకి రావాలని ఆకాంక్ష
- -దవాఖానకు డిప్యూటీ సీఎం భట్టి సహా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు
- -కేసీఆర్ సాధారణ స్థితికి రావాలి: చిరంజీవి
- -ప్రజల జీవితాలను మార్చిన కేసీఆర్: ప్రకాశ్‌రాజ్



12లో

## కేంద్ర నిర్ణయాన్ని జమ్మూకాశ్మీర్ ప్రజలు స్వాగతించారు

**హైదరాబాద్, డిసెంబరు 11 (అక్షరం న్యూస్):**
కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని జమ్మూకాశ్మీర్ ప్రజలు స్వాగతించారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నాడు బీజేపీ పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..."భారతదేశ చరిత్రలో అత్యంత ముఖ్యమైన నిర్ణయం జమ్మూకాశ్మీర్‌లో ఆర్టికల్ 372 రద్దు చేయడం. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జమ్మూకాశ్మీర్ అంశంలో ప్రతిష్టాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. జమ్మూకాశ్మీర్ మరో పాలస్తీనా అవుతుందని కొందరు విపక్ష నేతలు ఆరోపణలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిసున్నాము. ఇతర రాష్ట్రాల్లాగే జమ్మూకాశ్మీర్‌కి సమాన హక్కులు ఉండాలి. జమ్మూకాశ్మీర్‌లో అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావాలి. జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదం కూకటివేళ్లతో పెకిలించాలి. యువత చేతిలో కంప్యూటర్లు, బుక్స్ పెట్టాలి. హింసతో అట్టుడికిన జమ్మూకాశ్మీర్‌లో కొత్త ఆశలు వెల్లువిరిస్తున్నాయి. కొన్ని రాజకీయ పార్టీలు సుప్రీంకోర్టు తీర్పుతో బాధపడుతున్నారు. ప్రభుత్వం అందరికీ న్యాయం చేస్తుంది" అని కిషన్‌రెడ్డి తెలిపారు.



## ప్రజాదర్బార్‌లో ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం

ఐటీ పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు

2లో..



## కాంగ్రెస్ సర్కారు ముమ్మాటికీ పడిపోతుంది

వాళ్లకు వాళ్లే ప్రభుత్వాన్ని పడగొట్టుకుంటారు..
రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చేది ఖాయం
నాడు ప్రగతి భవన్‌కు కంచె వేసింది కాంగ్రెస్సే..
విద్యుత్తు, అప్పులపై అసత్య ప్రచారం: పల్లా



12లో

## మేడారం జాతీయ హోదాకు కృషి

### భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలి
### ఈసారి జాతర సమయంలోనే గిరిజన సమ్మేళనం
### పంచాయతీరాజ్,స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, డిసెంబరు 11 (అక్షరం న్యూస్):**
మేడారం జాతరకు జాతీయ హోదా కోసం రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. వచ్చే ఫిబ్రవరిలో జరిగే మేడారం మహా జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు.

మేడారం జాతర ఏర్పాట్లపై సోమవారం మాసాబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో సీతక్క ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అంశాలవారీగా సమీక్షించారు. జాతరలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. కోయ గిరిజన ఇలవేల్పుల సమ్మేళనాన్ని ఈసారి జాతర సమయంలోనే నిర్వహించాలని ఆదేశించారు. తద్వారా జాతరకు వచ్చే భక్తులు గిరిజన సాంస్కృతిక వైభవం తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.మేడారం జాతర జాతీయ హోదా కోసం కేంద్రానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జాతర తదుపరి సమీక్ష వచ్చేవారంలో ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. గిరిజన సంక్షేమ శాఖ తనకు తల్లిలాంటిదని, ఉద్యోగులు తనను సోదరిలా భావించి సమస్యలను ఎప్పుడైనా చెప్పుకోవచ్చని సీతక్క ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. సమీక్షలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ, అదనపు సంచాలకుడు సర్వేశ్వర్‌రెడ్డి, చీఫ్ ఇంజినీర్ శంకర్, ట్రైకార్ జీఎం శంకర్, టీఆర్ఐ సహా తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



## వణికిస్తున్న చలి

### తుపాన్‌లతో పెరిగిన శీతలగాలులు



**హైదరాబాద్, డిసెంబరు 11 (అక్షరం న్యూస్):**
సహజంగా చలి కాలం ప్రారంభానికి తోడు మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో తెలంగాణలో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. దీంతో తెలంగాణపై చలి పంజా విసురుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా చలి తీవ్రత పెరగడంతోపాటు మంచు కురుస్తోంది. ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. చాలా ప్రాంతాల్లో తెల్లవారుఝామున దట్టమైన పొగ మంచు కమ్ముకుంటోంది. సాయంత్రం 5 గంటల నుంచి మొదలు పెడితే ఉదయం 9 గంటలు దాటినా చలి తీవ్రత తగ్గడం లేదు. ఉదయం

మిగతా 2లో..

## మధ్యప్రదేశ్ సీఎంగా మోహన్ యాదవ్

ఉజ్జయిని దక్షిణ ఎమ్మెల్యేను ఎంపిక చేసిన బీజేపీ..
ఉద్ధండులను కాదని ముఖ్యమంత్రిగా యాదవ్‌కు చాన్స్
రేపు ప్రమాణం.. ఛత్తీస్‌గఢ్ సీఎం కూడా



**భోపాల్, డిసెంబరు 11(అక్షరం న్యూస్):**
అంచనాలను తలకిందులు చేస్తూ మధ్యప్రదేశ్‌లో అధికారాన్ని నిలబెట్టుకున్న బీజేపీ.. ముఖ్యమంత్రి ఎంపికలోనూ అంతే స్థాయిలో ఆశ్చర్యపరిచింది. తమకు కంచుకోటలాంటి రాష్ట్రంలో.. ఉద్ధండులైన నాయకులను కాదని, మోహన్‌యాదవ్ (58)ను సీఎంగా ప్రకటించింది. ప్రస్తుత ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను పక్కనపెట్టింది.

# నేటి నుంచే రైతుబంధు పంపిణీ

ఇదే క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు రూ. 2 లక్షల రుణమాఫీ పథకం అమలుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు నిర్దేశించారు. ఈ సమీక్ష సుమారు మూడుగంటల పాటు జరిగింది. వ్యవసాయ, అనుబంధ శాఖల పనితీరు, చేపడుతున్న పథకాలు, రైతు సంక్షేమం, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలను చర్చించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు. కాగా, రైతుబంధు కింద ఈ సీజన్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినట్లుగానే ఎకరాకు రూ. 5 వేలు పంపిణీ చేయనున్నట్లు తెలిసింది.

రైతులకు ఈ యాసంగి సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయాన్ని గతంలో మాదిరిగానే అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రైతుబంధు నిధులను మంగళవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ ఒక రైతుకూ ఇబ్బంది కలుగకుండా పంట పెట్టుబడి సహాయం పంపిణీ చేయాలని సూచించారు.

సోమవారం ఆయన సచివాలయంలో వ్యవసాయశాఖపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సుమారు మూడున్నర గంటలపాటు సాగిన సమావేశంలో ముఖ్యంగా రైతులకు పెట్టుబడి సాయం పంపిణీ, రూ. 2 లక్షల రుణమాఫీపై సుదీర్ఘంగా చర్చించారు. రైతు భరోసా కింద రైతులకు ఎకరాకు రూ. 15 వేలు, కౌలు రైతులకు ఎకరాకు రూ. 15 వేల చొప్పున అందజేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది.

ఈ నేపథ్యంలో మ్యానిఫెస్టో అమలు సాధ్యాసాధ్యాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది. రైతుభరోసా పథకంపై అసెంబ్లీలో చర్చించిన తరువాత పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు రూపొందించాలని నిర్ణయించినట్టు సమాచారం. అప్పటివరకు ప్రస్తుత విధానంలోనే రైతుబంధు నిధులు పంపిణీ చేయాలని నిర్ణయించారు. అంటే గతంలో మాదిరిగానే ప్రతిరోజూ ఎకరాల వారీగా, ఎకరానికి రూ. 5 వేల చొప్పున (ఈ సీజన్‌కు) పెట్టుబడి సాయం అందించనున్నారు.

వ్యవసాయంపై సమీక్ష సందర్భంగా రూ. 2 లక్షల రుణమాఫీ హామీపై సీఎం రేవంత్‌రెడ్డి సుదీర్ఘంగా చర్చించారు. ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలోని రైతులకు రూ. 2 లక్షల మేరకు రుణాలు మాఫీ చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సాగుభూములకే రైతుబంధు: కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రైతులకు అందజేసే పెట్టుబడి సాయంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఆయన జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం రేచపల్లి గ్రామంలో ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. సాగు చేసే భూములకు మాత్రమే రైతుబంధు అందజేస్తామని స్పష్టంచేశారు. పది ఎకరాలకు మించిన సాగుభూములు ఉన్న వారు చాలాకొద్దిమందే ఉంటారని పేర్కొన్నారు. పెట్టుబడి ఖర్చులు, ఎరువులు, మందుల ధరలు విపరీతంగా పెరిగినందున ప్రస్తుతం ఇస్తున్న రూ. 5 వేలకు మరో రూ. 2,500 కలిపి ఎకరాకు రూ. 7,500 చొప్పున ఇస్తామని తెలిపారు.

ఈసీ ఆదేశాలతో నిలిచిన రైతుబంధు

నిజానికి యాసంగి సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయాన్ని గత నవంబర్ నెలలోనే అందజేయాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఎన్నికల కోడ్ పేరుతో తొలుత ఎన్నికల సంఘం అనుమతి ఇవ్వలేదు. యాసంగి సీజన్ మొదలైన నేపథ్యంలో రైతుబంధు అందజేయాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఈసీకి లేఖలు రాసింది.

పీఎం కిసాన్ నిధుల పంపిణీకి కేంద్రానికి అనుమతి ఇచ్చిన విధంగానే తమకూ అనుమతి ఇవ్వాలని కోరింది. ఎట్టకేలకు రైతుబంధు పంపిణీకి నవంబర్ 24న గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఈసీ 28వ తేదీ వరకు మాత్రమే పంపిణీ చేసేందుకు అవకాశం ఇచ్చింది. ఆ వెంటనే 25,26,27 తేదీల్లో వరుసగా మూడు రోజుల పాటు బ్యాంకులకు సెలవులు రావడం, ఆ తరువాత ఈసీ అనుమతులు వెనక్కి తీసుకోవడంతో రైతుబంధు పంపిణీ సాధ్యం కాలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతానికి పాత విధానమే కొనసాగించాలని నిర్ణయించడం విశేషం.

ఇప్పటివరకు 72,817 కోట్లు పంపిణీ

బీఆర్ఎస్ ప్రభుత్వం 2018-19 వానకాలం సీజన్‌లో రైతుబంధు పథకాన్ని ప్రారంభించింది. అప్పటి నుంచి ఈ ఏడాది వానకాలం సీజన్ వరకు తెలంగాణ ప్రభుత్వం మొత్తంగా రూ. 72,817.04 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసింది. తొలి విడతలో ఈ పథకం కింద 50.25 లక్షల మంది రైతులు లబ్ధి పొందగా, ప్రస్తుతం ఈ సంఖ్య 68.99 లక్షలకు చేరింది.

ఆయిల్‌పామ్‌ను మరింత ప్రోత్సహించాలి: మంత్రి తుమ్మల


ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు మంచి దిగుబడి సాధిస్తున్నారని, మంచి గిట్టుబాటు ధర లభిస్తున్నదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్‌పామ్ సాగును మరింత ప్రోత్సహించాలని, ఇందులో అంతర పంటగా పుచ్చకాయలు పండించేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. సచివాలయంలో సోమవారం వ్యవసాయ శాఖపై మంత్రి తొలి సమీక్ష నిర్వహించారు. రైతులకు నూతన వ్యవసాయ విధానాలతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని, అదే విధంగా పంట ఉత్పత్తి పెంచాలని చెప్పారు.

రైతులకు ఇబ్బంది లేకుండా పంట ఉత్పత్తుల మారెటింగ్‌ను పెంచాలని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తరకం పంటలను రైతులకు పరిచయం చేయాలని, వాణిజ్య పంటల సాగుపై అవగాహన కల్పించడంతోపాటు వారిని మానసికంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. మామిడి, జామ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి ఆ పంటల సాగుకు సహాయపడాలని చెప్పారు. సమీక్షలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతోపాటు పలు విభాగాల ఎండీలు, ఏడీలు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ చెలామణిపై ఉక్కుపాదం: సీఎం

రాష్ట్రంలో మాదకద్రవ్యాల చెలామ ణి, వినియోగంపై ఉకుపాదం మోపాలని సీఎం రేవంత్ పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాల వి నియోగం, నివారణపై సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ రాష్ట్రంలో మాదక ద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా కఠిన చర్య లు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతమున్న తెలంగాణ స్టేట్ యాంటి నారొటిక్ బ్యూరోకు పూర్తిస్థాయి డైరెక్టర్‌ను నియమించడంతోపాటు ఆ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. ఈ విభాగానికి కావాల్సిన నిధులు, వనరులు ఇతర సౌకర్యాలను సమకూరుస్తామని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న గ్రేహౌండ్స్, ఆక్టోపస్ మాదిరిగా టీఎస్‌నాబ్‌ను తీర్చిదిద్దాలని అన్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా రూపొందించాలని స్పష్టం చేశారు.

## వణికిస్తున్న చలి



9 గంటల వరకు పలు ప్రాంతాల్లో మంచు దుప్పటీ వీడడం లేదు. దీంతో ఉదయం 10 గంటల దాకా బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోవడంతోపాటు చలిగాలులు కూడా వీస్తుండడంతో ప్రజలు చలికి గజ గజ వణికిపోతున్నారు.

తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో పొగమంచు కురుస్తోంది. మెదక్, హైదరాబాద్, మహబూబ్‌నగర్, సంగారెడ్డిలో ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కనిష్టానికి పడిపోయాయి. గడిచిన 24 గంటల్లో ఆదిలాబాద్‌లో 12.7 డిగ్రీల, భద్రాచలంలో 18.5, హకీంపేటలో 15.2, దుండిగల్‌లో 15.7, హన్మకొండలో 14.5 డిగ్రీలు, హైదరాబాద్‌లో 16.1, ఖమ్మంలో 16. 6 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లో 19.1 డిగ్రీలు, నల్గొండలో 17.8 డిగ్రీలు, నిజామాబాద్‌లో 16.9 డిగ్రీలు, రామగుండంలో 15.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కాగా ఇప్పటికే మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో చలి తీవ్రత పెరగడంతోపాటు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో కొద్ది రోజుల్లోనే మరో తుఫాన్ విరుచుకుపడనుందని వాతావరణశాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడన ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. డిసెంబర్ 16న ఉపరితల ఆవర్తనం ఏర్పడవచ్చని అంచనా వేస్తోంది. డిసెంబర్ 18నాటికి ఇది అల్పపీడనంగా మారుతుందని వెల్లడించింది. ప్రస్తుతానికి ఈ అల్పపీడన ఆవర్తనం శ్రీలంక, తమిళనాడు, ఏపీ వైపుగా కొనసాగుతోందని ఐఎండీ అంచనా వేసింది. అల్పపీడనం భారీ తుఫాన్ గా మారే అవకాశం కూడా ఉందని చెబుతోంది. ఇదే జరిగితే మళ్లీ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

### ప్రజాదర్బార్‌లో ప్రజా సమస్యలను వెంటనే

## పరిష్కరిస్తాం

**హైదరాబాద్, డిసెంబరు 11 (అక్షరం న్యూస్):**

ప్రజాదర్బార్‌లో ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఐటీ పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం నాడు నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విజ్ఞాపన పత్రాలతో ప్రజలు భారీగా తరలివచ్చారు. ప్రజాదర్బార్‌లో మంత్రి వినతులు స్వీకరించారు. విజ్ఞాపనదారుల సౌకర్యార్థం ప్రజాదర్బార్ నిర్వహణకు ప్రభుత్వం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ప్రజాదర్బార్ నిర్వహణను జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ సమన్వయం చేశారు. ఆయుష్ విభాగం డైరెక్టర్ హరిచందన, సీనియర్ ఐఏఎస్ అధికారి ముషారఫ్ అలీ, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రి ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ...దరఖాస్తుదారులు తమ విజ్ఞాపనపత్రంలో సమస్యతో పాటు అడ్రస్, ఫోన్ నంబర్‌ను రాయాలని సూచించారు. తద్వారా దరఖాస్తుదారుల సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించడానికి వీలవుతుందని తెలిపారు.

ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న టీఎస్ జెన్కో జేఈ పరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. అదే రోజు రెండు, మూడు పరీక్షలు ఉన్నట్లు అభ్యర్థులు మంత్రికి వివరించారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. సంబంధితశాఖ అధికారులతో చర్చించి టీఎస్ జెన్కో జేఈ పరీక్ష వాయిదాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. తమకు ఇచ్చే గౌరవ వేతనాన్ని ప్రతి నెలా రెగ్యులర్‌గా ఇవ్వాలని మధ్యాహ్న భోజన వంట కార్మికులు విజ్ఞాపన పత్రం అందజేశారు. అన్ని సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్దలు, వివిధ వర్గాలతో నెల రోజుల పాటు ప్రజా సమస్యలను కూలంకషంగా చర్చించి మ్యానిఫెస్టో రూపొందించినట్లు తెలిపారు. పారదర్శకంగా, జవాబుదారీతనంతో తమ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

### మధ్యప్రదేశ్ సీఎంగా

## మోహన్ యాదవ్

డిప్యూటీ సీఎంలుగా జగ్దీష్ దేవ్‌రా (మల్హాఘర్), రాజేశ్ శుక్లా (రేవా)లను ఎంపిక చేసింది. కేంద్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు అసెంబ్లీ స్పీకర్‌గా అవకాశం ఇచ్చింది. ఈ నెల 3న ఎన్నికల ఫలితాలు వెలువడగా.. మధ్యప్రదేశ్ సీఎం ఎవరనేదానిపై అనేక ఊహాగానాలు వచ్చాయి. వీటికి తెరదించుతూ సోమవారం బీజేపీ అధిష్ఠానం మోహన్‌యాదవ్‌కు పగ్గాలు అప్పగించింది. పొరుగు రాష్ట్రం ఛత్తీసగఢ్‌లో ఆదివాసీ నేత విష్ణుదేవ్ సాయ్‌ను సీఎంగా ప్రకటించిన కమలం పార్టీ.. మధ్యప్రదేశ్‌లో బీసీ యాదవ వర్గానికి చెందిన నాయకుడికి పట్టం కట్టింది. ఈ రాష్ట్రంలో యాదవులు ప్రభావవంతమైన సామాజికవర్గం కాకున్నప్పటికీ.. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ ఎంపిక చేసినట్లుగా విశ్లేషకులు చెబుతున్నారు.

కాగా, సీఎం ఎవరో నిర్ణయించేందుకు బీజేపీ అధిష్ఠానం హరియాణ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, ఓబీసీ సెల్ జాతీయ చైర్మన్, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, జాతీయ కార్యదర్శి ఆశా లక్రాను పరిశీలకులుగా పంపింది. వీరు భోపాల్‌లో ఎమ్మెల్యేలు, శివరాజ్, తోమర్, ప్రహ్లాద్ పటేల్, కైలాష్ విజయవర్గీయ తదితరులతో సమావేశమయ్యారు. అనంతరం మోహన్‌ను బీజేపీ శాసనసభా పక్ష నేతగా ప్రకటించారు. సీఎంగా మోహన్ పేరును శివరాజ్ ప్రతిపాదించగా ప్రహ్లాద్, తోమర్, కైలాష్ సమర్థించారు. ఆ తర్వాత ఆపద్ధర్మ సీఎం శివరాజ్ పదవికి రాజీనామా చేశారు. మధ్యప్రదేశ్‌లో ఆయన శకం ముగిసినట్లేనని భావిస్తున్నారు. 2005 తర్వాత సీఎం ఎంపికకు పార్టీ పరిశీలకులను పంపడంతోనే శివరాజ్‌కు అవకాశం లేదని స్పష్టమైంది. మోహన్ బుధవారం ప్రమాణం చేయనున్నారు. అదే రోజు ఛత్తీస్‌గఢ్ సీఎంగా విష్ణుదేవ్ బాధ్యతలు స్వీకరిస్తారు.

మరోసారి బీసీకే చాన్స్

ఉమాభారతి, బాబూలాల్ గౌర్, శివరాజ్.. మధ్యప్రదేశ్‌లో 2003 నుంచి బీసీలనే సీఎం చేస్తున్న బీజేపీ.. ఈసారీ దానిని కొనసాగించింది. మోహన్‌యాదవ్ 1984 నుంచి బీజేపీలో ఉన్నారు. ఆర్ఎస్ఎస్‌కు అత్యంత విధేయుడు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉజ్జయిని దక్షిణ స్థానం నుంచి 2013 నుంచి గెలుస్తున్నారు. 2020లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాక ఏర్పడిన బీజేపీ సర్కారులో ఉన్నత విద్యా మంత్రిగా వ్యవహరించారు. మంత్రిగా మూడేళ్ల అనుభవంతోనే సీఎం అయ్యారు. రాష్ట్రం దాటి ఈయన ఎవరికీ తెలియదు. అయినప్పటికీ శివరాజ్, తోమర్ వంటి సీనియర్లను కాదని మోహన్‌పై పార్టీ విశ్వాసం ఉంచింది.

## 20లోగా పోలీసుల బదిలీలు!

**హైదరాబాద్, డిసెంబరు 11 (అక్షరం న్యూస్):**

ఈ నెల 20లోగా పోలీసు శాఖలో బదిలీలు ఉండవచ్చని తెలుస్తున్నది. ఈ నెల 20 తరువాత హోంశాఖపై సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టనున్నట్టు తెలిసింది. డీజీపీ ఆఫీసులోనే ఆయా విభాగాల ఏడీజీలు, ఉన్నతాధికారులతో సమావేశమవుతారు. గురువారం నుంచి పునఃప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత పోలీసు శాఖపై సమీక్ష ఉంటుందని చెప్తున్నారు. ఆయా విభాగాల పనితీరు, అధికారుల పనితనంపై డీజీపీ రవిగుప్తా, ఇంటెలిజెన్స్ ఏడీజీ శివధర్‌రెడ్డిని సీఎం స్పష్టమైన నివేదిక కోరినట్టు సమాచారం.

హోంశాఖను తన వద్దనే పెట్టుకున్న సీఎం.. కీలకమైన పోస్టుల ప్రక్షాళణ దిశగా అడుగులు వేస్తారన్న చర్చ మొదలైంది. ఈ నెల 20లోపే ఉన్నతాధికారుల బదిలీలు ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. అగ్నిమాపక విభాగాన్ని సైతం మరింత పటిష్ఠంగాగా తీర్చిదిద్దేందుకు సీఎం పూర్తిస్థాయిలో సమీక్ష చేపట్టనున్నట్టు తెలిసింది. హోంశాఖపై సమీక్షలో ఎలాం టి నిర్ణయాలు తీసుకుంటారు? ఎంతమంది అధికారులకు స్థానచలనం కల్పిస్తారు? శాంతిభద్రతలా




### కేసీఆర్‌కు చంద్రబాబు

## పరామర్శ





**హైదరాబాద్, డిసెంబరు 11 (అక్షరం న్యూస్):**

హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావును సోమవారం మాజీ సీఎం చంద్రబాబునాయుడు పరామర్శించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అబ్కారీశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహా పలువురు మాజీ మంత్రులు, సినీ ప్రముఖులు కేసీఆర్‌ను పరామర్శించారు. ఉదయం నుంచి రాత్రి దాకా రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన నేతలు కేసీఆర్‌ను పరామర్శించి ఆయన త్వరగా కోలుకొని ప్రజాజీవితంలో భాగస్వామి కావాలని ఆకాంక్షించారు.

అనంతరం మీడియాతో మాట్లాడారు. రోజంతా దవాఖానకు వచ్చే ప్రముఖులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ కవిత స్వాగతం పలికి కేసీఆర్ ఆరోగ్య వివరాలను వారికి వివరించారు. కేసీఆర్ త్వరగా కోలుకొని తిరిగి ప్రజాజీవితంలోకి రావాలని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. సోమవారం మధ్యాహ్నం 3.40 గంటలకు సోమాజిగూడలోని యశోద దవాఖానకు చేరుకున్నారు. ఆయనను కేటీఆర్ తోడ్కొని వెళ్లారు. కేసీఆర్ దగ్గరికి వెళ్లిన చంద్రబాబు.. ఆయన ఆరోగ్యం గురించి అడిగారు. ఆరోగ్యస్థితిగతులపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

24 గంటల్లో నడక గ్రేట్: చిరంజీవి, ప్రకాశ్‌రాజ్

కేసీఆర్ తిరిగి సాధారణ స్థితిలోకి రావాలని సినీ నటుడు చిరంజీవి, ప్రకాశ్‌రాజ్ ఆకాంక్షించారు. తుంటి ఎముక మార్పిడి శస్త్ర చికిత్స జరిగిన 24 గంటల్లోపే వైద్యులు కేసీఆర్‌ను నడిపించటంలో వైద్యులు అభినందనీయపాత్ర పోషించారన్నారు. కేసీఆర్ చికి త్స పొందుతూ కూడా సినీ పరిశ్రమ ఎలా ఉన్నదని ఆరా తీయయటం వారి దార్శనికతకు నిదర్శనమన్నారు. తెలంగాణ ప్రజల జీవితాలను మార్చిన కేసీఆర్ సర్వదా ఆదర్శవాది అని పేర్కొన్నారు.

కేసీఆర్ ఆదర్శవాది: చంద్రశేఖర్ ఆజాద్

ప్రస్తుత రాజకీయాల్లో బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదర్శవాది అని భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ పేర్కొన్నారు. ఉత్తర, దక్షిణ భారతానికి సంక్షేమ వారధి కట్టిన గొప్ప దార్శనిక పాలకుడు కేసీఆర్ అని కొనియాడారు. కేసీఆర్ త్వరగా కోలుకొని పీడితుల గొంతుగా నిలబడాలని ఆయన ఆకాంక్షించారు. దవాఖానలో ఉండి కూడా తమ కార్యకలాపాలు నిర్విఘ్నంగా సాగాలని కేసీఆర్ ఆకాంక్షించారని ఉదహరించారు. కేసీఆర్ త్వరగా కోలుకొని ప్రజాజీవితంలోకి అదే ఉత్సాహంతో రావాలని బీఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆకాంక్షించారు.

కోలుకుంటున్నారు: భట్టి విక్రమార్క

కేసీఆర్ ఆరోగ్యం కుదుటపడి త్వరగా కోలుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. హిప్ మార్పిడి జరిగిన తర్వాత ఎటువంటి ఇబ్బందులు లేకుండా కోలుకుంటున్నారని చెప్పారు. కేసీఆర్ ఆరోగ్యపరిస్థితులపై వైద్యులను అడిగి తెలుసుకున్నానని చెప్పారు. వారు త్వరగా కోలుకొని ప్రజాజీవితంలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు.

కేసీఆర్‌ను పరామర్శించిన వారిలో..

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, నమస్తే తెలంగాణ సీఎండీ, రాజ్యసభ సభ్యుడు దీవకొండ దామోదర్‌రావు, ఎంపీలు రంజిత్‌రెడ్డి, మాలోత్ కవిత, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, శంభీపూర్‌రాజు, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్, మహమూద్ అలీ, వీ శ్రీనివాస్‌గౌడ్, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కేవీ వివేకానంద్, బీ లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, నెమరుగొమ్ముల సుధాకర్‌రావు, బాజిరెడ్డి గోవర్ధన్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, బాల్క సుమన్, మహబూబాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ బిందు, జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, రాష్ట్ర మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు గజ్జెల నగేశ్, మేడె రాజీవ్‌సాగర్, రావుల శ్రీధర్‌రెడ్డి, రజనీ సాయిచంద్, బీఆర్ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీనర్సింహారావు తదితరులు దవాఖానలో కేసీఆర్‌ను పరామర్శించారు.

కేసీఆర్ కోసం ఏపీలో పూజలు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ నాయకులు సోమవారం పూజలు నిర్వహించారు. విశాఖపట్నం తూర్పు నియోజకవర్గంలోని సింహాచల ఆలయంలో శ్రీవరమహాలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో తలారి సురేశ్ ఆధ్వర్యంలో ఈ పూజలు కొనసాగాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ సర్కారు ముమ్మాటికీ

## పడిపోతుంది

చేర్యాల, డిసెంబరు 11: కాంగ్రెస్ సర్కారు ముమ్మాటికీ పడిపోతుందని, వారికి వారే ప్రభుత్వాన్ని తప్పక పడగొట్టుకుంటారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయామని బీఆర్ఎస్ కార్యకర్తలు కలత చెందవద్దని, ఎన్ని రోజులు పడుతుందో తెలియదుగానీ తిరిగి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందాక తొలిసారిగా సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి, చేర్యాలలో పర్యటించిన పల్లా.. కార్యకర్తలతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రగతి భవన్‌కు కంచె వేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. బీఆర్ఎస్ వచ్చాక పోలీసులకు నీడ కోసం షెడ్ మాత్రమే వేసిందని చెప్పారు.కంచె వేసింది, ఇప్పుడు రాజకీయం చేస్తూ తొలగించింది కాంగ్రెస్ అని అన్నారు. కాంగ్రెసలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నా ఢిల్లీకి పోవాల్సిందేనని చెప్పారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దేశానికి వన్నె తీసుకువచ్చే పథకాలు అమలు చేసిందని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రైతుబంధు, రుణమాఫీ, పంటకు రూ. 500 బోనస్ ఈ నెలలోనే అమలు చేస్తామని ప్రకటించినా.. చేతులెత్తేసిందన్నారు. విద్యుత్ రంగం పట్ల బీఆర్ఎసపై అసత్య ప్రచారం తగదన్నారు. పదేళ్లలో యాదాద్రి, భద్రాద్రి, భూపాలపల్లి, సింగరేణి తదితర విద్యుత్ ప్లాంట్లను నిర్మించి సాగు, ఇతర రంగాలకు 24 గంటల కరెంటు ఇచ్చామని పేర్కొన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు రాష్ట్రం రూ. 5లక్షల కోట్ల అప్పులో ఉందని దుష్ప్రచారం చేయడం సరికాదని పల్లా అన్నారు.

# జోరుగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా

### లబ్ధిదారుల నుంచి సేకరిస్తున్న చిరు వ్యాపారులు
### చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్న అధికారులు

**రాజన్న సిరిసిల్ల/ముస్తాబాద్/డిసెంబర్-11(అక్షరం న్యూస్)**

పేదలు కడుపు నిండా తినాలనే ఉద్దేశంతో రూపాయికే కిలో చొప్పున ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నది. జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. ప్రతినెలా రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని స్థానిక కిరాణా షాపులవారు లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి రైస్ మిల్లరకు విక్రయిస్తున్నారు. కొందరు రేషన్ డీలర్లే లబ్ధిదారుల నుంచి బియ్యం తీసుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు అప్పుడప్పుడు తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేస్తున్నప్పటికీ ఈ దందాను పూర్తిగా అరికట్టలేకపోతున్నారు. జిల్లా కేంద్రంతోపాటు ఇతర మండలాల్లో పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పోలీస్, రెవెన్యూ అధికారులు పట్టుకొని కేసులు నమోదు చేశారు. రేషన్ బియ్యాన్ని వ్యాన్‌లో తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని కేసులు నమోదు చేశారు.రేషన్ బియ్యం అక్రమాల్లో డీలర్ల పాత్ర కూడా వెలుగు చూస్తున్నది. కొన్ని చోట్ల డీలర్లే బియ్యం వ్యాపారం చేస్తున్నారు దళారులుగా మారి బియ్యం దందా చేస్తున్నారు. లబ్ధిదారుల ఇంటింటికీ తిరుగుతూ బియ్యం సేకరిస్తున్నారు. వాటిని పెద్దమొత్తంలో రైస్ మిల్లర్లకు విక్రయిస్తున్నారు. ఈ అక్రమ దందాపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టి కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.సగటున ప్రతినెలా కోటి రూపాయలమేర రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జోరుగా సాగుతుండగా పెట్టుబడి పోను సుమారు రూ.లక్ష మేర లాభాలు వస్తున్నట్లు తెలిసింది. కిలో రూ.8 నుంచి రూ.15 మేర కొనుగోలు చేసే వ్యాపారులు అక్రమార్కులకు కిలో రూ.20 రూపాయలు తీసుకుని అమ్ముతున్నారు. ఈ అక్రమార్కులు జిల్లా సరిహద్దులు దాటించి కిలో రూ.25







నుంచి రూ.30 వరకు హోల్‌సేల్‌గా అమ్ముతున్నారు. మామూళ్లు, రవాణా ఖర్చులు పోను రూపాయికి రూపాయి లాభం వస్తుండడంతో వ్యాపారుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది

మరికొంతమంది చిరు వ్యాపారులు ప్రజల నుంచి బియ్యాన్ని సేకరించి హోటళ్లకు స్థానికంగానే అమ్ముకుంటూ కిలోకు 4, 5 రూపాయల లాభం తీసుకుంటున్నారు. ఏదిఏమైనా రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం ఇటు చిరువ్యాపారులకు, అటు అక్రమార్కులకు కాసు ల వర్షం కురిపిస్తున్నాయి

## ఈ నెల 13 న ముస్తా బాద్ మండల సర్వసభ్య సమావేశం

**రాజన్న సిరిసిల్ల/ముస్తాబాద్/డిసెంబర్-11(అక్షరం న్యూస్)**



ముస్తాబాద్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ జనగామ శరత్ రావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నిర్ల రమాదేవి ఒక ప్రకటన లో తెలిపారు.ఈ సమావేశానికి మండలంలోని 22 గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అధికారులు తమ అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో హాజరుకావాలన్నారు.సమావేశంలో ప్రజా సమస్యలపై,అభివృద్ధి పై చర్చించడం జరుగుతుందన్నారు

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



**రాజన్న సిరిసిల్ల ముస్తాబాద్/డిసెంబర్-11(అక్షరం న్యూస్)**

మండల వ్యాప్తంగా పలు చోట్ల మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ముస్తాబాద్ సెస్, ఏఈ విష్ణు తేజ ఒక ప్రకటనలో తెలిపారు స్థానిక నామపూర్ విద్యుత్ 33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలో ముస్తాబాద్ బంధనకల్, మోహినికుంట,చిప్పల పల్లి, ట్రాన్స్ కో వారి విద్యుత్ పనులలో భాగంగా ఉదయం 11 గంటల నుంచి సాయం త్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.వినియోగ దారులు గమనించి సహకరించాలని కోరారు.

## అంగన్వాడీ కేంద్రంను తనిఖీ చేసిన ఎంపీపీ కళావతి.



**వరంగల్ జిల్లా /సంగెం /డిసెంబర్ 11/అక్షరం న్యూస్.**

మండలంలోని కుంటపల్లి గ్రామంలోని రెండు అంగన్వాడీ కేంద్రాలను ఎంపీపీ కందగట్ల కళావతి పరిశీలించారు. అంగన్వాడీ టీచర్లు సుజాత, విజయను పిల్లలకు ఇస్తున్న బలా అమృతం, గుడ్లు మరియు ఇతర పౌష్టిక ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లల కోసం వండిన వంటలను రుచి చూసి పరిశీలించి సూచనలు సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కావటి వెంకటయ్య ,ఉప సర్పంచ్ జక్క దుడయ్య ,కార్యదర్శి మొహమ్మద్ వాజిద్ మరియు వార్డు సభ్యులు చిర్ర సాంబా రాజు,మాడిశెట్టి భాగ్యలక్ష్మి,బోనాలప్రియాంక,ఎనపోతుల గోవర్ధన్ పాల్గొన్నారు.

## వృద్ధుడి అదృశ్యం

**హనుమకొండ/భీమదేవరపల్లి/డిసెంబర్ 11 (అక్షరం న్యూస్):**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొప్పూరు గ్రామానికి చెందిన వృద్ధుడు అదృశ్యమైనట్లు మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. మండలంలోని కొప్పూరు గ్రామానికి చెందిన కొమ్ముల గౌశయ్య (75) గత నెల 28 న వరంగల్ పెళ్లికి వెళ్లి కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గౌషయ్యకు కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తొమ్మిది రోజులు దాటినప్పటికీ తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని కుమారుడు కొమ్ముల అనిల్ కుమార్ ఈనెల 6 న మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఆచూకీ తెలిసినవారు కొమ్ముల అనిల్ కుమార్ సెల్ 9989769781 నంబర్ కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టు



ఓదెల/ పెద్దపల్లి డిసెంబర్ 11 (అక్షరం న్యూస్ ) ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోభారీ మెజార్టీ తో విజయం సాధించిన ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు కలిసి పూల బొకే అందించి శు భాకాంక్షలు తెలిసిన మారం తిరుపతిరెడ్డి పని సుదర్శన్ బండారి శ్రీనివాస్

## కానరాని మండల విద్యాధికారి

### సమయ పాలన పాటించని ప్రభుత్వ ఉపాధ్యాయులు
### ఉన్నది 4గురు,ముగ్గురు డుమ్మా
### ఆందోళనలో విద్యార్థులు తల్లిదండ్రులు

**రాజన్న సిరిసిల్ల/గంభీరావుపేట/డిసెంబర్ 11(అక్షరం న్యూస్)**

గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రైమరీ పాఠశాల కు సోమవారం ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాల సమయపాలన పాటించకపోవడంతో ప్రార్థన సమయానికి కూడా గేటు తాళం తీయలేక పోవడంతో విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే ప్రతి రోజు ప్రభుత్వ పాఠశాలల్లో 9:30 కి ప్రార్థన జరుగుతాయి.ఆ సమయంలో పాఠశాలలకు ఉపాధ్యాయులు తప్పని సరిగా హాజరు అవ్వడం జరుగుతది కానీ నర్మాల గ్రామంలో ఉన్న మండల పరిషద్ ప్రభుత్వ పాఠశాల కు నలుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఒకరు విద్యా వాలంటరీగా విధులు నిర్వహిస్తున్నారు.ఒకే రోజు ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొట్టడం వలన మిగతా ఉపాధ్యాయులు కూడా సమయానికి రాలేక పోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పిల్లలకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులే సమయం పాటించక పోతే విద్యార్థులు ఎలా సమయ పాలన పాటిస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఉపాధ్యాయులు విధి నిర్వహణలో స్థానికంగా ఉండాలనే ప్రభుత్వా నిబంధనను తుంగలో తొక్కిస్తున్నారు.విద్యాశాఖ అధికారులు తనిఖీలు లేకనే ప్రభుత్వ ఉపాధ్యాయులు విధులలో అలసత్వం వహిస్తున్నారని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.సంభంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి సమయ పాలన పాటించని ఉపాధ్యాయుల పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు కోరారు.




## డ్రైవర్ నిర్లక్ష్యంతో గిరిజన మహిళ మృతి

**అక్కన్నపేట/సిద్దిపేట డిసెంబర్ 11 (అక్షరం న్యూస్)**

డ్రైవర్ అజాగ్రత్తతో మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం అక్కన్నపేట మండలం సోమాజీతండా లో జరిగింది.పోలీసుల వివరాల ప్రకారం... సోమవారం ఉదయం మృతి చెందిన గిరిజన మహిళ భూక్యా లక్ష్మి (70) కొడుకు,కోడలు,మనవడు హైదరాబాద్ వెళ్ళడానికి బంగారురులోద్ది తండా వద్ద ఉదయం 7.30 గంటలకు హుస్నాబాద్ డిపోకు చెందిన మినిబస్ టిఎస్ 36 జెడ్ 0022 గల బస్ లో ఎక్కుతుండగా మనువడు డబ్బులు కావాలి అని అడగగా ముఖం కడుగుతున్న ఆమె బస్ ముందర నుండి వచ్చి మనువడికి డబ్బులు ఇవ్వబోతుండగా బస్ డ్రైవర్ పతంగి రవీందర్ అజాగ్రత్తగా బస్ ను ముందుకు తీసుకోవడం వల్ల ఆమె బస్ వెనుక టైర్ కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది.మృతురాలి కొడుకు భూక్యా రాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

## విజేతలకు బహుమతులు అందజేసిన సర్పంచ్



**ఓదెల/పెద్దపల్లి డిసెంబర్ 11(అక్షరం న్యూస్ )**

ఓదెల మండలంలోని పెద్ద కొమిర గ్రామంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పబ్బ అజయ్ గౌడ్ స్మరకర్థం కొమిర , భీమరపల్లి గ్రామాల స్థాయి ఫ్రీ షటిల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు ముఖ్య అతిథిగా సర్పంచ్ మూల ఉమామహేశ్వరి , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి. హాజరై తెలిసిన విజేతలకు బహుమతులు అందజేశారు. డబుల్ స్లో మొదటి బహుమతి సతీష్. సుబ్బు...ద్వితీయ బహుమతి విజయ్ .సాయి మరియు సింగిల్స్ లో మొదటి బహుమతి సతీష్ ద్వితీయ బహుమతి సురేష్ రెడ్డి గెలుపొందగా వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ. యువత చెడు మార్గంలో పోకుండా క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని, గెలుపు ఓటములు సహజమని , యువతకు క్రీడల్లో ఎలాంటి సహాయం కావాలన్నా మేమున్నామని వారన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోలి లింగారెడ్డి. మాజీ సర్పంచ్ జక్కుల వెంకటస్వామి.. హనుమాన్ యూత్ సభ్యులు. గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## తెప్పోత్సవం ఉత్సవాల్లో పాల్గొనవలసిందిగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కి ఆహ్వానం



**భద్రాద్రి కొత్తగూడెం/ భద్రాచలం/డిసెంబర్ 11/ అక్షరం న్యూస్ :**

ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ని కలిసిన శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థాన కార్యనిర్వహణాధికారిని రమాదేవి,ఏఈ వో భవాని రామకృష్ణ, ఈ ఈ రవీంద్ర రాజు .ఈనెల 22,23 తేదీలలో భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెప్పోత్సవం మరియు ద్వార దర్శనం ఉత్సవాల్లో పాల్గొనవలసిందిగా భద్రాచలం శాసనసభ్యులు డా. తెల్లం వెంకట్రావు కి ఆలయ కార్యనిర్వహణాధికారులు గౌరవపూర్వకంగా ఆహ్వానం ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు గాడి. విజయ్, కోశాధికారి మాచినేని భాను తదితరులు పాల్గొన్నారు...

## సిమెంట్ బెంచీల వితరణ

**కోహెడ/సిద్దిపేట,డిసెంబర్ 11 (అక్షరం న్యూస్)**

కూరెల్ల గ్రామంలోని చేపూరి కనుకవ్వ లక్ష్మీనారాయణ పటేల్ దంపతులు మరణించగా వారి జ్ఞాపకార్థం వారి కుమారులైన చేపూరి రవీందర్ పటేల్ ప్రభాకర్ పటేల్ చేపూరి సుధాకర్ పటేల్ చేపూరి మహేందర్ పటేల్ కూరెల్ల గ్రామంలో సర్పంచ్ గాజుల రమేష్ పటేల్ సమక్షంలో వివిధ చౌరస్తాలలో 10 సిమెంట్ బెంచీలను విరాళంగా అందించారు. తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ 10 సిమెంట్ బెంచీలను 35000 వేల రూపాయల విలువ గ్రామంలోని వివిధ కూడళ్ళలో వేసినట్లు విరాళంగా అందించినట్లు వారు తెలిపారు. సర్పంచ్ గారు మాట్లాడుతూ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సిమెంట్ బెంచీలను అందించినందుకు చేపూరి రవీందర్ ప్రభాకర్ సుధాకర్ మహేందర్ ను అభినందించినారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గాజుల రవీందర్ కొనవేని మంజుల రాజు బండారి స్రవంతి రమేష్ చిట్యాల లక్ష్మీ శంకర్ గ్రామస్తులు చేపూరి శ్రీశైలం చేపూరి సత్తయ్య గాజుల మల్లయ్య తోట రాజయ్య తోట వెంకన్న బండారి రవీందర్ గాజె కృష్ణమూర్తి గాజుల సత్తయ్య పటేల్ కొండేటి రమేష్ బండారి బాబు మరియు తదితరులు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన టిఎమ్.టిడిఏ యూనియన్



**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / డిసెంబర్ 11/ అక్షరం న్యూస్ :**

మోతినగర్ ఆదివారం మోతినగర్ కమ్యూనిటీ హాల్ లో జరిగిన తెలంగాణ మూవీ, టీవీ అండ్ డిజిటల్ ఆర్టిస్ట్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం విజవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు ఏ.రాజశేఖర్ మాట్లాడుతూ.. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి పదవిని అధిష్టించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. యూనియన్ లో నూతనంగా చేరిన సభ్యులకు యూనియన్ స్థాపన, అభివృద్ధిని వివరిస్తూ ప్రస్తుత కమిటీ యూనియన్ నూతన భవన సముదాయం కోసం ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. త్వరలో పూర్తి చేయాలని ఆ దిశగా ప్రస్తుత కార్యవర్గం సభ్యులు కృషి చేస్తున్నారని తెలియజేసారు. తరువాత యూనియన్ కోశాధికారి నూకరాజు మాట్లాడుతూ యూనియన్ లో జరిగిన జమా ఖర్చుల గురించి సభ్యులకు వివరించి, సభ్యులు అడిగిన సందేహాలని నివృత్తి చేయడం జరిగింది. అనంతరం యూనియన్ ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. యూనియన్ లో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి సభ్యులకు వివరించారు. సమావేశంలో యూనియన్ ఫౌండర్ ప్రెసిడెంట్ సి.ఎస్.సుందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మునింద్ర బాబు, ఉపాధ్యక్షులు శ్రీమతి పద్మరేఖ, శ్రీనివాస్ రాథోడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె.పుల్లారెడ్డి, జాయింట్ సెక్రెటరీలు కనకదుర్గమ్మ, విరేష్, యూనియన్ ఎక్సిక్యూటివ్ కమిటీ మెంబర్స్, ఫౌండర్ మెంబర్స్, సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


## రాజీవ్ ఆరోగ్య శ్రీ పది లక్షల రూపాయల పథకాన్ని ప్రారంభించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్. నాగరాజు



**వరంగల్ జిల్లా/ వర్ధన్నపేట నియోజకవర్గం / అక్షరం న్యూస్**

:వర్ధన్నపేట శాసనసభ్యునిగా అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసి ఈరోజు మొట్టమొదటిసారిగా భారీ ర్యాలీగా వర్ధన్నపేట గడ్డ మీదకు రావడం జరిగింది. మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం పూల వేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్. నాగరాజు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాకు ఓటు వేసి నన్ను అత్యధిక మెజారిటీతో గెలిపించిన మీ అందరికీ ఎల్లవేళలా మీకుఅందుబాటులో ఉంటాను అన్నాడు. ఎల్లవేళలా మీ సమస్యలను పరిష్కరిస్తానని తెలియజేప్పాడు. తదనంతరం తల్లి సోనియా గాంధీ ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సదుపాయం పది లక్షలు రూపాయల పథకాన్ని వర్ధన్నపేట గవర్నమెంట్ హాస్పిటల్ లో ప్రారంభించాడు . ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు తో పాటు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు వరంగల్ జిల్లా డిఎంహెచ్ఓ వెంకట రమణ, హాస్పటల్ సూపర్డెంట్ స్వామి, డాక్టర్లు, హాస్పిటల్ సిబ్బంది తో పాటు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి పథకాలను ప్రారంభిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి






**హన్మకొండ జిల్లా /పశ్చిమ నియోజకవర్గం /అక్షరం న్యూస్ :**

కాంగ్రెస్ ఎన్నికల గ్యారంటి హామీల్లో భాగంగా ఈ రోజు హన్మకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో వరంగల్ పశ్చిమ ఎంఎల్ఏ నాయిని రాజేందర్ రెడ్డి ముందుగా ఆరోగ్య శ్రీ చేయూత పథకాన్ని ప్రారంభించాడు. ఈ సందర్భంగా నాయని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రజలందరికి ప్రభుత్వమే వైద్యం అందించాలన్న లక్ష్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని విస్తరిస్తూ ఒకొక్క కుటుంబానికి ఏడాదికి పది లక్షల పరిమితితో అందిస్తున్నాం అన్నాడు. రాష్ట్రంలోని పేదలందరికీ ఉచితంగా కార్పోరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రారంభించిన రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పది లక్షలకు పెంచింది, ఈ పథకం ఈ నెల తొమ్మిది తేది నుండి అమలులోకి వచ్చిందని అన్నాడు. ఇప్పటిదాకా ఈ పథకం కింద ఒకొక్క కుటుంబానికి ఏడాదికి రూ. ఐదు లక్షల వరకు పరిమితి ఉండేదని, ఇప్పుడు దీన్ని రెట్టింపు చేసామని, ఇప్పుడు ఈ పథకం అన్ని ఆరోగ్య శ్రీ ఎం ప్యానల్ ఆసుపత్రుల్లో తక్షణమే అమల్లోకి వస్తుందని అన్నాడు. అనంతరం హనుమకొండ బస్టాండ్ వద్ద మహాలక్ష్మి పథకాన్ని ఎన్నికల గ్యారంటి హామీల్లో భాగంగా ఈ రోజు మాహలక్ష్మి పథకాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హన్మకొండ బస్టాండ్ వద్ద జెండా ఊపి బస్సు ను ప్రారంభించడు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిల బెట్టుకుందని అన్నాడు ఇచ్చిన మాటను నిలుపుకున్న కాంగ్రెస్ పార్టీని మహిళలు ఎప్పుడు మరవవద్దని అన్నాడు. అణా పైసా ఖర్చు లేకుండా ఆర్టిసి బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుండి ఎక్కడికైనా ప్రయాణించడానికి వీలు కల్పించేదిమహాలక్ష్మి పథకం అని అన్నారు. బస్ పాస్ లతో ప్రయాణించే విద్యార్థినిలకు, ప్రైవేటు ప్రభుత్వ ఉద్యోగునిలకు ఈ పథకం చాల దోహదం చేస్తోంది. ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నాడు. మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పతకాలను అమలు చేస్తోందని అలాగే కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీ స్కీమ్ లను వంద రోజులల్లో పూర్తి చేస్తామని అన్నాడు. అనంతరం ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి,మహిళా కార్యకర్తలతో బస్సులో కాజిపేట,కాజిపేట నుండి వేయి స్థంబాల గుడి వరకు ప్రయాణించాడు. ఈ కార్యక్రమాలలోఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఏ పీడీ శ్రీనివాస్ కుమార్, దమహెూ డి యమ్ హెచ్ ఓ సాంబశివరావు, కే యం సి ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్ జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్ శ్రీమాన్, రెడ్ క్రాస్ రాష్ట్ర ఈసీ మెంబెర్ ఈ.వి. శ్రీనివాస్ తోపాటు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, ఆర్టిసి ఆర్ యం శ్రీలత అధికారులు ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాల పై కొరవడిన నిఘా ..

**ప్రభుత్వ నిబంధనలు పక్కాగా అమలు చేయాలని అన్నదాతల వేడుకోలు**

**రాజన్న సిరిసిల్ల/ముస్తాబాద్/డిసెంబర్-11(అక్షరం న్యూస్)**

ఫర్టిలైజర్ షాపులపై నిఘా కొరవడిందిఫర్టిలైజర్ షాపులు బోర్డులపై ధరల పట్టిక నమోదు చేయరు%ౌ% వారిష్టానుసారం రైతులకు విత్తనాలు విక్రయిస్తూ కొందరికి బిల్లులు ఇస్తున్నారు%ౌ% మరికొందరికి బిల్లులు కూడా ఇవ్వకుండా అధిక ధరలకు విత్తనాలు అమ్మకాలు నిర్వహిస్తున్నారని రైతుల మండిపడుతున్నారు. వ్యాప్తంగా ఫర్టిలైజర్ షాపుల వ్యాపారులు వరి మిర్చి, పత్తి విత్తనాలకు అధిక ధరల విక్రయిస్తున్నారని సమాచారం. అధికారులు మాత్రం నిబంధనలను పాటించని వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు కూడా ఈ సీజన్లో భారీగా అవి చెందుతాయని ఒక నానుడి. దీనికి తోడు ఎన్నికలు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులకు ఎన్నికల విధులు పడడంతో ఆడిందే ఆట పడిందే పాటలగా కొనసాగింది ఈ సీజన్లో కొన్ని కంపెనీల విత్తనాలతో పాటు నకిలీ విత్తనాలు కూడా విక్రయాలు జరుగుతున్నాయని తెలుస్తుంది. కొంతమంది రైతులు నకిలీ విత్తనాలతో నష్టాలు పాలై అప్పులు ఊబిలో ఊరుకుపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కొందరు రైతులు ఏకంగా ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు లేకపోలేదు. రైతులు బహిరంగంగా అధికారులకు ఫిర్యాదు చేసిన సందర్భాలు ఉన్నాయి.. అప్పుడు హడావుడి చేసే అధికారులు ముందుగానే రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించేలా చర్యలు తీసుకుంటే బాగుంటుంది .పల్లెల్లో రైతులు విత్తనాలు షాపులకు వెళ్తుంటే.. మా షాపులో స్టాక్ లేదని చెప్తూ వేరే షాపు నుండి తెప్పిస్తామంటూ అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం. పెద్ద ఎత్తున బ్లాక్ మార్కెట్లో విత్తనాలు వ్యాపారం చేస్తున్న అధికారులు నమ్మక నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని రైతుల మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి స్టాక్ లేదు అంటూ ప్రచారం చేస్తూ మార్కెట్ నిర్వహిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రైతుల కోరుతున్నారు

ఆవులు పద్ద ఆర్నేళ్లకు

ఆవులు పద్ద ఆర్నేళ్లకు

బోయులు చేను వద్దకు వెళ్లిన చందంగా వ్యవసాయాధికారుల తీరు ఉందని మండలంలోని రైతులు విమర్శిస్తున్నారు. పంటలు సాగు చేసే సయమంలో తనిఖీలు చేయడం లేదని.. సీజన్ దాటిన తర్వాత వచ్చి ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేయడంలో ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలను పక్కనబెట్టి వ్యవసాయ శాఖ అధికారులు ఫర్టిలైజర్ వ్యాపారులతో కుదుర్చుకున్న ఒప్పందాలతో మూడు పువ్వులు ఆరు కాయల చందంగా కొనసాగుతుంది అన్నారు. గతంలో ఫర్టిలైజర్ షాపుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీల్లో పెద్ద ఎత్తున నకిలీ మందులు బయటపడ్డాయని, రోజులు గడుస్తున్నా షాపుల నిర్వాహకులపై వ్యవసాయాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా రైతులకు ప్రభుత్వం అందించే ఎరువులు, పురుగు మందు





లు, విత్తనాల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా జిల్లా వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

వారములో తనిఖీలు పూర్తి చేయబడతాయి.

మొన్నటి వరకు ఎలక్షన్ డ్యూటీ లే చేసాము... ఈ వారం లో తనికీలు అన్ని పూర్తి చేయ బడతాయి .... ఇప్పటికే నమూనా ల సేకరణ పూర్తి చేయటం జరిగింది అని వ్యవసాయ అధికారి వెంకటేష్ తెలిపారు

## చికెన్ అమ్మకాల పై పర్యవేక్షణ ఏది..?

**మండల కేంద్రంలో జోరుగా సాగుతున్న చికెన్ వ్యాపారం**
**కనీస నియమాలు పాటించని వ్యాపారులు**
**అడుగు అడుగున మోసమే,**
**చికెన్ కొనుగోలుదారుల కు నష్టమే అయినా పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం,**
**ఇప్పటికైనా ప్రభుత్వం అప్రమత్తం అయి చర్యలు తీసుకోవాలని ప్రజల ఆవేదన.**
**కానరాని తునికలు, కొలతల అధికారులు?**



**రాజన్న సిరిసిల్ల/ముస్తాబాద్/డిసెంబర్-11(అక్షరం న్యూస్)**

చికెన్ కొనుగోలుదారుల కి చికెన్ కొనబోతే చికెన్ తునికల లో మోసమే కనిపిస్తుంది, నాణ్యమైన చికెన్ అందించడం లో వ్యాపారుల నిర్లక్షం, చికెన్ అమ్మకానికి ముందే ఎక్కువ బరువు కోసం నీటిలో ఉంచడం, కొనుగోలు సమయంలో వేసిన తుకం బయట తుకానికి తేడాలు ఉండటం, కొనుగోలు చేసిన చికెన్ కవర్ లో వాటర్ రావడంతో ప్రజలు మోస పోతున్నామని తెలిసిన తప్పనిసరిగా నిత్యావసర సరుకు గా మారిన చికెన్ కొనక తప్పడం లేదని వాపోతున్నారుచుట్టుపక్కల ప్రాంతాల నుండి కూలీ పనులు చేసుకోవడనికి వచ్చినవారు అనేక మంది మండల కేంద్రం కు వస్తారు చికెన్ కొనుగోలుదారుల లో అధిక శాతం మంది ఈ కూలీ లే ఉంటారు. వీరి యొక్క డబ్బులను, సాధారణ ప్రజల ను చికెన్ వ్యాపారులు నాణ్యమైన చికెన్ ఇవ్వకుండా దోసుకుంటున్నారు. చికెన్ షాపుల్లో ఖచ్చితమైన తూనికలు, ధరలను పాటించే ల అధికారులు చర్యలు తీసుకోవాలని. మండల ప్రజలు కోరుతున్నారు

## రుద్రమ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ శ్రేణులు



**రాజన్న సిరిసిల్ల/ముస్తాబాద్/డిసెంబర్-11(అక్షరం న్యూస్)**

బిజెపి అధికార ప్రతినిధి రాణి రుద్రమ రెడ్డి జన్మదిన సందర్భంగా బిజెపి జిల్లా కార్యాలయ సహాయ కార్యదర్శి బాధ నరేష్ ఆధ్వర్యంలో చీకోడు బిజెపి నాయకులు రాణి రుద్రమ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసారు. ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు వారు నిండు నూరేళ్లు ఆయువు ఆరోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యాలయ సహాయ కార్యదర్శి బాధ నరేష్ బిజెపి సీనియర్ నాయకులు గున్నాల రమేశ్ గౌడ్ ఉరాడి రాజు యాదవ్ గున్నాల రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

**రాజన్న సిరిసిల్ల/ముస్తాబాద్/డిసెంబర్-11 (అక్షరం న్యూస్)**

కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ ను సోమవారం సిద్దిపేట లో ముస్తాబాద్ కాంగ్రెస్ శ్రేణులు కలిసారు శుభాకాంక్షలు తెలియజేశారు శాలువాతో పూలమాలతో ఘనంగా సత్కరించారుకలసిన వారిలో దీటి నర్సింలు, యాగండ్ల మల్లేష్, మాడుగుల కిషన్, మచ్చ కొండయ్య వేముల వెంకట్ గౌడ్ తదితరులు ఉన్నారు వారికి పొన్నం కృతజ్ఞతలు తెలియజేశారు



## ఆర్టికల్ 370 పై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమైనది

**మండల బిజెపి అధ్యక్షులు కోనం విట్టల్**




**మెదక్ బ్యూరో / పెద్ద శంకరంపేట/( అక్షర న్యూస్):**

కేంద్ర ప్రభుత్వం 370 ఆర్టికల్ రద్దు చేయడానికి సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషనర్లపై సుప్రీంకోర్టు తాజాగా విలువరించిన తీర్పు చారిత్రాత్మకమైనదని పెద్ద శంకరంపేట మండలం బిజెపి అధ్యక్షులు కోణం విఠల్ పేర్కొన్నారు.. సోమవారం పెద్ద శంకరంపేట లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులో ఆర్టికల్ 370 రద్దు చేయడం అనేది కేంద్ర ప్రభుత్వం పరిధిలో తీసుకున్న నిర్ణయం అనీ తేల్చి చెప్పడంతోపాటు.. పార్లమెంట్ నిర్ణయాన్ని కొట్టి పారేయలేమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రమాడ్. నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బెంచ్ తీర్పు ఇచ్చిందన్నారు.. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంలో తాము జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది అన్నారు.. ఆర్టికల్ 370 యుద్ధ నేపథ్యంలో కుదుర్చుకున్న తాత్కాలిక ఏర్పాటు మాత్రమే అని.. జమ్మూ కాశ్మీర్ కు సార్వభౌమాధికారం లేదని భారత రాజ్యాంగం పైనల్ అని స్పష్టం చేసింది అన్నారు.. సెప్టెంబర్ 30.. 2024 లోగా జమ్ము కాశ్మీర్ లో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది అని అన్నారు.. ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు శ్రావణ్ కుమార్ మంగళ కృష్ణ బొగడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు..

## మా బతుకులకు భరోసానివ్వండి .. ఆటో డ్రైవర్ల ఆవేదన



**రాజన్న సిరిసిల్ల/ముస్తాబాద్/డిసెంబర్-11(అక్షరం న్యూస్)**

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టడం గొప్ప విషయమే అయినప్పటికీ వాహన రంగంపై ఆధారపడిన డ్రైవర్ల బతుకులు రోడ్డున పడే ప్రమాదముందని ఆటో యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు రోజుల్లోనే తమ బతుకులు అగమ్యగోచరంగా మారాయని చెప్పారు. పదేండ్లలో ఎప్పుడూ ఆటో డ్రైవర్లు ఇంతలా ఇబ్బంది పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు ఉచిత బస్ సౌకర్యం వల్ల ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అప్పు తెచ్చి మరీ ఆటో కొని నడిపే ఆటో డ్రైవర్ మాత్రం చాలా నష్టపోయే అవకాశం ఉంది. అసలు మేము ఎలా బతకాలి.. అంటూ కొందరు ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు 1000 వస్తే కూడా మాకు గిట్టుబాటు కాదు. పెట్రోల్ ఖర్చులు, గ్యాస్ ఖర్చులు, ఫైనాన్స్ అన్నీ చూస్తే మాకు మిగిలేది ఏం ఉండదు. మాకు కూడా ఏదైనా చేస్తే అప్పుడు మేము నష్టపోకుండా ఉంటాం. మహిళలకు ఏదైనా బెనిఫిట్ జరుగుతున్నప్పుడు అలాగే ఆటో వాళ్లకు కూడా అంతో ఇంతో ఉపయోగం ఉండేలా చేయాలని మరికొందరు మానవతా దృక్పథంతో ఆటో డ్రైవర్లను కూడా ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు చెప్పుకొచ్చారు.

## ఉపాధి హామీ పనులను ప్రారంభించిన ఎంపీపీ కందగట్ల కళావతి.




**వరంగల్ జిల్లా /సంగెం /డిసెంబర్ 11/అక్షరం న్యూస్.**

సంగెం మండలం ఎంపీపీ కందగట్ల కళావతి నరహరి గుండేటి బాబు సర్పంచ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో 8 లక్షల రోడ్డు ఫామేషన్ వర్క్ ను సంగెం గ్రామంలోనీ నక్కల తోము నుండి మదరపు భాస్కర్ భూమి వరకు ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి హామీ పనికి వచ్చిన కూలీలకు కొలతల ప్రకారం పని చేస్తే ఒక్క రోజు వేతనం 272 రూపాయలు వస్తాయి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంగెం ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య , రైతు బంధు అధ్యక్షులు కందగట్ల నరహరి ,మెట్టిపల్లి ఏలీయా బీజె ఇ గణేష్ ఇంచార్జీ, ఏ పి ఓ రమేష్, ఎఫ్ ఓ ఉపేందర్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న మంత్రి పొంగులేటి..

**ఖమ్మం జిల్లా /ఖమ్మం రూరల్ / డిసెంబర్ 11 / అక్షరం న్యూస్:/**

విజయవాడ కనకదుర్గమ్మ ను తెలంగాణ రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాధురి దంపతులు దర్శించుకున్నారు. వీరి వెంట మంత్రి సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి శ్రీలక్ష్మి దంపతులుకూడ ఉన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి రెండు తెలుగు రాష్ట్రాలు ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు మంత్రి తెలిపారు. తొలిత వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి ఆలయకమిటీ సభ్యులు మంత్రి పొంగులేటి కి ఘన స్వాగతం పలికారు. శాలువా మెమొంటోను అందజేసి మంత్రి పొంగులేటిని ఆలయ మర్యాదలతో సత్కరించారు.



# కంపుకొడుతున్న మూత్రశాలలు

## నిర్వహణ కరువు

**రాజన్న సిరిసిల్ల/ముస్తాబాద్/డిసెంబర్-10(అక్షరం న్యూస్)**

ముస్తాబాద్ పట్టణంలోపాత బస్టాండ్ లో ఏర్పాటు చేసిన మూత్రశాలలు నిర్వహణ, పర్యవేక్షణ కరువై కంపు కొడుతున్నాయిగతంలో మూత్రశాలలను నిర్మించారు. వీటికి నిత్యం నీటి సౌకర్యం కల్పించాల్సి ఉండగా అటువంటి ఏర్పాట్లేమీ చేయలేదు. దీనితో మండల కేంద్రానికి పనుల మీద వచ్చిన ప్రయాణికులు నానా ఇబ్బందులకు గురి అవుతున్నారు. మూత్ర శాలలకు వెళ్లకుండా పక్కనే ఉన్న మురుగునీటి కాలువలో పోస్తుండదతో రోడ్ పై నుండి నడిచే వారు ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఆ ప్రాంత ప్రజలు దుర్వాసనతో నరకం చూస్తున్నారు.ఇప్పటికైనా పాలకవర్గం, అధికారులు స్పందించి, మూత్రశాలల నిర్వహణపై దృష్టి సారించాల్సి ఉంది.

**ఎవరికి చెప్పుకోవాలె ?**

మహిళల పరిస్థితి మరీ అధ్వానం తయారైంది

కడుపునొప్పి సమస్యతో సతమతమయ్యే పరిస్థితి దాపురించింది. మహిళా లు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు స్వచ్ఛ భారత్ చేపట్టే ఉన్నతాధికారులు ఉండే మండలం లో తమ పరిస్థితి ఎవరికీ చెప్పుకోలేని విధంగా మారిందని వారు వాపోతున్నారు

**మార్గదర్శకాల ప్రకారం**

ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరుగుదొడ్డి మూత్రశాలల వసతులు కల్పించవలసి ఉంది

స్వచ్ఛభారత్ మార్గదర్శకాల ప్రకారం ప్రతి జనాభా కు ఒక మరుగుదొడ్డి (సీటు) చొప్పున అందుబాటులో ఉండాలి గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ అవసరాల నిమిత్తం నిత్యం వందల మంది పట్టణానికి షాపింగ్ కు వస్తూ కొనుగోలుకు వస్తూ ఉంటారు వీరందరికీ సరిపడా సదుపాయాలు లేవు జనసంచారం ఎక్కువ ఉండే చోట మరుగుదొడ్ల అవసరాలు ఎక్కువగా ఉంటాయి అయితే జనాభా తిరిగే చోట మూత్రశాలులు నిర్మాణానికి స్థలాలు లేకపోవడం సమస్యగా మారింది ఉన్న నిర్మించిన మూత్రశాలను పట్టించుకునే వారే లేరు

**మహిళల పరిస్థితి దారుణం**

మండలంలో వచ్చిన మహిళలకు కాలకృత్యాలు తీర్చుకోవడం కష్టంగా మారింది సరిపడా ప్రజా మరుగుదొడ్లు లేక ఇబ్బందికర పరిస్థితి నెలకొంది .కేవలం బస్టాండ్ లో మాత్రమే మరుగుదొడ్లు



ఉండడంవల్ల మహిళల బాధ వర్ణాతీతంగా మారింది. ఇంటికి వెళ్లే దాకా భరించడం తప్పడం లేదు. దీంతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు మహిళలకు వేరువేరుగా అధునాతన మరుగుదొడ్లు మూత్రశాలలు సదుపాయాన్ని కల్పించావాల్సిన అవసరం.ఎంతైనా ఉంది

రెండు రోజుల్లో

**వినియోగంలోకి తెస్తాం**

ఇదే విషయం పై ముస్తాబాద్ ఇంఛార్జీ అధికారిని చారవణిలో వివరణ కోరగా నూతన డోర్ లు చెపిస్తున్నామని త్వరలో ఫీటింగ్ చేసి బ్లీచింగ్ చల్లి అందుబాటులో కి తెస్తామన్నారు

# రద్దీవేళ సంయమనం పాటించాలి

**పొరపాట్లను గుర్తిస్తే ప్రయాణికులు యాజమాన్యం దృష్టికి తీసుకురావాలి**

**టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సూచన**

**మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలు పరిశీలన**





**హైదరాబాద్ డిసెంబర్ 11 (అక్షరం న్యూస్)**

రద్దీ సమయాల్లో ప్రయాణికులు కొంత సంయమనం పాటించి.. సిబ్బందికి సహకరించాలని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన 'మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం' అమలు తీరును సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హైదరాబాద్‌లోని జూబ్లీబస్ స్టేషన్ (జేబీఎస్)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.జేబీఎస్-ప్రజ్ఞాపూర్, జేబీఎస్-జనగామకు వెళ్లే పల్లెవెలుగు బస్సుల్లో, బాన్సువాడకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉన్న మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణ సౌకర్యం అమలవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. జేబీఎస్-వెంకట్‌నగర్ (రూట్ నంబర్ 18) సిటీ ఆర్డినరీ బస్సుల్లో మెట్టుగూడ వరకు ప్రయాణించారు. అందులో మహిళా ప్రయాణికులకు జీరో టికెట్‌ను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎక్కడైనా చిన్నపాటి పొరపాట్లు జరిగితే ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకురావాలని కో రారు. 24 గంటలు అందుబాటులో ఉండే సం స్థ కాల్ సెంటర్ 040-69440000,040-23450033 ఫోన్ చేసి చెప్పాలని సూచించారు. వాటిని వెంటనే సరిదిద్దుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంస్థ అన్ని ఏర్పాట్లు చేసిందని చెప్పారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించే మహిళలు ఆధార్ కార్డులను చూపించి, సంస్థకు సహకరించాలని కోరారు. ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రవేశపెట్టగానే రద్దీ పెరిగిందని, అందుకు అనుగుణంగా బస్సులను నడిపేందుకు కార్యాచరణ రూపొందించామని ఎండీ చెప్పారు.

# మంచిని మెచ్చుకుంటాం..తప్పును ఎత్తిచూపుతాం

**చెరిపేస్తే చెరగనిది కేసీఆర్ పాలన**

**శిలాఫలాకాలను ధ్వంసం చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి**

**ఎన్నికల్లో ప్రజాతీర్పును గౌరవించాం**

**మాజీ ఎంపీ వినోద్‌కుమార్**

**హైదరాబాద్ డిసెంబర్ 11 (అక్షరం న్యూస్)**

కాంగ్రెస్ ప్రభుత్వం మంచి పనులు చేస్తే మెచ్చుకుంటామని, అదే సమయంలో చెడు పనులు చేస్తే ఎత్తిచూపి ఎండగడతామని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొలువుదీరి కనీసం నాలుగు రోజులైనా కాలేదని, ఇప్పుడే ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరైంది కాదని తాము భావించామని, కాంగ్రెస్ నాయకు లు, కార్యకర్తలు సృష్టిస్తున్న జుగుప్సాకరమైన అంశాలపై మాట్లాడాల్సి వస్తున్నదని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాతీర్పును తాము గౌరవిస్తామని, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి సం పూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. తమ పార్టీ నాయకులు, ఓడినంత మాత్రాన ప్రజలకు దూ రంగా ఉంటారని అనుకోకూడదని చెప్పారు.

తెలంగాణ ప్రజల పక్షాన నిలబడుతాం

నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం బీఆర్ఎస్ పార్టీ అనేక త్యాగాలు చేసిందని వినోద్‌కుమార్ తెలిపారు. తాము కచ్చితంగా తెలంగాణ ప్రజల పక్షాన నిలబడతామని, ప్రజలకు మంచిచేస్తే అభినందించడం తమ సంస్కారమని పేర్కొన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలపై ఉన్న శిలాఫలకాలను కాంగ్రెస్ నాయకులు ధ్వంసం చేయడం దారుణమ ని పేర్కొన్నారు. ప్రగతిభవన్‌లో కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అని రాసి ఉన్న శిలాఫలకంపై మట్టిపూయడం ఏ సంస్కృతికి నిదర్శనమని ప్రశ్నించారు. ప్రగతిభవన్‌లో, ఎమ్మెల్యేల క్యాంపు



కార్యాలయాల శిలాఫలకాలపై ఉన్న పేర్లు అంటే కాంగ్రెస్ పార్టీకి అ క్కసు ఎందుకని ఆయన ప్రశ్నించారు.

కాంగ్రెస్‌వి అప్రజాస్వామిక చర్యలు గొల్ల, కురుమల సంఘం నేత గోసుల

ఎన్నికల్లో గెలిచిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పలువురు కాంగ్రెస్ నేతలు అప్రజాస్వామిక దా డులకు పాల్పడుతున్నారని, గత ప్రభుత్వం నిర్మించిన ప్రజా ఆస్థులను కూడా ధ్వంసం చేస్తు న్నారని గొల్ల, కురుమల సంఘం నేత గోసుల శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. అధికారంలోకి రాగానే కక్షసాధింపులో భాగంగా దాడులకు పా ల్పడటం సిగ్గుచేటని సోమవారం తెలిపారు.

# యాంటీ నార్కోటిక్ బ్యూరో విభాగాన్ని బలోపేతం చేయాలి : సీఎం రేవంత్

**హైదరాబాద్ డిసెంబర్ 11 (అక్షరం న్యూస్)**

రాష్ట్రంలో యాంటీ నార్కోటిక్ బ్యూరో విభాగాన్ని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులతో సీఎం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న యాంటీ నార్కోటిక్ బ్యూరోకు పూర్తిస్థాయి డైరెక్టర్‌ను నియమించడంతో పాటు ఆయ విభాగాన్ని బలోపేతం చేస్తామన్నారు అవసరమైన నిధులు, వనరులతో పాటు సౌకర్యాలను సమకూర్చాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల కట్టడికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ మాదిరిగా టీఎస్ నాబ్‌ను తీర్చిదిద్దాలని సూచించారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలన్నారు. సమీక్షలో ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, ఇంటెలిజెన్స్ విభాగం అడిషనల్ ఈజీ శివధర్‌రెడ్డి, సీఎంవో కార్యదర్శి శేషాద్రి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# హైదరాబాద్ నగరంలో భారీగా ట్రాఫిక్ జామ్



హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో గత రెండు, మూడు రోజుల నుంచి ఎక్కడ చూసినా భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ఉదయం నుంచి మొదలుకుంటే రాత్రి వరకు పలు చోట్ల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రధానంగా అసెంబ్లీ పరిసర ప్రాంతాలు, లక్డీకాపూల్, మాసాబ్ ట్యాంక్, బంజారాహిల్స్, సచివాలయం పరిసర ప్రాంతాలు, నెక్లెస్ రోడ్డు, ప్రజా భవన్, బేగంపేట్ ఏరియాల్లో ట్రాఫిక్ భారీగా నిలిచిపోతోంది. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో లక్డీకాపూల్ మెట్రో స్టేషన్‌తో పాటు ఆ పరిసర ప్రాంతాల్లో ఆకస్మాత్తుగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. దీంతో వాహనాలు కదల్లేని పరిస్థితి ఏర్పడింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఇక మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తెలుగు తల్లి ఫ్లై ఓవర్, నెక్లెస్ రోడ్డు ఫ్లైఓవర్, ఖైరతాబాద్ జంక్షన్, తాజ్‌కృష్ణ, బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1 ఏరియాల్లో ట్రాఫిక్ కారణంగా కిలోమీటర్ల వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితి ఈ ఒక్కరోజే కాదు.. ఈ ఏరియాల్లో గత రెండు, మూడు రోజుల నుంచి ఇదే పరిస్థితి కనబడుతోంది. ట్రాఫిక్ ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు పోలీసులను కోరుతున్నారు.

# పెట్రోల్, డీజిల్‌పై చేతులెత్తేసిన కేంద్రం



పెట్రోల్, డీజిల్, సీఎన్జీ తదితర చమురు ఉత్పత్తులపై సుంకాల తగ్గింపు ఆలోచనేమీ లేదని కేంద్ర ఆర్థికశాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ ధర తగ్గుముఖం పట్టిందని, దేశీయంగా ఫ్యుయల్‌పై ఎక్సైజ్ డ్యూటీ తగ్గించే పరిస్థితి లేదన్నారు. దేశీయ అవసరాల కోసం 85 శాతం విదేశాల నుంచే ముడి చమురు దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. గ్లోబల్ మార్కెట్లో క్రూడాయిల్ ధరలను బట్టే.. దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు నిర్ణయిస్తారు. సోమవారం ఫ్యూచర్స్ మార్కెట్లో బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర 76.40 డాలర్ల వద్ద కొనసాగుతున్నది. అధిక ద్రవ్యోల్బణం నేపథ్యంలో గతేడాది మే నెలలో కేంద్ర ప్రభుత్వం ముడి చమురు దిగుమతిపై ఎక్సైజ్ డ్యూటీ తగ్గించింది. లీటర్ పెట్రోల్‌పై రూ.8, లీటర్ డీజిల్‌పై రూ.6 ఎక్సైజ్ డ్యూటీ తగ్గించింది.


ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.33.61 లక్షల కోట్ల పన్ను (సవరించిన అంచనా) వసూళ్లకు కట్టుబడి ఉన్నట్లు కేంద్ర ఆర్థికశాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 20 శాతం, పరోక్ష పన్ను వసూళ్లలో ఐదు శాతం గ్రోత్ నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలల డేటా తమ వద్ద అందుబాటులో ఉందని ఆ అధికారి చెప్పారు.

గత ఆర్థిక సంవత్సరంలో రూ.30.54 లక్షల కోట్ల పన్ను వసూళ్లు జరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 10.1 శాతం పెరుగుతాయని కేంద్రం అంచనా వేస్తున్నది. ఈ నేపథ్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం పన్ను వసూళ్లు రూ.33.61 లక్షల కోట్లు ఉంటాయని భావిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల రూపంలో రూ.18.23 లక్షల కోట్లు, పరోక్ష పన్నుల రూపంలో రూ.15.38 లక్షల కోట్లు వసూలవుతాయని కేంద్రం అంచనా వేస్తున్నది.

## చింతపల్లి ఎస్సై సతీశ్‌రెడ్డి సస్పెన్షన్

## గిరిజనుడి మృతి ఘటనలో వేటు





చింతపల్లి , డిసెంబర్ 11: నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పాలెం తండాకు చెందిన ఓ వ్యక్తి మృతిచెందిన ఘటనలో చింతపల్లి ఎస్సై సతీశ్‌రెడ్డిపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. మండలంలోని పాలెం తండాకు చెందిన నేనావత్ సూర్యానాయక్ ఆదివారం పోలీసుల విచారణ సమయంలో మృతి చెందాడు. అన్నదమ్ముల మధ్య జరిగిన భూవివాదంలో తలదూర్చిన ఎస్సై.. సూర్యానాయక్‌ను విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కొట్టారు. దీంతో సూర్యానాయక్ స్పృహతప్పి పడిపోయాడు.

చికిత్స నిమిత్తం దేవరకొండ దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. బాధిత కుటుంబం ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై విచారణ జరిపిన ఎస్పీ అపూర్వరావు సివిల్ వివాదంలో తలదూర్చిన ఎస్సై సతీశ్‌రెడ్డిని నల్లగొండ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాలెం తండాలో ఘర్షణలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఏమిటీ ఆర్టికల్ 370?

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని తాజాగా సుప్రీం కోర్టు సమర్థించింది. ఈ నేపథ్యంలో అసలు ఆర్టికల్ 370 ఏంటి? ఆది నుంచి ఎందుకు వివాదాస్పదమైంది? ఎందుకు రద్దయింది? అనే విషయాలు ఆసక్తిగా మారాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక స్వయం ప్రతిపత్తిని కల్పించింది. 1947లో భారత్–పాకిస్థాన్ విభజన జరిగినప్పుడు జమ్ముకశ్మీర్ రాజు హరిసింగ్ పలు షరతులతో భారత్‌లో విలీనాని కి అంగీకరించారు. ఈ క్రమంలోనే ఆర్టికల్ 370 తెరమీదికి వచ్చింది. ఈ ఆర్టికల్ జమ్ముకశ్మీర్‌కు స్వతంత్ర హెూదా కల్పిస్తుంది. అంటే, భారత రాజ్యాంగం ఈ రాష్ట్రానికి వర్తించదు. కేవలం రక్షణ, విదేశాంగ వ్యవహారాలు మినహా ఈ రాష్ట్రానికి సంబంధించి ఎలాంటి చట్టం చేయాలన్నా కేంద్ర ప్రభుత్వం జమ్ముకశ్మీర్ ప్రభుత్వ అనుమతి పొందాల్సి ఉంటుంది. ఇక, ఈ ఆర్టికల్ ద్వారా జమ్ము కశ్మీర్ ప్రజలకు ప్రత్యేక హక్కులు కూడా సంక్రమించాయి.

ఆర్టికల్ 370 ఏం చెబుతోంది?

– కీలకమైన ఆర్టికల్ 356(రాష్ట్రపతి పాలన) జమ్ముకశ్మీర్‌కు వర్తించదు.

–1976 నాటి పట్టణ భూమి చట్టం కూడా ఇక్కడి వారికి వర్తించదు. దేశంలోని ఇతర ప్రాంతాల వారు ఎవరూ ఈ రాష్ట్రంలో భూమి కొనలేరు. పౌరసత్వం, ఆస్తియాజమాన్యం, ప్రాథమిక హక్కులు కశ్మీరీలకు ప్రత్యేకంగా ఉంటాయి.

2019 ఆగస్టు 5న రద్దు

ఆర్టికల్ 370పై 2015 నుంచి వివాదాలు ముదిరాయి. ఆ సంవత్సరం డిసెంబరులో ఈ ఆర్టికల్‌ను రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. దీనిని విచారించిన అప్పటి సీజేఐ జస్టిస్ హెచ్.ఎల్. దత్తు ధర్మాసనం.. ఆర్టికల్‌ను రద్దు చేసే అధికారం ఉందని తేల్చి చెప్పింది. అయితే.. ఇది పార్లమెంటు ద్వారానే జరగాల్సి ఉందని పేర్కొంది. అయితే, జమ్ము కశ్మీర్ హైకోర్టు మాత్రం ఆర్టికల్ 370 శాశ్వత నిబంధన అని పేర్కొనడం గమనార్హం. సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2019లో ఆగస్టు 5న ఆర్టికల్ 370ని రద్దు చేసింది. జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని జమ్ముకశ్మీర్, లద్దాఖ్‌గా విభజించింది. కాగా, ఆర్టికల్ 370 రద్దును అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు.



370 రద్దు తర్వాత ఏం జరిగింది?!

– జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక పతాకం, రాజ్యాంగం, గీతం రద్దయ్యాయి. అన్ని కేంద్ర చట్టాలు ఇక్కడ అమలవుతాయి. స్వయం ప్రతిపత్తి ఉండదు.

–జమ్ము కశ్మీర్‌లో ఎవరైనా భూమి కొనుగోలు చేయొచ్చు. బదిలీ చేసుకోవచ్చు.

–కశ్మీరీలకు ద్వంద్వ పౌరసత్వం వర్తించదు.

– ఆర్పీసీ(రణబీర్ శిక్షా స్మృతి) స్థానంలో ఐపీసీ(భారత శిక్షా స్మృతి) అమలు

– జిల్లా స్థాయి అభివృద్ధి మండళ్లను(డీడీసీ) ఏర్పాటు చేశారు. మండలి సభ్యులు నేరుగా ప్రజలతోనే ఎన్నిక కావాల్సి ఉంది.

## టీఎస్‌పీఎస్సీ చైర్మన్ పదవికి జనార్దన్‌రెడ్డి రాజీనామా



తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ పదవికి జనార్దన్‌రెడ్డి సోమవారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ను కలిసి అందజేశారు. రాజీనామాకు ముందు ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. రాజీనామాను గవర్నర్ ఆమోదించారు. తదుపరి చర్యలు చేపట్టాలని సీఎస్‌కు గవర్నర్ లేఖ రాశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా జనార్దన్‌రెడ్డిని 2021లో అప్పటి ప్రభుత్వం నియమించింది.

జనార్దన్‌రెడ్డి 1996కు చెందిన ఐపీఎస్ అధికారి. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలో పలు కీలక పోస్టుల్లో పని చేశారు. ఆయన స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం పెద్దాయపల్లి. ఆయన అగ్రికల్చర్ పీజీ చేశారు. 1990లో గ్రూప్–1కు ఎంపికై డిప్యూటీ కలెక్టర్ బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి ఏపీలో నల్లగొండ, నెల్లూరు ఆర్డీవోగా సేవలందించారు. వరంగల్, అనంతపురం జిల్లాల కలెక్టర్‌గా విధులు పని చేశారు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, మార్కెటింగ్ శాఖల కమిషనర్‌గా, సహకారశాఖ రిజిస్ట్రార్‌గా, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్‌గా, విద్యాశాఖ కార్యదర్శిగా, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శిగా పని చేశారు. 2021 మేలో అప్పటి ప్రభుత్వం ఆయనను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా నియమించింది.

# ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తాం

## ప్రజా దర్బార్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురి నుంచి మంత్రి విజ్ఞాపన పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని, పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

దరఖాస్తుదారులు విజ్ఞాపనపత్రంలో సమస్యతో పాటు అడ్రస్, ఫోన్ నంబర్‌ను రాయాలన్నారు. తద్వారా దరఖాస్తుదారుల సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి.. పరిష్కరించేందుకు వీలవుతుందన్నారు. ఈ నెల 17న జరిగే టీఎస్ జెన్‌కో ఏఈ పరీక్షను వాయిదా వేయాలని పలువురు అభ్యర్థులు కోరారు. అదేరోజున పలు పరీక్షలు ఉన్నట్లు తెలిపారు.

సంబంధిత అధికారులతో చర్చించి పరీక్షల వాయిదాపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. తమకు ఇచ్చే గౌరవ వేతనాన్ని ప్రతి నెలా రెగ్యులర్‌గా ఇవ్వాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరారు. కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ సమన్వయం చేయగా.. ఆయుష్ విభాగం డైరెక్టర్ హరిచందన, ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ ముషారఫ్ అలీ, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేశ్ దోత్రి పాల్గొన్నారు.



## మార్మోగిన శివనామ స్మరణ



కీసర: కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో నగరంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామ స్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్యంగా కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో కీసరగుట్టకు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకాలను నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు నేరుగా గుట్టలో కొలువైన కాశీవిశ్వేరాలయం, లక్ష్మీనర్సింహస్వామివారిని, శ్రీ నాగదేవతలను దర్శించుకున్నారు.



## మా జీవనోపాధికి భరోసా కల్పించాలి..



### ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నాయకుల ఆవేదన

హిమాయత్‌నగర్, డిసెంబర్11: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం వల్ల ఆటోలో తగినంత ప్రయాణికులు లేకపోవడంతో ఆటో డ్రైవర్ల ఆదాయానికి గండి పడుతోందని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో జేఏసీ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం, (ఏఐటీయూసీ) కో–కన్వీనర్ వి.కిరణ్(ఐఎఫ్‌టీయూ), బి.శ్రీకాంత్ (సీఐటీయూ),జి.మల్లేశ్‌గౌడ్(ఐఎన్‌టీయూసీ), సీహెచ్.బాల నరసింహ(బీఆర్‌టీయూ), మహ్మద్ అమనుల్లాఖాన్, ఎంఏ సలీం(ఆటో జేఏసీ), మీర్జా రఫత్ బేగ్(ఆటో ఓనర్స్ అసోసియేషన్) మాట్లాడారు.

ఇంధన చార్జీలు, రవాణా ట్యాక్స్ లు పెరిగినప్పటికీ ఆటో మీటర్ చార్జీలు పెంచకుండా ప్రయాణికులను వారి వారి గమ్యాలకు క్షేమంగా చేర్చడంలో ఆటో డ్రైవర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఉన్నత చదువులు చదువుకున్నప్పటికీ సరైన ఉపాధి అవకాశాలు లభించకపోవడంతో స్వయం ఉపాధి కోసం ఆటోలను కొనుగోలు చేసుకొని లక్షలాది మంది ఆటోలను నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు పథకంతో తమ బతుకు దెరువుపై తీవ్ర ప్రభావం చూపడం వల్ల కుటుంబమంతా రోడ్డున పడాల్సి వస్తుందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్లకు జీవనోపాధికి భరోసా కల్పించాలని కోరారు. రవాణా రంగ కార్మికులకు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12 వేలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు మహ్మద్ అజీమొద్దీ,కొంరెల్లి బాబు, జంగయ్య, ఒమర్‌ఖాన్, ఎస్‌కే లతీఫ్, శ్రీను, ప్రవీణ్ పాల్గొన్నారు.

# ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్




**భద్రాద్రి కొత్తగూడెం డిసెంబర్ 11 (అక్షరం న్యూస్)**
18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి చోటు కల్పిస్తూ ఓటరు జాబితా పకడ్బందిగా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటరు ధృవీకరణ, ఓటరు జాబితా తయారీ వంటి పలు అంశాలపై ఆయన సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించారు.వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ, ఓటర్ల నమోదుకు జనవరి 1, 2024 ప్రామాణికంగా తీసుకుని అప్పటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చోటు కల్పించేలా కార్యాచరణ అమలు చేయాలని తెలిపారు. ఓటరు జాబితా సవరణ 2024 కు ముందు పోలింగ్ కేంద్రంలో 1450 కంటే ఎక్కువ ఓటర్లు ఉండకుండా పోలింగ్ కేంద్రాల పునర్ వ్యవస్థీకరణ చేయాలని, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు జాబితాలో మరణించిన ఓటర్ల వివరాలు తొలగింపు, ఓటర్ల జాబితాలో ఉన్న లాజికల్ పొరపాట్లు, డెమో గ్రాఫికల్ పొరపాట్లను పూర్తి స్థాయిలో సవరించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా జాబితా, అడ్రస్ ను, పోలింగ్ కేంద్రాల జి.ఐ.ఎస్. ద్వారా క్యాప్చరింగ్, ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు జాబితా చేపట్టిన సమాచారాన్ని సంబంధిత అధికారులు పరిశీలించాలని ఆదేశించారు.

జనవరి 6, 2024న ముసాయదా ఒటరు జాబితా విడుదల చేసి, జనవరి 22, 2024 వరకు సదరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి, ఫిబ్రవరి 2, 2024 లోగా అభ్యంతరాలను, ఓటర్ క్లెయిమ్స్ ను పూర్తి స్థాయిలో పరిష్కరించి, ఫిబ్రవరి 8, 2024న తుది ఓటరు జాబితా రూపొందించాలని ఆయన స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు నిండి నూతనంగా ఓటు హక్కు పొందుతున్న వారి జాబితా ప్రత్యేకంగా రూపొందించాలని, అదే సమయంలో వివిధ వయసులో గల వారి జాబితాను ప్రత్యేకంగా సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం ఓటరు జాబితా రూపకల్పన కీలకపాత్ర పోషిస్తుందని అర్హులైన వారందరికీ తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా మాట్లాడుతూ, జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారు తమ పేరును ఓటరుగా ముందస్తుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అందుకు ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ వీడియో సమావేశంలో ఎన్నికల తహసిల్దార్ రంగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా,వైద్య, ఇంజనీరింగ్ అధికారులతో ఆస్పిరేషన్ ఇండికేటర్స్ కు అనుకూలంగా లక్ష్యం సాధించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా ఆదేశించారు. సోమవారం ఐడిఓసి మినీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో గల అన్ని ఆసుపత్రులందు గర్భిణీల రిజిస్ట్రేషన్ సక్రమంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిన లక్ష్యాన్ని సాధించాలని మెడికల్ అధికారులను కోరారు. విద్యాశాఖలో పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈఓ ని ఆదేశించారు. మిగిలిన జిల్లా అధికారులందరూ తమ తమ శాఖలలో గల పనులన్నీ నిర్దేశిత కాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రవీంద్రనాథ్, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శిరీషా, సిపిఓ శ్రీనివాస రావు, ఈ ఇరిగేషన్ కాశయ్య, మార్కెటింగ్ డిఎం కలీం జిల్లా పంచాయతీ అధికారి పి. రమాకాంత్ రావు, డిఈఓ వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం ఆర్టీఓ కార్యాలయంలో నేడు నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి ముక్కోటి మహెూత్సవాల సమీక్షా సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమగ్ర కార్యాచరణ నివేదికలతో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ అన్ని శాఖల అధికారులను సమావేశానికి హాజరు కావాలని ఆదేవించారు. గతంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో శాఖల వారిగా అధికారులకు విధులు కేటాయించడం జరిగిందని, సంబంధిత అధికారులు సమగ్ర నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని చెప్పారు. ఈ సమావేశంలో డిఆర్ రవీంద్రనాథ్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బోర్డుల ప్రక్షాళన తర్వాతే..

## నియామక పరీక్షలు నిర్వహించాలి

సైదాబాద్, డిసెంబర్ 11 : రాష్ట్ర ప్రభుత్వం టీఎస్సీఎస్సీ, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డులను ప్రక్షాళన చేసిన తర్వాతే నియామక పరీక్షలు నిర్వహించి, నిరుద్యోగుల ఆకాంక్ష నెరవేర్చాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ అన్నారు. సోమవారం సైదాబాద్ డివిజన్ పరిధిలో కల్యాణ్‌నగర్ కాలనీలోని తన నివాసంలో నిరుద్యోగ బాధిత యువకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధంలేని ఓవో 57, 58లను రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ వేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బోర్డులు ఇంత వరకు పాల్పడ్డ అవకతవకలపై విచారణ జరిపించాలని, బోర్డుల చైర్మన్లను వెంటనే తొలగించాలని, సీబీఐతో విచారణ జరిపించడం ద్వారా అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని చెప్పారు. ఈ సమావేశంలో నిరుద్యోగ బాధిత యువకులు యాసం ప్రదీప్, నర్సింహ, రాజు, పరుశు రాం, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చలో ప్రజా భవన్

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మంగళవారం చలో ప్రజా భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని యాసం ప్రదీప్, నర్సింహ, రాజు, పరుశురాం, కోటేశ్ కోరారు. నసిక ఆరోగ్య సేవలు విస్తరించాలి



# వరుస సమీక్షలతో సీఎం రేవంత్ బిజీ

- ఉద్యోగ ఖాళీలు...భర్తీలపై ఆరా
- పూర్తి వివరాలతో రావాలని టీఎస్పీఎస్సీకి ఆదేశాలు
- రైతుబంధు చెల్లింపులపై అధికారులతో సమక్ష

హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)

వరుస సమీక్షలతో సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బిజీబిజీగా ఉన్నారు. ప్రధానంగా ఆయన సోమవారం వ్యవసాయం,నిరుద్యోగ రంగాలపై దృష్టి సారించారు. ఉద్యోగాల భర్తీపై సీఎం రేవంత్ సమీక్షించారు. పూర్తి వివరాలతో రావాలని టీఎస్పీఎస్సీ అధికారులను సీఎం ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు టీఎస్పీఎస్సీ భర్తీ చేసిన ఉద్యోగాల వివరాలు, నోటిఫికేషన్ల వివరాలతో రావాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఒకటొకటిగా నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు. తాజాగా ఉద్యోగాల భర్తీపై దృష్టి పెట్టారు. తాము అధికారంలోకి రాగానే ఖాళీల భర్తీ చేపడతామని మేనిఫెస్టోలో ప్రకటించడమే కాకుండా, ఏయే రోజున ఏయే నోటిఫికేషన్లు విడుదల అవుతాయో వివరంగా పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఉద్యోగ ఖాళీలు ఎన్ని ఉన్నాయో తెలపాలని టిఎస్ పిఎస్ సి చైర్మన్ జనార్దనరెడ్డిని సిఎం ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటినుంచి ఇప్పటివరకూ ఎన్ని ఖాళీలు భర్తీ అయ్యాయో కూడా తెలపాలన్నారు. ఉద్యోగాల భర్తీపై రెండు రోజుల్లో సమీక్ష నిర్వహిస్తామనీ, దీనికి పూర్తి వివరాలతో హాజరు కావాలని ఆయన టీఎస్ పిఎస్ సి చైర్మన్ ను ఆదేశించారు. రైతు భరోసా పథకంపై కూడా సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అధికారులు హాజరయ్యారు. సచివాలయంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం అధికారులతో.. ఎక్సైజ్ శాఖ అధికారులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు , ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. రైతు భరోసాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. సంబంధిత అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకంపై చర్చించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు తుమ్మల, శ్రీధర్ బాబు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఖాతాల్లో ఏడాదికి ఎకరానికి రూ. 15వేలు, వ్యవసాయ కూలీలకు రూ. 12 వేలు, వరి పంటకు రూ. 500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిధుల విడుదలపై సీఎం రేవంత్ రెడ్డి సీమీక్షించారు. అయితే, ప్రభుత్వ ఖజానాలో మాత్రం నిధులు లేనట్లు తెలుస్తోంది. డిసెంబర్ చివరి వారంలో యాసంగికి రైతులు సిద్ధమవుతున్న తరుణంలో ఎలాగైన నిధులు సర్దుబాటు చేయాలని సీఎం రేవంత్ భావిస్తున్నట్లు సమాచారం



# మేడిగడ్డలో తప్పుచేసిన వారికి శిక్ష తప్పదు

- తెలంగాణలో నీటిపారుదల రంగానికి ప్రాధాన్యం
- పారదర్శకంగా ప్రాజెక్టుల వివరాలు ఉండాలి
- జలసౌధలో అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష

హైదరాబాద్,డిసెంబర్11(అక్షరం న్యూస్)

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ లక్ష్మి బ్యారేజ్‌లో తప్పు చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. మేడిగడ్డ కుంగుబాటు, డిజైన్ లోపం తదితర అంశాలపై ఆరా తీసారు. సోమవారం నాడు జలసౌధలో నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ శాఖలకు సంబంధించిన కీలక అంశాలపై మంత్రి చర్చించారు. ఈ సమావేశంలో ఈఎన్సీ మురళీధరతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టుల వారీగా మంత్రి ఉత్తమ్ సమీక్ష చేశారు. ప్రాజెక్టులకు అవుతున్న విద్యుత్ వినియోగంపై మంత్రి ఆరా తీశారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టు తదితర ప్రాజెక్టులపై లోతుగా సమీక్ష జరిపారు. ఈ శాఖకు సంబంధించిన అధికారులతో మంత్రి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఇరిగేషన్ శాఖపై ఉత్తమ్ ముందు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కాళేశ్వరం, మేడిగడ్డపై ఉత్తమ్ ప్రత్యేకంగా వివరాలు అడిగారు. త్వరలో మేడిగడ్డ బ్యారేజ్‌ని పరిశీలించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ... మేడిగడ్డ విషయంలో విచారణ జరగాలి. నీటి పారుదల శాఖలో పనులు అత్యంత పారదర్శకంగా ఉండాలి. ప్రజల డబ్బులతో మనం ప్రాజెక్టులను కడుతున్నాం. మనం పూర్తిగా బాధ్యతాయుతంగా, జవాబు దారి తనంతో పని చేయాలి.తెలంగాణలో నీటి పారుదల రంగానికి చాలా ప్రాధాన్యత ఉంది. అది గుర్తు పెట్టుకొని మనం పని చేయాలి. ప్రజల్లో నీటి పారుదల రంగంపై ఉన్న అపోహలు తొలగిపోయేలా పని చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.ఇరిగేషన్ శాఖ హైదరాబాద్‌లోని జలసౌధ కార్యాలయంలో ఉన్న ఇరిగేషన్ శాఖకు సంబంధించిన ఛాంబర్‌కి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెళ్లారు. పూర్ణ కుంభంతో వేదపండితులు మంత్రి ఉత్తమ్‌కి స్వాగతం పలికారు. అలాగే ఇరిగేషన్ శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఇరిగేషన్ శాఖపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖకు సంబంధించిన పలు కీలక అంశాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చర్చించినట్లు తెలుస్తోంది.

# కాంగ్రెస్ ఎంపి ధీరజ్ సాహూ కేసు

- 350కోట్లకు పైగా పట్టుబడ్డ నగదు
- ఎస్‌బిఐలో జమ చేయనున్న అధికారులు

న్యూఢిల్లీ,డిసెంబర్11 (అక్షరం న్యూస్)

కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహూ , ఆయన బంధువులకు చెందిన మద్యం వ్యాపార సంస్థలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు గత కొన్ని రోజులుగా దాడులు నిర్వహిస్తున్న క్రమంలో ఈ దాడుల్లో లెక్కల్లో చూపని కట్టలు కట్టలు నగదు బయటపడుతోంది. ఇప్పటి వరకూ సుమారు రూ. 350 కోట్లకు పైనే స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మొత్తం పట్టుబడ్డ నగదు 351 కోట్ల రూపాయలని అధికారులు ప్రకటించారు. ఐటీయే కాదు, ఏ ఇతర దర్యాప్తు సంస్థలు కూడా ఏకదాడిలో ఇంత పెద్దమొత్తంలో అక్రమ సొమ్మును స్వాధీనం చేసుకోవడం దేశంలో ఇదే ప్రథమమని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆయా సంస్థల్లో దాడులు కొనసాగుతున్నాయని చెప్పారు. మరోవైపు పట్టుబడిన మొత్తం ధనాన్ని అధికారులు ఒకే బ్యాంక్‌లో డిపాజిట్ చేయనున్నారు. దాడుల్లో ఇప్పటి వరకూ పట్టుబడిన ఈ మొత్తం సొమ్మును బలంగీర్‌లోని ఎస్‌బీఐ ప్రధాన శాఖలో డిపాజిట్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ భగత్ బెహరా మాట్లాడుతూ.. తమకు మొత్తం 176 బ్యాగులు అందినట్లు చెప్పారు. ఇప్పటివరకూ 140 బ్యాగుల్లోని మొత్తాన్ని లెక్కించినట్టు చెప్పారు. మిగిలిన బ్యాగుల్లోని నగదును నేడు లెక్కించనున్నట్లు వివరించారు. మొత్తం మూడు బ్యాంకులకు సంబంధించిన అధికారులు ఈ కౌంటింగ్ పక్రియలో పాల్గొంటున్నారని చెప్పారు. సుమారు 40 లెక్కింపు యంత్రాలను తీసుకొచ్చినట్లు తెలిపారు. అందులో 25 మెషీన్లను వినియోగిస్తున్నామని.. మరో 15 బ్యాకప్‌గా ఉంచినట్టు ఆయన వివరించారు. గతంలో 2019లో కాన్పూర్ కేంద్రంగా ఉన్న ఒక వ్యాపార సంస్థపై జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు దాడి చేసి 257 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు దేశంలో అదే పెద్ద మొత్తం. అలాగే తమిళనాడులో ఒక నిర్మాణ సంస్థపై ఐటీ అధికారులు 2018లో దాడి చేసి రూ. 153 కోట్లను పట్టుకున్నారు. ఈ రికార్డులన్నీ ఒడిశా ఐటీ దాడితో తుడిచిపెట్టుకుపోయాయి.

కాగా ఈ నెల 6న ప్రారంభమైన ఐటీ దాడులు ప్రధానంగా బల్దేయో సాహు ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుబంధంగా ఉన్న బౌద్ధ్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్ (బీడీపీఎల్)పై కొనసాగాయి. కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహూకు చెందిన రాంచి, ఇతర ప్రదేశాల్లోని సంస్థలపై కూడా దాడులు జరిగాయి. అయితే వాటి నుంచి ఎంత నగదు, ఏంఏం పత్రాలు స్వాధీనం చేసుకున్నారన్న వివరాలను మాత్రం ఐటీ అధికారులు ఇంకా వెల్లడించలేదు.

# మధ్యప్రదేశ్ సిఎంగా మోహన్ యాదవ్

- బిజెపి అధిష్టానం సంచలన నిర్ణయం
- శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పక్కన పెట్టిన పార్టీ

న్యూఢిల్లీ,డిసెంబర్11( (అక్షరం న్యూస్)

బిజెపి అధిష్టానం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఎంపికలో బీజేపీ హైకమాండ్ సంచలన నిర్ణయం తీసుకుంది. సీఎం రేసులో ఉన్న సీనియర్ నాయకులు అందరినీ పక్కన పెట్టి.. అసలు రేసులోనే లేని మోహన్‌యాదవ్‌కు సీఎం పదవి కట్టబెట్టింది. ఈ మేరకు మధ్యప్రదేశ్ బీజేపీ శాసనసభా పక్షం సమావేశమై తమ నాయకుడిగా మోహన్ యాదవ్‌ను ఎన్నుకున్నది. దాంతో గత 8 రోజుల మధ్యప్రదేశ్ సీఎం ఎంపికపై నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడింది. కాగా, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఎంపిక కోసం అంతకుముందు బీజేపీ హైకమాండ్ హర్యానా సీఎం మనోహర్ లాల్ ఖట్టర్, తెలంగాణకు చెందిన బీజేపీ జాతీయ నాయకుడు డాక్టర్ కే లక్ష్మణ్, ఆశా లక్రాలతో కేంద్ర పరిశీలకులుగా నియమించింది. ఈ పరిశీల సమక్షంలోనే కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యేలు తమ నాయకుడిగా మోహన్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇక ఉప ముఖ్యమంత్రులుగా జగదీష్ దేవ్డా, రాజేశ్ శుక్లాలు ఎన్నికయ్యారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా నరేంద్రసింగ్ తోమర్‌ను ఎంపిక చేశారు. మధ్యప్రదేశ్ కొత్త ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఉజ్జయిని సౌత్ నియోజకవర్గం నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయనకు గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్నది.

ఇప్పటి వరకు నాలుగు పర్యాయాలు పనిచేసిన శివరాజ్ సింగ్ చౌహాన్‌ను బిజెపి పక్కన పెట్టింది. ఛత్తీస్‌ఘడ్‌లో కూడ ఆరమణ్ సింగ్‌ను పక్కన పెట్టిన సంగతి తెలిసిందే.

## తెలంగాణ స్పీకర్ ఎన్నికకు నోటిఫికేషన్

- 13న నామినేషన్లకు గడువు

హైదరాబాద్,డిసెంబర్11( (అక్షరం న్యూస్)

తెలంగాణ శాసనసభ స్పీకర్ ఎన్నిక కోసం నోటిఫికేషన్ విడుదలైంది. సోమవారం ఉదయం అసెంబ్లీ సెక్రటేరియట్ స్పీకర్ ఎన్నిక నోటిఫికేసన్ కు ఉత్తర్వులు జారీ చేసింది. డిసెంబర్ 13వ తేదీ ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ వేసేందుకు గడువు ఇచ్చింది. ఇప్పటికే కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం ప్రసాద్ కుమర్‌ను శాసన సభ స్పీకర్‌గా కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఆయన ఒక్కరే నామినేషన్ వేయనున్నట్లు తెలుస్తోంది. అనంతరం ఏకగ్రీవంగా గడ్డం ప్రసాద్ ను స్పీకర్ గా ఎన్నుకోనున్నారు. కిరణ్ కమార్ రెడ్డి మంత్రి వర్గంలో గడ్డం ప్రసాద్ టైక్స్‌టైల్ మంత్రిగా పని చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గడ్డం ప్రసాద్ వికారాబాద్ నుంచి ఎంఎల్‌ఏగా గెలుపొందారు.

## కెసిఆర్‌కు టిడిపి అధినేత చంద్రబాబు పరామర్శ

- త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్ష
- కెసిఆర్‌ను పరామర్శించిన నటుడు ప్రకాశ్ రాజ్

హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)

ఇటీవల తుంటి మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్న తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను చంద్రబాబు పరామర్శించారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి చంద్రబాబు వివరాలు తెలుసుకున్నారు.టీడీపీ అధినేత చంద్రబాబు హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆస్పత్రికి వెళ్లారు. కేసీఆర్‌ను పరామర్శించిన తర్వాత చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. కేసీఆర్‌కు జరిగిన తుంటి మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా జరిగిందని డాక్టర్లు చెప్పారని.. ఆయన కోలుకునేందుకు ఆరు వారాల సమయం పడుతుందని వివరించారని చంద్రబాబు చెప్పారు. కేసీఆర్ త్వరగా కోలుకుని.. మళ్లీ ప్రజాసేవలో పునరంకితం కావాలని ఆకాంక్షి స్తున్నట్లు చంద్రబాబు అన్నారు. కేసీఆర్‌ను పరామర్శించేందుకు ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ యశోద ఆసుపత్రికి వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి పరామర్శించారు. కేసీఆర్ గారి ఆరోగ్యపరిస్థితి గురించి ఆరా తీశారు. కోలుకుంటున్న విషయం తెలుసుకున్నారు. అక్కడే ఉన్న ఎమ్మెల్సీ కవితను సైతం ప్రకాష్ రాజ్ పరామర్శించారు. మాజీ మంత్రులు గంగుల కమలాకర్, మల్లారెడ్డి, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ లు మధుసూదన చారి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి మోత్కుపల్లి, చల్మడ లక్ష్మి నరసింహారావు తదితరులు కూడా కేసీఆర్ ఆరోగ్యపరిస్థితి గురించి తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## విశాఖకు రాజధాని తరలింపు వ్యవహారం

- విచారించిన తరవాత ఆదేశాలిస్తామన్న హైకోర్టు

అమరావతి,డిసెంబర్11 (అక్షరం న్యూస్)

క్యాంపు కార్యాలయాల ముసుగులో విశాఖపట్నానికిరాజధాని తరలింపు పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రోస్టర్ ప్రకారం బెంచ్ ముందుకు పిటిషన్ వచ్చిందని, విచారించిన తర్వాతే ఆదేశాలు జారీ చేస్తామని హైకోర్టు న్యాయమూర్తి తెలిపారు. ఏపీ ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ అభ్యంతరం వ్యక్తం చేస్తుండడంతో దీనిపై మధ్యంతర పిటిషన్ వేసుకోవచ్చని హైకోర్టు న్యాయమూర్తి సూచించారు. రాజధాని వ్యవహారాలను విచారించే త్రిసభ్య ధర్మాసనం లేదా పాలనాపరంగా ఏం చేయాలనే అంశంపై ప్రభుత్వమే ఆలోచించుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి సూచించారు. ఒకవేళ ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోతే తానే విచారిస్తానని హైకోర్టు న్యాయమూర్తి చెప్పడంతో ప్రభుత్వ న్యాయవాది ఒకే చెప్పారు. ఈలోపు కార్యాలయాలు తరలించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, అందువల్ల మధ్యంతర ఆదేశాలు ఇవ్వాలని పిటీషనర్ తరపు న్యాయవాది ఉన్నం మురళీధర్ హైకోర్టుని కోరారు. కార్యాలయాల తరలింపుపై ఇప్పటికిప్పుడు ఏమీ జరగదని, అది సుదీర్ఘ పక్రియ అని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టుకి తెలిపారు. ప్రభుత్వం ఇలానే చెప్పి, మళ్లీ తిరిగి కార్యాలయాలను తరలించేందుకు అంతర్గత ఏర్పాట్లు చేస్తోం దని పిటీషనర్ తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ప్రభుత్వం వైపు నుంచి రాజధానిని తరలించకుండా ఆదేశాలు తీసుకోవాలని హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదికి ఆదేశించింది. దీంతో కేసు విచారణను హైకోర్టు రేపటికి వాయిదా వేసింది.

## నన్ను చంపేందుకు మాజీ ఎమ్మెల్యే కుట్ర

- బిజెపి ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి ఆరోపణలు

నిజామాబాద్,డిసెంబర్11( (అక్షరం న్యూస్)

ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తనను చంపేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. విదేశాల నుంచి కూడా చంపుతామని బెదిరింపు కాల్స్ వస్తున్నాయన్నారు. అక్రమ క్వారీలు, అక్రమ మొరం తవ్వకాలపై సీబీఐ ఎంక్వైరీ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్మూర్ నియోజకవర్గంలో సహజ సిద్ధమైన వనరులను కాపాడుతానని ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి స్పష్టం చేశారు.

## తెలంగాణలో వ్యవసాయ ఉత్పత్తులు పెరగాలి

- లోపాలను సరిదిద్దుకుని ముందుకు సాగాలి
- అధికారులకు మంత్రి తుమ్మల సూచన

హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)

తెలంగాణలో వ్యవసాయ ఉత్పత్తులు పెంచేలా కృషి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వ్యవస్థలో, శాఖాపరంగా ఉన్న లోపాలను సవరించుకొని రైతులకు సంక్షేమానికి అధికారగణం పాటుపడాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అధిక పంట దిగుబడిని సాధించడమే కాకుండా, ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం విశేషంగా కృషి చేయాలన్నారు. తద్వారా రైతులకు మంచి మద్దతు ధర లభించేలా మార్కెటింగ్ శాఖా అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. అన్ని రకాల పంటలకు తెలంగాణ నేల అనుకూలంగా ఉంటుంది. బహుశా దేశంలో ఏ రాష్ట్రానికి ఈ ప్రత్యేకత లేదని, సీజన్ల వారిగా ముందుగానే శాఖల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని, అందుకు తగ్గట్టుగా రైతులను వ్యవసాయానికి సమాయత్తం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరవాత సచివాలయంలోని వ్యవసాయ శాఖ సెక్రటరీ ఛాంబర్లో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మంత్రికి సెక్రటరీ రఘునందన్ రావు, హెచ్‌ఓడీ, ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి ఉత్పత్తి పెంచి వ్యవసాయశాఖకు మంచి పేరు తేవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తరకం పంటలను రైతులకు పరిచయం చేయాలి. మామిడి, జామ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి ఆ పంటల సాగుకు సహాయపడాలి. పాం ఆయిల్ పంట సాగు చేసే రైతులు మంచి దిగుబడి సాధిస్తున్నారు. వాళ్లకు మంచి గిట్టుబాటు ధర లభిస్తున్నది. ఆ సాగును మరింత ప్రోత్సహించాలని, అందులో అంతర పంటగా పుచ్చకాయలుపండించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు.



# కనకదుర్గమ్మ సేవలో మంత్రి పొంగులేటి దంపతులు

- **స్వాగతించి ఆశీర్దించిన ఆలయ పండితులు**

హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)

బెజవాడ కనకదుర్గమ్మ తల్లిని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాధురి దంపతులు దర్శించుకున్నారు. వీరి వెంట మంత్రి సోదరుడు పొంగులేటి ప్రసాద రెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు కూడా ఉన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. తొలుత వైసీపీ ఎంపీ పీవీ మిథున్ రెడ్డి, ఆలయ కమిటీ బాధ్యులు మంత్రి పొంగులేటికి ఘనస్వాగతం పలికారు. శాలువ, మెమొంటోను అందచేసి మంత్రి పొంగులేటిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఇదిలావుంటే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు రోజులు కూడా కాకముందే హరీష్ రావు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అంతకుముందు ఖమ్మంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విలువలు లేని హరీష్ రావు తెలంగాణను దోచి మామకి కట్టపెట్టాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి వచ్చి రెండు రోజులు కూడా కాలేదు అప్పుడే విమర్శలా? అని ప్రశ్నించారు. ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడండి.. తిన్న సొమ్మంతా కక్కిస్తామని హెచ్చరించారు. అప్పుల కుప్పగా రాష్ట్రాన్ని మార్చిన మీరా? మా ప్రభుత్వం గురించి మాట్లాడేది అంటూ హరీష్ రావును ఉద్దేశించి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణను 9 ఏళ్లలో దోచి అప్పుల రాష్ట్రంగా బీఆర్ ఎస్ ప్రభుత్వం తయారు చేశారన్నారు. దోచుకున్న డబ్బులన్నీ మీ మామ దగ్గర పెట్టారని అన్నారు.రైతుబంధు పైసలు వేయడానికి మూడు నెలల సమయం తీసుకున్న బీఆర్ఎస్ పార్టీ మా గురించామాట్లాడేది అంటూ నిప్పులు చెరిగారు. అప్పుడే ఏముంది ముందుంది ముసళ్ల పండుగ అంటూ వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిపుష్ట కోసం ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. మొన్నటి ఎన్నికల్లో ఇందిరమ్మ రాజ్యం కావాలని మమ్మల్ని గెలిపించారని తెలిపారు. శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలియజేస్తున్న అన్నారు.ప్రమాణ స్వీకారం చేసిన కొద్ది గంటల్లోనే 6 గ్యారెం టీల పై సంతకాలు చేసారు మన ముఖ్యమంత్రి అని తెలిపారు. తూతూ.. మమ.. అనుకోకుండా చెప్పిన హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్పటికీ పథకాలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు..

## తెలంగాణ రోడ్లకు ప్రాధాన్యం ఇవ్వండి

**గడ్కరీని కోరిన మంత్రి కోమటిరెడ్డి**

న్యూఢిల్లీ,డిసెంబర్11(అక్షరం న్యూస్)

తెలంగాణ రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి సాయం అందించాలని కేంద్రాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. ప్రధానంగా విజయవాడ రహదారి విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. హైదరాబాద్ – విజయవాడ రహదారిని ఆరు లైన్లకు విస్తరించే చర్యలు చేపట్టాలని నితిన్ గడ్కరీని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర అధికారులు కలిశారు. రోడ్లకు సంబంధించిన ప్రతిపాదనలను అందచేశారు. ఇదిలావుంటే ఎంపీ పదవికి తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రాజీనామా చేశారు. హైదరాబాద్ నుంచి ఢిల్లీకి చేరుకున్నాక వెంటనే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాని కలిసి రాజీనామా పత్రాన్ని సమర్పించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందడం ఆ తర్వాత మంత్రిగా పదవి చేపట్టడంతో కోమటిరెడ్డి ఎంపీ పదవీకి రాజీనామా చేశారు. సోమవారం సాయంత్రం ఆయన ఓంబిర్లాను కలసి తన రాజీనామా సమర్పించారు. దీనికి ఆయన ఆమోదం తెలిపారు.

# విద్యుత్‌శాఖలో రూ.85 వేల కోట్లు అప్పు

- **తెలంగాణలో ప్రతిశాఖపైనా శ్వేతపత్రం**
- **రైతుబంధు సకాలంలో అందచేస్తాం**
- **వందరోజుల్లో ఆరు గ్యారెంటీల అమలు**
- **మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**



సిద్ధిపేట,డిసెంబర్11((అక్షరం న్యూస్)


విద్యుత్‌శాఖలో రూ.85 వేల కోట్లు అప్పు ఉందని, తెలంగాణలో ఉన్న ప్రతి శాఖపై శ్వేతపత్రం విడుదల చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలన నచ్చక కాంగ్రెస్‌కు ప్రజలు అవకాశం ఇచ్చారని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రిగా పొన్నం ప్రభాకర్ మొదటిసారిగా సిద్ధిపేటకు వచ్చారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు పొన్నానికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బిసి బంధుపై సమీక్షించి ఆలోచన చేస్తామని, మూడు రాష్ట్రాల్లో గెలిచినా ఇప్పటికి బిజెపి సిఎంలను నియమించలేదని పొన్నం చురకలంటిం చారు. ఆర్‌టిసి కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.అనేక బాధ్యతల ద్వారా ఎదిగానని.. ఎప్పటికీ ప్రజలకు, కార్యకర్తలకు

అందుబాటులో ఉంటానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. మనముందు ఉన్న కర్తవ్యం పెద్దది అని.. గత పాలకుల తీరు నచ్చక కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారన్నారు. ఆరు గ్యారంటీల్లో రెండు అమలు చేస్తున్నామని చెప్పారు. ఆచరణలో లోపాలను ప్రతి 15 రోజులకోసారి సమీక్షించుకుని ముందుకు వెళతామన్నారు. రోజు 45 లక్షల మందిని, 35 లక్షల కిలోమీటర్లు ఆర్టీసీ తిరుగుతుందని తెలిపారు. ఆర్టీసీని మరింత ప్రజలకు చేరువ చేస్తామన్నారు. జిల్లా అభివృద్ధి విషయంలో మంత్రిగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా బాధ్యత తీసుకుంటానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం మన భాధ్యతగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. వంద రోజుల కాలంలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా పని చేస్తామన్నారు. సమస్య ఉంటే పార్టీ ఏదైనా తమ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. నియంతృత్వం తమ విధానం కాదన్నారు. గూగుల్ మ్యాప్‌లు నీళ్ళల్లోకి తీసుకు పోతున్నాయని.. గూగుల్‌కు లెటర్ రాయాలని కలెక్టర్‌కు ఆదేశించానన్నారు. గౌరవెల్లి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయమని చెప్పానన్నారు. బీసీ బందులో అవకతవకలపై సమీక్ష జరుపతామన్నారు. విద్యుత్ శాఖకు మాత్రమే 85 వేల కోట్ల అప్పు ఉందని తెలుస్తోందన్నారు. గత ప్రభుత్వం రైతుబంధు ఎప్పుడూ డిసెంబర్ చివరి వారంలో ఇచ్చిందని.. ఖచ్చితంగా రైతులకు రైతుబందు ఇస్తామన్నారు. ప్రతి శాఖకు సంబంధించి వైట్ పేపర్ రిలీజ్ చేస్తామన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, సంస్థ మనుగడ కోసం కృషి చేస్తామన్నారు. పార్టీ శ్రేణులు, పోటీ చేసిన అభ్యర్థుల ఆధ్వర్యంలోనే పార్టీ కార్యక్రమాలు జరుగుతాయని.. వర్గాలకు, విభేదాలకు తావివ్వద్దని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

# యువ లాయర్లకు చేయూత

- **వైఎస్సార్ లా నేస్తం నిధుల విడుదల**
- **బటన్ నొక్కి విడుదల చేసిన సిఎం జగన్**

హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)



యువ న్యాయవాదులకు తొలి 3 సంవత్సరాలు అండగా ఉంటూ, ఊతమిస్తూ... 2023-24 సంవత్సరానికి రెండో విడత వైఎస్సార్ లా నేస్తం నిధులను సిఎం జగన్ విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2,807 మంది అర్హులైన జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5000 స్టైఫండ్ చొప్పున జూలై–డిసెంబరు 6నెలలకు సంబంధించి ఒక్కొక్కరికి రూ.30,000 ఇస్తూ... మొత్తం రూ.7,98,95,000ను క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేసారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. ఈ రోజు దేవుడి దయతో మరోమంచి కార్యక్రమానికి ఇవాళ ఇక్కడ నుంచి శ్రీకారం చుడుతున్నాం. వరుసగా గత నాలుగు సంవత్సరాలుగా వైఎస్సార్ లా నేస్తం కార్యక్రమాన్ని

అమలు చేస్తున్నాం. లా పూర్తి చేసుకుని తమ వృత్తిలో తాము నిలబడే సమయంలో వారికి ప్రోత్సహకంగా ఉండేందుకు, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న తర్వాత వాళ్లందరికీ...నెలకు రూ.5వేలు స్టైఫండ్ చొప్పున, సంవత్సరానికి రూ.60 వేలు, మూడేళ్లకు రూ.1.80 లక్షలు ఇస్తూ.. వాళ్ల కాళ్లమీద వాళ్లు తోడుగా నిలబడేందుకు వారికి తోడుగా ఉండే మంచి కార్యక్రమం జరుగుతుంది. మనం చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ఈ ఏడాదికి సంబంధించి రెండో విడతలో 2,807 మంది అడ్వొకేట్ చెల్లెమ్మలు, తమ్ముళ్లకు ఇవాళ మంచి చేస్తూ... దాదాపు 8 కోట్లు బటన్ నొక్కి ఒక్కొక్కరికి 30 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తున్నాం.ఈ నాలుగేళ్లలో మొత్తంగా వైఎస్సార్ లా నేస్తం ద్వారా 6,069 మంది జూనియర్ అడ్వొకేట్లకు మంచి చేస్తూ... మనందరి ప్రభుత్వం ఖర్చు చేసిన అమౌంట్ రూ.49.51 కోట్లు.ఇది మంచి కార్యక్రమం. కారణం ఇటువంటి అడ్వొకేట్లకు వాళ్ల వృత్తిలో ఇనీషియల్ స్టేజ్‌లో నిలదొక్కుకొనేందుకు ప్రభుత్వం మంచి చేస్తూ అడుగులు ముందుకేస్తోంది.ఈ కార్యక్రమం ద్వారా వాళ్ల వృత్తిలో వాళ్లు నిలదొక్కు కుంటారు. ఆ తర్వాత ఇదే మంచిని జ్ఞాపకం ఉంచుకొని పేదవాళ్ల పట్ల వీళ్లు కూడా అదే ఔదార్యం చూపించే మంచి సంస్కృతికి మనం చేసే ఈ కార్యక్రమం మంచి ముందడుగు అవుతుందని అన్నారు. అడ్వొకేట్లందరూ బాగుండాలని, వారి కోసం మనసారా ఆలోచనలు చేసి మంచి జరగాలని తపిస్తూ వాళ్ల కోసం వైయస్సార్ లా నేస్తమే కాకుండా రూ.100 కోట్లతో అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్టును స్థాపించాం.అడ్వొకేట్ జనరల్ ఆధ్వర్యంలో, లా సెక్రటరీ, ÷నాన్స్ సెక్రటరీ ఇద్దరినీ సభ్యులుగా ఆ ట్రస్టులో ఉంచుతూ రూ.100 కోట్లు కేటాయింపు చేశాం. ఆ కేటాయింపు వల్ల కోవిడ్ సమయంలో వీళ్లందరికీ చాలా మంచి జరిగింది. కోవిడ్ సమయంలో ఆడ్వొకేట్‌లను ఆదుకునేందుకు ప్రభుత్వం తరపును వేగంగా అడుగులు పడ్డాయి. వీళ్లలో 643 మందికి కోవిడ్ సమయంలో వీళ్ల కుటుంబాలకు రూ.52 లక్షలు డబ్బులు ఇవ్వడం జరిగింది. ఆ టైంలో ఇబ్బందుల్లో ఉన్న అడ్వొకేట్స్‌ను ఆదుకుంటూ మరో 7,733 మందికి రూ.11.56 కోట్లు రుణాలు ఇవ్వడం జరిగింది. మరో 14,848 మంది అడ్వొకేట్లకు మెడి÷–లకెయిమ్ పాలసీ కింద మరో రూ.11.41 కోట్లు చెల్లించాం. అదే టైంలో దాదాపు రూ.25 కోట్లు ఈ ఫండ్ నుంచి అడ్వొకేట్ కమ్యూనిటీకి ఇచ్చి.. వారికి తోడుగా నిలబడగలిగాం. ఇవన్నీ మనసు పెట్టి, వీరికి మంచి జరగాలని ఆలోచన చేసి ఇవ్వగలిగాం. నా పాదయాత్రలో నా దగ్గరకొచ్చి వీళ్లంతా వినపతిపత్రం ఇచ్చినప్పుడు మాట ఇచ్చాను. ఆ మేరకు వాళ్లందరికీ తోడుగా ఉంటూ ఈ నాలుగు సంవత్సరాలుగా అడుగులు వేశాం అని సంతోషంగా చెబుతున్నాను.ఒక స్నేహితుడిగా, ఒక అన్నగా ప్రతి అడ్వొకేట్‌కు నా తరపున ఒకే ఒక రిక్వెస్ట్. కచ్చితంగా గుర్తుపెట్టుకొండి. ప్రభుత్వం ఏ రకంగా మీకు తోడుగా నిలబడుతోందో, జరిగిస్తున్న ఈ మంచిని.. పేద వాడి పక్షాన మీరు కూడా అంతే ఔదార్యం చూపిస్తూ, అంతే మంచి చేసే విషయంలో మానవతాదృక్పథం చూపించాల్సిందిగా ప్రతి అడ్వొకేట్ సోదరుడిని, చెల్లెమ్మను ప్రభుత్వం తరపున మీ అన్నగా, మీ అందరికీ మంచి స్నేహితుడిగా అభ్యర్థిస్తున్నానని అన్నారు.. దేవుడి దయతో మీ అందరికీ మంచి జరగాలని మనసారా కోరుకుంటూ, ఇంకా మంచి చేసే అవకాశాలు, పరిస్థితులు రావాలని మనసారా ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాను అని సీఎం చెప్పారు.

# ప్రభుత్వం అందరికీ న్యాయం చేస్తుంది

- **ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**
- **ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించిన మంత్రి**

హైదరాబాద్,డిసెంబర్11((అక్షరం న్యూస్)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు మేరకు ప్రజా సమస్యలను తెలుసుకుని పరిస్కరించుటకు మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విజ్ఞాపన పత్రాలతో ప్రజలు భారీగా తరలివచ్చారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రజల సమస్యలను తెలుసుకుని వారి నుంచి రాష్ట్ర ఐ టి , పరిశ్రమలు ,శాసన సభ వ్యవహారాలశాఖ మంత్రి డి శ్రీధర్ బాబు వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం పరిషరిస్తుందని తెలిపారు. పెద్దలు, వివిధ వర్గాలతో నెల రోజుల పాటు ప్రజా సమస్యలను కూలంకషంగా చర్చించి మానిఫెస్టో రూపొందించి నట్లు తెలిపారు. పారదర్శకంగా, జవాబుదారీతనంతో తమ ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ విజ్ఞాపనపత్రంలో సమస్యతో పాటు అడ్రస్, ఫోన్ నంబర్ రాయాలని సూచించారు. తద్వారా దరఖాస్తుదారుల సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి , పరిష్కరించుటకు వీలవుతుందని తెలిపారు. ఈ నెల 17 న నిర్వహించనున్న ÷ూ ఉ।నిఇనీ ంఇ పరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. అదే రోజు రెండు, మూడు పరీక్షలు వున్నట్లు అభ్యర్థులు వివరించారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి దృష్టికితీసుకు వెళ్లనున్నట్లు తెలిపారు .తమకు ఇచ్చే గౌరవ వేతనాన్ని ప్రతి నెలా రెగ్యులర్ గా ఇవ్వాలని మధ్యాహ్న భోజన వంట కార్మికులు విజ్ఞాపన పత్రం అందజేశారు.



అన్ని సమస్యలను పరిష్కరించటానికి ప్రభుత్వం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజ్ఞాపనదారుల సౌకర్యార్థం ప్రజాదర్బార్ నిర్వహణకు ప్రభుత్వం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ప్రజాదర్బార్ నిర్వహణను జి హెచ్ ఎం సి కమిషనర్ రోనాల్డ్ రాస్ సమన్వయం చేశారు. ఆయుష్ విభాగం డైరెక్టర్ హరిచందన, సీనియర్ ఐ ఏ ఎస్ అధికారి ముషారఫ్ అలీ, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిసెట్టి, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మంత్రుల కార్యాలయాల్లో ఫైళ్లు,ఫర్నీచర్ మాయం

### దర్యాప్తు ముమ్మరం చేసినట్లు డిసిపి వెల్లడి

హైదరాబాద్,డిసెంబర్11(అక్షరం న్యూస్)

తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు మంత్రుల కార్యాలయాల్లో ఫైళ్ల మాయంపై విచారణ వేగవంతం చేశామని సెంట్రల్ జోన్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నాడు డీసీపీ మాట్లాడుతూ.. ఈ కేసులో డైరక్టర్‌ను విచారణ చేయాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైల్లు, ఫర్నిచర్ మిస్సింగ్ పై దర్యాప్తు చేస్తున్నాం. పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఫైల్స్ మిస్సింగ్ చేసినట్లు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓఎస్డీ కళ్యాణ్‌పై ఆరోపణలు ఉన్నాయి. కళ్యాణ్‌తో పాటు డైరెక్టర్‌ను విచారణ చేసి, స్టేట్‌మెంట్ రికార్డ్ చేస్తాం. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కార్యాలయాల్లో ఫర్నిచర్ మిస్సింగ్‌పై కూడా కేసు నమోదు చేశాం. అలాగే మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కార్యాలయంలో బిర్వాలు మిస్సింగ్‌పై కూడా కేసు నమోదు చేశాం. విద్యాశాఖలో జరిగిన సంఘటన పై దర్యాప్తు జరుగుతుంది. మాజీ మంత్రుల ప్రమేయం ఉంటే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం. విచారణలో ఎవరి ప్రమేయం ఉన్న చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని డీసీపీ శ్రీనివాస్ హెచ్చరించారు.

## ఎపి పోలీసుల పరిస్థితి దయనీయం: వర్ల రామయ్య

అమరావతి,డిసెంబర్11(అక్షరం న్యూస్)

ఏపీలో పోలీసుల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య వ్యాఖ్యానించారు. సోమవారం నాడు టీడీపీ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... పాలు పోసి పెంచిన పాము వారినే కాటేసినట్లు పోలీసుల పరిస్థితి ఉంది. రాయచోటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌ని వైసీపీ నాయకులు చితకబాదితే రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం ఏం చేస్తోంది. గతంలో ప్రతిపక్షాలమీద మీసం మెలేసి తొడగొట్టిన అసోసియేషన్ నేడు ఏమైంది. అధికార పార్టీ వారితో గొడవలెందుకని సీఐని పోలీసు పై అధికారులు సర్ది చెప్పడం అమానుషం. వైసీపీ గూండాల దాడి నుంచి కడప ప్రజలను ఎవరు కాపాడుతారు. సీఐకి రక్షణ కావాలని ఆయన భార్య శ్వేత 100 నెంబర్ కి ఫోన్ చేసి సహాయం చేయమనడం సిగ్గుచేటని వర్ల రామయ్య తెలిపారు.

## కాశ్మీర్‌లో ఎన్నికల నిర్వహణ

### రాష్ట్రప్రతిపత్తిని పునరుద్ధరించాలి

### 370 రద్దు నేపథ్యంలో సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ,డిసెంబర్11(అక్షరం న్యూస్)

జమ్ముకశ్మీర్ లో ఆర్టికల్ 370 రద్దు నిర్ణయాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన తరుణంలో అక్కడ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ధర్మాసనం ఈసీని ఆదేశించింది. కశ్మీర్ రాష్ట్ర హోదాను త్వరగా పునరుద్ధరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించింది. 2024 సెప్టెంబర్ 30కల్లా ఎన్నికలు పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 2019 ఆగస్టులో లడఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా విభజించాలనే నిర్ణయాన్ని సమర్థించింది. తీర్పు నేపథ్యంలో అక్కడ భద్రతను కట్టుదిట్టం చేశారు. కోర్టు నిర్ణయాన్ని గౌరవించాలని బీజేపీ కోరింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించబోమని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ కూటమిగా జమ్ము-కశ్మీర్ పార్టీలు ఏర్పడ్డాయి. గుప్కార్ అలయన్స్ పేరుతో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. పిటిషన్లపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. ఈ ఏడాది ఆగస్ట్ 2 నుంచి ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ జరిపింది. 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370 రద్దు చేస్తూ పార్లమెంట్ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించిన పలు జమ్ము-కాశ్మీర్ రాజకీయ పార్టీలు సుప్రీంను ఆశ్రయించాయి.

## తీర్పు నేపథ్యంలో కాశ్మీర్‌లో భద్రత

- ముఫ్తీని గృహనిర్బంధం అంటూ వార్తలు
- తోసిపుచ్చిన లెఫ్టినెంట్ గవర్నర్

శ్రీనగర్,డిసెంబర్11అక్షరం న్యూస్)

జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దుచేయడంపై సుప్రీం కోర్టు తీర్పును వెలువరించే క్రమంలో కేంద్రపాలిత ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. శ్రీనగర్ సహా సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా బలగాలను మోహరించింది. పలువురు నేతలను గృహనిర్బంధం చేసింది. వారిలో పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ చీఫ్ మెహబూబా ముఫ్తీ కూడా ఉన్నారు. ఈమేరకు పార్టీ సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా వెల్లడించింది. సుప్రీంకోర్టు తీర్పును వెల్లడించడానికి ముందే.. పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ ఇంటికి పోలీసులు తాళాలు వేశారని, ఆమెను గృహ నిర్బందంలో ఉంచారు. అయితే ఈ ఆరోపణలను జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కొట్టిపారేశారు. తమ ప్రభుత్వం ఎవరినీ హౌస్ అరెస్టు చేయలేదని స్పష్టంచేశారు. అది పూర్తిగా నిరాధారమైనదని వెల్లడించారు. రాజకీయ కారణాలతో ఇప్పటివరకు ఎవ్వరినీ అరెస్టు చేయలేదని, గృహ నిర్బంధంలో ఉంచలేదని తెలిపారు. ఇది కేవలం పుకార్లను వ్యాప్తి చేయడానికే ఇదంతా చేస్తున్నారని పేర్కొన్నారు.

# తెలుగు నాటకానికి పండగగా నంది నాటకోత్సవాలు

- 23 నుంచి 29 వరకు వారం రోజుల పాటు ప్రదర్శనలు
- చలనచిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పోసాని కృష్ణమురళి

హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)



తెలుగు నాటకానికి పండుగ రోజైన నంది నాటకోత్సవాలను డిసెంబర్ 23 నుంచి 29 వరకు వారం రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర టి. వి,నాటక రంగ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పోసాని కృష్ణమురళి తెలిపారు. సోమవారం విజయవాడలో నంది అవార్డుల తుది పోటీల న్యాయనిర్ణేతల సమక్షంలో 22వ నంది నాటకోత్సవం -2022కు సంబంధించిన వివరాలను పోసాని కృష్ణమురళి మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా పోసాని మాట్లాడుతూ గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నందినాటకోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఈ ప్రాంగణానికి సత్య హరిశ్చంద్ర నాటక రచయిత బలిజేపల్లి లక్ష్మీకాంతం పేరును నామకరణం చేసినట్లు చెప్పారు. నంది నాటకోత్సవాల్లో భాగంగా 115 ప్రదర్శనలకు గానూ రాష్ట్రం నలుమూలల నుండి పద్య, సాంఘిక నాటకాలు, సాంఘిక నాటికలు, బాలల నాటిక, కళాశాల లేదా యూనివర్సిటీ నాటిక అనే ఐదు విభాగాల్లో ఎంపిక చేసిన 38 నాటక సమాజాలు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయన్నారు. ఆయా విభాగాల్లో కలిపి మొత్తం 74 అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. పూర్తి పారదర్శకంగా నంది అవార్డుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశించినట్లు పోసాని కృష్ణమురళి స్పష్టం చేశారు. తెలుగు నాటక రంగం దేదీప్యమానంగా వెలగాలని, రంగ స్థలానికి పునర్వైభవం తీసుకురావాలన్న సత్సంకల్పంతో నంది నాటకోత్సవాలను ప్రతిష్టాత్మకంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సంకల్పించిందని పోసాని కృష్ణమురళి తెలిపారు. ఎంట్రీల ప్రాథమిక ఎంపిక ఈ ఏడాది సెప్టెంబర్ 6-18 మధ్య జరగిందని, ఫలితాలను సంస్థ 19న వెల్లడించిందని పేర్కొన్నారు. మూడు న్యాయనిర్ణేతల బృందాలు పోటీల్లో పాల్గొనడానికి ముందుకు వచ్చిన నాటక సమాజాల వద్దకు వెళ్లి వాళ్ల ప్రదర్శనలు తిలకించి ఎంపిక చేశాయన్నారు. వీటిలో పద్యనాటకాలలో 26కు గాను 10, సాంఘిక నాటకాలలో 22 కు గాను 6, సాంఘిక నాటికలలో 49 కు గాను 12, కాలేజీ యూనివర్సిటీ స్థాయిలో 9 కు గాను 5, బాలల విభాగాలలో 9 కు గాను 5 ఎంపిక చేయడం జరిగిందని వివరించారు. వారం రోజుల పోటీల్లో తుది ఎంపిక కోసం సంబంధిత సమాజాలు సంస్థ ఛైర్మన్ సమక్షంలో జరిగిన 'లాటరీ'లో పాల్గొన్న అనంతరం ప్రదర్శనల 'షెడ్యూలు'ను సంస్థ ఖరారు చేసిందన్నారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుండి రాత్రి 10 గంటల వరకు నాటక ప్రదర్శనలు జరుగుతాయని పోసాని తెలిపారు. 5 విభాగాలలో స్వర్ణ, రజత, కాంస్య నంది బహుమతుల కోసం జరిగే పోటీల్లో ఒక్కోదానిలో ముగ్గురు చొప్పున మొత్తం 15 మంది న్యాయనిర్ణేతలు ఈ తుది ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేస్తారని పోసాని తెలిపారు. అవార్డులు ప్రదానం చేస్తున్న ఏడాదిలో (2022) నాటక రంగంపై వెలువడిన ఉత్తమ రచన గ్రంథం ఎంపిక కోసం మరో ముగ్గురితో మరో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని పోసాని కృష్ణ మురళి తెలిపారు. 18 మంది ఉత్తమ నిపుణులు, కళాకారులను జడ్జిలుగా ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. న్యాయ నిర్ణేతల ఎంపికలో లోపాలను ఎత్తిచూపిస్తే వారిని కూడా మారుస్తామని పోసాని తెలిపారు. ప్రభుత్వం 1998 నుంచి నంది నాటకోత్సవాల వేదికపై 'ఎన్టీఆర్ రంగస్థల పురస్కారం' పేరుతో నాటకరంగంలో వ్యక్తిగత స్థాయిలో విశేష కృషి చేసిన నటులకు, కళాకారులకు రూ.1,50,000 నగదు ప్రదానం చేస్తోందని పోసాని కృష్ణ మురళి తెలిపారు. ప్రస్తుతం మొదటిసారి ఈ రంగంలో సమిష్టి కృషితో పనిచేసిన సమాజాలకు, పరిషత్తులకు ఈ అవార్డుతో గుర్తింపు లభించనుందని వెల్లడించారు. నాటక రంగంపై ఆసక్తిగల కళాప్రియులకు వేదిక కల్పించి, ఆ రంగం వృద్ధికి గణనీయమైన కృషి చేసిన నాటక సమాజాలు, పరిషత్తులకు రూ.5,00,000 నగదు, 'వైఎస్సార్' ప్రతిమ మొమెంటోతో సత్కరిస్తూ నాటక సమాజాలకు ప్రభుత్వం అరుదైన గౌరవం కల్పించనుందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసిందని పేర్కొన్నారు. 'ఎన్టీఆర్', 'డా. వై.ఎస్.ఆర్'. అవార్డుల ఎంట్రీలకు తుది గడువు డిసెంబర్ 20 వరకు పొడిగించిన నేపథ్యంలో ఇంకా ఎవరైనా కళాకారులు దరఖాస్తు చేసుకోకపోతే ఎఫ్ డీసీకి మెయిల్ ద్వారా సంబంధిత గడువులోగా దరఖాస్తులు పంపాలన్నారు. బాలల, కళాశాల విద్యార్థి నాటకాల విభాగాల్లో వ్యక్తిగత బహుమతులను వచ్చే సంవత్సరం నుండి అందించే అంశాన్ని సంస్థ పరిశీలిస్తుందని పోసాని కృష్ణమురళి తెలిపారు. ఈ సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఆదరణ తగ్గుతున్న నాటక రంగానికి పూర్వ వైభవం లభిస్తుందన్న కళాభిలాషుల ఆకాంక్ష నెరవేరనుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో నాటక రంగంలోకి కొత్తగా యువతరం ప్రవేశించే అవకాశం మెండుగా ఉందన్నారు. పూర్తి పారదర్శకంగా అవార్డుల ఎంపిక పక్రియ చేపడుతున్నామని, అవార్డుల ఎంపికకు అనుభవజ్ఞులైన ప్రముఖ నాటక రంగం వ్యక్తులతో వివిధ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. స్థానిక కళాకారులు, అధికారులతో నిర్వహణ కమిటీ, ఆహ్వాన కమిటీ, స్టేజీ కమిటీ, ఆడిటోరియం కమిటీ, ఆతిథ్య కమిటీ, వసతి సదుపాయాలు మరియు రవాణా కమిటీ, ప్రెస్ సమన్వయ కమిటీ తదితర కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. మీడియా సమావేశంలో రాష్ట్ర చలనచిత్ర, టీవీ, థియేటర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఎంవీఎల్ఎన్ శేషసాయి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖలో టైకూన్ జంక్షన్ మూసివేత

- నిరసనగా జనసేన నేతల ఆందోళన
- నాదెండ్ల మనోహర్ తదితరుల అరెస్ట్
- జనసేన నేతలను వెంటనే విడుదల చేయాలన్న పవన్
- అరెస్టులను ఖండించిన టిడిపి నేత లోకేశ్

విశాఖపట్నం,డిసెంబర్11అక్షరం న్యూస్)

విశాఖలో ఆందోళన చేస్తున్న జనసేన నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. జనసేన నేతలు నాదెండ్ల మనోహర్, పంచకర్ల రమేష్ బాబు, కోన తాతారావు సహా పలువురు జనసేన నేతలు నోవోటల్ హోటల్ వద్ద బైఠాయించి ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా జనసేన నేతలు నినాదాలు చేశారు. హలో ఏపీ... బై బై వైసీపీ అంటూ నోవాటల్ వద్ద నినాదాలు హోరెత్తాయి. దీంతో పోలీసులు వారిని అడ్డుకుని అరెస్ట్ చేశారు. విశాఖలో టైకూన్ జంక్షన్ వద్ద మూసేసిన రోడ్డును తెరవాలంటూ నాదెండ్ల నేతృత్వంలో జనసేన కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దాంతో పోలీసులు నాదెండ్లతోసహా మిగిలినవారిని కూడా అరెస్టు చేశారు.విశాఖపట్నంలో టైకూన్ జంక్షన్ ను మూసి వేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంటే నిరసన తెలిపి, ఆ కూడలిని తెరవాలని కోరినందుకు జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని పవన్ కల్యాణ్ మండిపడ్డారు. జనసేన నేతల అరెస్ట్‌పై అధినేత పవన్ కళ్యాణ్ స్పందించారు. ప్రజా సమస్యలపై పోరాడిన జనసేన నేతలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో పాటు మిగిలిన నేతలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, పోలీసుల తీరును ఖండిస్తున్నామన్నారు. జనసేన నేతలను విడుదల చేయకపోతే తానే విశాఖ వచ్చి ప్రజా సమస్యల పై పోరాడతానని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ప్రజలకున్న సమస్యలను తీర్చాల్సిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, పోలీసులు అధికారులు ఇందుకు భిన్నంగా స్థానిక ఎంపీ కోసం జంక్షన్ మూసివేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆయన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుకి వాస్తు దోషం ఉందని రోడ్డు మూసి వేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాలను ప్రజా గొంతుకగా జనసేన వినిపిస్తోందని.. అందులో భాగంగా ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలపాలనిమనోహర్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, వీర మహిళలు సన్నద్ధమైతే పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణంగా ఉందన్నారు. మనోహర్ ని, ఇతర నేతలను తక్షణమే విడుదల చేయాలి. ఇదే ధోరణిలో వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తే విశాఖపట్నం బయలుదేరి వస్తాను. ప్రజల తరఫున పోరాడతానని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. వైఎస్ఆర్ సీపీకి చెందిన ఒక ఎంపీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుకు వాస్తు దోషం ఉందన్న కారణంతోనే రోడ్డును మూసేశారని ఆయన ఆరోపించారు. దీనిపై పోరాడితే అరెస్టు చేయడం అన్యాయమన్నారు. విశాఖలో జనసేన నేతల అరెస్ట్‌పై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్పందించారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, జనసేన నేతల అక్రమ అరెస్టుని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ప్రతిపక్షాలకు నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా చేసిన నియంత పాలనకు చరమగీతం పాడుదామని లోకేష్ పిలుపునిచ్చారు.

# భారత్‌లో కాశ్మీర్ విలీనానికి మెలిక

- 370 ఆర్టికల్‌తో ప్రత్యేక అధికారాలు
- ఆనాడే కొంత భాగాన్ని ఆక్రమించిన పాక్

న్యూఢిల్లీ,డిసెంబర్11(అక్షరం న్యూస్)

జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీం కోర్టు సోమవారం కీలక తీర్పు వెలువరించింది. ఇది కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని, ఆర్టికల్ 370 రద్దుపై పార్లమెంట్ నిర్ణయాన్ని కొట్టిపారేయలేమని సీజేఐ డీవై చంద్రచూడ్ తెలిపారు. జమ్ము కశ్మీర్ భారతదేశంలో చేరినప్పుడు సార్వభౌమాధికారం లేదని, దీంతో కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని సవాలు చేయకూడదని ఆయన అన్నారు. ఇతర రాష్ట్రాలకు భిన్నంగా అంతర్గత సార్వభౌమాధికారం లేదని చెప్పారు. ఈ మేరకు రాజ్యాంగంలో కూడా ప్రస్తావని లేదని సీజేఐ చంద్రచూడ్ స్పష్టం చేశారు. అయితే అసలు ఆర్టికల్ 370 అంటే ఏమిటన్న దానిపై చాలామందికి అనుమానాలు ఉన్నాయి. 1947లో భారతదేశానికి స్వాతంత్రం వచ్చింది. ఆ తర్వాత దేశంలో ఇంకా కొన్ని ప్రాంతాలు చిన్న చిన్న రాజ్యాలుగా ఉండేవి. దీంతో వాటిని భారత యూనియన్‌లో కలుపుకోవడానికి నాటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అలా అనేక సంస్థానాలు దేశంలో విలీనం అయ్యాయి. నిజాం అధీనంలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రాన్ని ఈ క్రమంలోనే భారతదేశంలో విలీనం చేశారు. ఈ క్రమంలోనే స్వతంత్ర రాజ్యంగా ఉన్న జమ్ము కశ్మీర్‌ను కూడా భారత్‌లో విలీనం చేయడానికి అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కానీ జమ్ము కశ్మీర్‌ను భారత్‌లో కలపడానికి ఆ ప్రాంత రాజుగా ఉన్న మహారాజా హరి సింగ్ మూడు షరతులు విధించారు. అవి విదేశీ వ్యవహారాలు, రక్షణ, కమ్యూనికేషన్స్. ఈ క్రమంలోనే జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించడంపై చర్చలు జరిపారు. జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే విధంగా ఆర్టికల్ 370ని తీసుకొచ్చారు. అయితే ఇంతలోనే భారత్‌తో విడిపోయిన పాక్ దాడి చేసి కాశ్మీర్‌లోని కొంత భాగాన్ని ఆక్రమించింది. అప్పుడున్న పరిస్థితుల్లో నెహ్రూ నిస్సహాయంగా ఉండిపోయారు. ఆక్రమించిన కాశ్మీర్ భాగమే ఇప్పుడు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌గా మిగిలింది. ఈ ఆర్టికల్ 370ని షేక్ అబ్దుల్లా రూపొందించారు. దీనిని ఆమోదించడంతో జమ్ము కశ్మీర్ భారతదేశంలో విలీనం అయింది. కానీ జమ్ము కశ్మీర్‌కు ఆర్టికల్ 370 కింద కొన్ని ప్రత్యేక అధికారాలు, ప్రతిపత్తిని కల్పించారు. రాష్ట్రపతి ఉత్తర్వు ఆధారంగా 1954 మే 14 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. 1956 ఫిబ్రవరి 11- 1994 ఫిబ్రవరి 19 మధ్య నలభై ఏడు రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆర్టికల్ 370 ప్రకారం రక్షణ, విదేశీ వ్యవహారాలు, ఫైనాన్స్ అండ్ కమ్యూనికేషన్ల విషయాల్లో మినహా ఇతర అంశాల్లో జమ్ము కశ్మీర్‌లో చట్టాలను అమలు చేయాలంటే పార్లమెంట్‌కు అక్కడి రాష్ట్రప్రభుత్వం ఆమోదం తప్పనిసరిగా ఉండాలి. అలాగే జమ్ము కశ్మీర్‌కు భారత్ రాజ్యాంగంతోపాటు మరో ప్రత్యేక రాజ్యాంగం కూడా ఉంటుంది. జమ్ము కశ్మీర్ ప్రజల పౌరసత్వం, ఆస్తి యాజమాన్యం, ప్రాథమిక హక్కుల చట్టం దేశంలోని మిగిలిన ప్రాంతాల వారికి భిన్నంగా ఉంటుంది. ఆర్టికల్ 370 ప్రకారం ఇతర రాష్ట్రాల వారు జమ్ము కశ్మీర్‌లో ఆస్తులు కొనుగోలు చేయలేరు. అలాగే అక్కడ ఆర్థిక అత్యవసర పరిస్థితిని ప్రకటించే అధికారం కూడా కేంద్ర ప్రభుత్వానికి లేదు. భారతదేశం నుంచి విడిపోయిన తర్వాత జమ్ము కశ్మీర్‌ను తమలో విలీనం చేసుకోవడానికి పాకిస్థాన్ అనేక ప్రయత్నాలు చేసింది. ఆర్టికల్ 370 ప్రకారం షరతులతో జమ్ము కశ్మీర్ భారత్‌లో విలీనం అయింది. అప్పటి నుంచి కశ్మీర్ విషయమై భారత్, పాకిస్థాన్ మధ్య నిత్యం వివాదం రగులుతునే ఉంది. ఆర్టికల్ 370 ప్రకారం జమ్ము కశ్మీర్‌లో భారత చట్టాలను నేరుగా అమలు చేయడానికి వీలుపడకపోవడంతో దీనిని చాలా మంది వ్యతిరేకించారు. దేశంలోని పౌరులందరికీ ఒకే విధమైన హక్కులు ఉండాలనే వాదనలు బలపడ్డాయి. దీని కోసం ఆర్టికల్ 370ని రద్దు చేయాలనే డిమాండ్లు తెరపైకి వచ్చాయి. దీంతో 2019 ఆగష్టు 5న కేంద్రంలోని నరేంద్ర ప్రభుత్వం జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏ ను రద్దు చేసింది. అలాగే జమ్ము

కశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించారు. అవి ఒకటి జమ్ము కశ్మీర్ కాగా, మరొకటి లఢఖ్. ఇది 2019 అక్టోబర్ 31 నుంచి అమల్లోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై జమ్ము కశ్మీర్‌లోని స్థానికులతోపాటు రాజకీయ నాయకులు, విశ్లేషకుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొంతమంది స్వాగతించగా.. మరికొందరు వ్యతిరేకించారు. ఈ క్రమంలోనే పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై సుప్రీం కోర్టులో మొత్తం 23 పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో ఈ పటిషన్లపై ఈ ఏడాది ఆగష్టు 2న అత్యున్నత న్యాయస్థానం విచారణ ప్రారంభించింది. 16 రోజులపాటు విచారణ జరిపిన ధర్మాసనం సెప్టెంబర్ 5న తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. ఆ తీర్పునే దేశ అత్యున్నత న్యాయస్థానం సోమవారం ప్రకటించింది.

# 370 ఆర్టికల్ రద్దు సమర్థనీయమే

- రద్దు నిర్ణయం రాజ్యాంగబద్ధమే
- ఆర్టికల్ రద్దుకు రాష్ట్ర అనుమతి అవసరం లేదు
- జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక సార్వభౌమాధికారం లేదు
- ఈ ఆర్టికల్ తాత్కాలిక ఏర్పాటు మాత్రమే
- కాశ్మీర్ అన్ని రాష్ట్రాలతో సమానమే
- లద్దాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంత చేయడం సరైనదే
- రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నించలేం
- కాశ్మీర్ స్వయంప్రతిపత్తిపై సుప్రీ ధర్మాసనం తీర్పు
- త్వరగా కాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలన్న సిజెఐ




న్యూఢిల్లీ,డిసెంబర్11(అక్షరం న్యూస్)

జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దును సుప్రీంకోర్టు సమర్థించింది. ఇది రాజ్యాంగబద్ధమే అని సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఆర్టికల్ 307 రద్దుని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సమర్థించింది. ఇది కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని, పార్లమెంటు నిర్ణయాన్ని కొట్టిపారేయలేమని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ వివరించారు. జమ్మూ కశ్మర్ భారతదేశంలో చేరినప్పుడు సార్వభౌమాధికారం లేదని, కేంద్రం తీసుకునే ప్రతి చర్యనూ సవాలు చేయకూడదని సీజేఐ పేర్కొన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌లు తీర్పు వెలువరించారు. ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి కేంద్రానికి రాష్ట్రం అనుమతి అవసరం లేదని సీజేఐ పేర్కొన్నారు. ఇదే సందర్భం లో జమ్మూ,కాశ్మీర్‌లో వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. జమ్మూకశ్మీర్ అంశంలో రాష్ట్రపతి ప్రకటనపై జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఆర్టికల్ 370 రద్దుపై కేంద్రం వాదనలను సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. ఆర్టికల్ 370 అనేది తాత్కాలిక నిబంధన మాత్రమే అని, శాశ్వతం కాదని స్పష్టం చేసింది. ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సోమవారం తమ నిర్ణయాన్ని ప్రకటించింది. రాజ్యాంగబద్ధంగానే ఆర్టికల్ 370 రద్దు నిర్ణయం జరిగిందని తెలిపింది. రాజ్యాంగంలోని అన్ని అంశాలూ కశ్మీర్‌కు వర్తిస్తాయని, మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో జమ్మూకశ్మీర్ సమానమే అని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్టికల్ 370 రద్దు వెనుక ఎటువంటి దురుద్దేశం కనిపించడం లేదని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యా నించింది. ఈ మేరకు కేంద్రం నిర్ణయానికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. జమ్మూ కశ్మీర్ కు ప్రత్యేక హోదా కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 ని 2019 ఆగస్టు 5న కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. అనంతరం జమ్మూ- కశ్మీర్ ను రెండు కేంద్రపాలిత (జమ్మూ-కశ్మీర్, లడఖ్) ప్రాంతాలుగా ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పులోని ముఖ్యమైన అంశాలు ఇలావున్నాయి. భారత యూనియన్‌లో చేరిన ప్పుడు జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక సార్వభౌమత్వం లేదని సీజేఐ వ్యాఖ్యానించారు. భారత రాజ్యాంగంలోని ప్రతి నిబంధనను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి అవసరం లేదని కూడా సీజేఐ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 తాత్కాలిక నిబంధన. రాష్ట్రంలో యుద్ధ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. జమ్మూకాశ్మీర్ కూడా అన్ని రాష్ట్రాల లాంటిదే. ఇతర రాష్ట్రాలకు విభిన్నంగా అంతర్గత సార్వభౌమాధికారం లేదు. ఈ మేరకు రాజ్యాంగంలో కూడా ప్రస్తావన లేదు. లద్దాఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా పునర్వ్యవస్థీకరించడం సమర్థనీయం అనిఅన్నారు. ఒక రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చవచ్చా.. లేదా అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేదని సీజేఐ అభిప్రాయపడ్డారు. ఆర్టికల్ 370 ముఖ్య ఉద్దేశ్యం జమ్మూ కాశ్మీర్‌ను నెమ్మదిగా దేశంలోని ఇతర రాష్ట్రాలతో సమానంగా తీసుకురావడమేనని జస్టిస్ కౌల్ పేర్కొన్నారు. డొంక దారిలో నిబంధనల సవరణ సరికాదు. ఒక విధానాన్ని సూచించినప్పుడు దానిని తప్పకుండా అనుసరించాలి. ఆర్టికల్ 367 ఉపయోగించి ఆర్టికల్ 370 సవరణ ప్రక్రియ చేపట్టడంపై జస్టిస్ కౌల్ స్పష్టత ఇచ్చారు. ప్రభుత్వం 'నిష్పాక్షిక నిజం, సయోధ్య కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ అంశంతో ముడిపడి ఉన్న సున్నితమైన అంశాలను పరిగణలోకి తీసుకోవా లని జస్టిస్ కౌల్ సిఫార్సు చేశారు. ఇదిలావుండగా తీర్పు నేపథ్యంలో కశ్మీర్ అంతటా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. తీర్పును రాజకీయం చేయవద్దంటూ బీజేపీ కోరింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించబోమని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ కూటమిగా జమ్ము-కశ్మీర్ పార్టీలు ఏర్పడ్డాయి. గుప్కార్ అలయన్స్ పేరుతో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. పిటిషన్లపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. ఈ ఏడాది ఆగస్ట్ 2 నుంచి ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ జరిపింది. మొత్తంగా ఆర్టికల్ 370ను రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉందని ధర్మాసనం పేర్కొంది. హక్కుల విషయంలో జమ్ముకశ్మీర్ కు ప్రత్యేకత ఏమీ లేదు. మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో అది సమానమే. ఆర్టికల్ 1, ఆర్టికల్ 370 ప్రకారం భారత్ లో జమ్మూకశ్మీర్ అంతర్భాగమే. కేంద్రం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని సవాల్ చేయడం సరికాదు. 370 ఆర్టికల్ రద్దు అంశంపై ఇప్పటికే 3 తీర్పులు ఉన్నాయి. గత తీర్పులను పిటిషనర్లు సవాల్ చేయలేదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా జమ్ముకశ్మీర్ నుంచి లద్దాఖ్ ను విభజించి దాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించడాన్ని సైతం సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. ప్రస్తుతం, జమ్మూకశ్మీర్ లో రాష్ట్ర హోదాను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని కేంద్రాన్ని ఆదేశించింది. 2024, సెప్టెంబర్ 30లోగా జమ్మూకశ్మీర్ లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సూచించింది. జమ్మూకశ్మీర్ కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ను కేంద్ర ప్రభుత్వం 2019 ఆగస్ట్ 5న పూర్తిగా రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని 2 కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ జమ్మూకశ్మీర్ కు చెందిన పలు పార్టీలు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ ఏడాది ఆగస్ట్ 2 నుంచి సుదీర్ఘంగా విచారించింది. సెప్టెంబర్ 5న తీర్పును రిజర్వ్ చేసి సోమవారం తాజాగా తీర్పు వెలువరించింది. కీలక తీర్పు వెలువడిన నేపథ్యంలో అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలను చేపట్టింది. గత రెండు వారాలుగా కశ్మీర్ లోయలోని 10 జిల్లాల్లో పోలీసులు భారీగా మోహరించారు. ఇప్పటికే కొందరు నాయకులను అదుపులోకి తీసుకోగా, మరికొందరిని గృహ నిర్బంధంలో ఉంచారు. ప్రజలను రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.



## తుది దశకు గుంటూరు కారం షూటింగ్

హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)

మహేష్ బాబు, శ్రీలీల జంటగా నటిస్తున్న 'గుంటూరు కారం' సినిమా తుది దశకు చేరుకుంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఈనెల 25లోపు మొత్తం పూర్తవుతుందని యూనిట్ సభ్యుల టాక్. కేరళకి వెళ్లి తీయాల్సిన పాటని హైదరాబాదులో తీసేసారు అని తెలిసింది. కేరళలో వరదలు, లైటింగ్ కూడా అనుకున్నవిధంగా లేకపోవటంతో ఆ పాటని హైదరాబాదులో పూర్తి చేసినట్టుగా తెలుస్తోంది. ఇది మాంటేజ్ పాట అని, ఇది ఇక్కడ హైదరాబాదులో పూర్తి చేసారని తెలిసింది. ఇక మిగతా పాటలని కూడా హైదరాబాదులోనే తీయనున్నట్టుగా కూడా తెలిసింది. ఒకటి శ్రీలీల, మహేష్ బాబు ల మీద ఉంటుందని, ఈ పాట కోసం ఒక ప్రత్యేక సెట్ కూడా తయారయిందని తెలిసింది. ఈ సినిమాలో మహేష్ బాబు పాత్ర పేరు రమణ అని కూడా ఒక చిన్న లీక్ బయటకి వచ్చింది. అలాగే ఇంకో మాస్ పాట కూడా ఉండబోతోందని, ఇది కూడా హైదరాబాదులో తీస్తారు అని తెలిసింది. ఇక మహేష్ బాబు, ప్రకాష్ రాజ్ మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాలో హైలైట్ గా వుంటాయని అంటున్నారు. వాళ్ళిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలన్నీ చాలా ఇంటెన్సిటీ తో వుంటాయని తెలుస్తోంది. మహేష్ బాబు ఈ సినిమాకి డబ్బింగ్ కూడా మొదలుపెట్టేశారు అని కూడా తెలుస్తోంది. అన్నీ ఈ నెల 25లోగా పూర్తి చేసెయ్యాలన్న దృఢ సంకల్పంతో మొత్తం యూనిట్ వున్నారని తెలుస్తోంది. జనవరి 5 నుండి ప్రచారాలు కూడా మొదలుపెడతారని తెలుస్తోంది. ఈ సినిమా హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తోంది.



## ఈ వారం చిన్న చిత్రాల హవా

**థియేటర్లలోకి వస్తున్న పలు సినిమాలు**

హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)

ఈ ఏడాది చివరికి చేరుకుంది. నెలాఖరులో పెద్ద 'సలార్' 'డంకీ' లాంటి చిత్రాల హవా ఉండడంతో చిన్న చిత్రాలు అన్ని ఈ వారం విడుదలకు వరుస కట్టాయి. ఈ వారం థియేటర్స్‌లో ప్రేక్షకుల ముందుకు వస్తున్న సినిమాల్లో జోరుగా హుషారుగా... ఒకటి. విరాజ్ అశ్విన్ హీరోగా అను ప్రసాద్ తెరకెక్కిస్తున్న చిత్రం 'జోరుగా హుషారుగా'. అను ప్రసాద్ దర్శకత్వంలో నిరీష్ తిరువిధుల నిర్మించారు. పూజిత పొన్నాడ కథానాయిక. 'బేబీ'తో పాపులర్ అయిన విరాజ్ నటిస్తున్న చిత్రమిది. పోస్టర్స్, ట్రైలర్స్ మెప్పించేలా ఉన్నాయి. ఈ నెల 15న విడుదల కానున్న ఈ చిత్రం చక్కని విజయం అందుకుంటుందని నమ్మకం వ్యక్తం చేశారు. ఇకపోతే 'పిండం' చిత్రంతో ప్రేక్షకుల్ని భయపెట్టేందుకు సిద్ధమవుతున్నారు హీరో శ్రీరామ్. సాయికిరణ్ దైదా తెరకెక్కించిన ఈ చిత్రానకి యశ్వంత్ దగ్గుమాటి నిర్మాత. ఈ నెల 15న థియేటర్లలోకి వస్తోంది.. 'మరణం అనేది నిజంగానే అంతమా? మరణించిన తర్వాత ఏం జరుగుతుంది అనేది ఎవరైనా చెప్పగలరా? కోరికలు తీరని వారి ఆత్మలు ఈ భూమ్మీద నిలిచిపోతాయా? ఆ ఆత్మలు నిజంగానే మనకు హాని చేయగలవా? అన్న అంశాలతో సస్పెన్స థ్రిల్లర్‌గా ఈ చిత్రం రాబోతోంది. ఈశ్వరీరావు, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హారర్ 'కలశ'..భానుశ్రీ, సోనాక్షి వర్మ, అనురాగ్ కీలక పాత్రల్లో కొండా రాంబాబు తెరకెక్కించిన చిత్రం 'కలశ'. రాజేశ్వరి చంద్రజ వాడపల్లి నిర్మించారు. అన్ని డిసెంబరు 15న థియేటర్లలోకి రానుంది. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు అనూహ్య స్పందన వచ్చింది.

తికమక తాండ ..కవలలు హరికృష్ణ, రామకృష్ణ కథానాయకులుగా నటించిన చిత్రం 'తికమక తాండ'. యాని, రేఖ నిరోష కథానాయికలు. వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు. తిరుపతి శ్రీనివాసరావు నిర్మాత. ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. 'ఒక ఊరి నేపథ్యంలో సాగే కథ ఇది. తికమక తాండా అని ఆ ఊరిని ఎందుకన్నారనేది తెరపైనే చూడాలి' చిత్ర బృందం చెబుతోంది.క్యూబా పోరాటయోధుడు చేగువేరా జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'చే'. లాంగ్ లైవ్ అనేది ట్యాగ్ లైన్. నవ ఉదయం సమర్పణలో నేచర్ ఆర్ట్స్ బ్యానర్‌పై బి.ఆర్ సభావత నాయక్ టైటిల్ రోల్ పోషిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. సూర్య, బాబు, దేవేంద్ర సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ 15న ఈ చిత్రం విడుదల కానుంది.

# హాయ్ నాన్న మనసుకు హత్తుకునేలా ఉంది

**నానికి అభినందనలు తెలిపిన పుష్ప**

డిసెంబర్11(అక్షరం న్యూస్)

నాని హీరోగా నటించిన 'హాయ్ నాన్న' చిత్రంపై అల్లు అర్జున్ ప్రశంసల వర్షం కురిపించారు. మధురమైన చిత్రమని, మనసుకు హత్తుకుందని ఆయన కొనియాడారు. నాని, మృణాల్ ఠాకూర్ జంటగా శౌర్యువ్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రాన్ని ఆయన వీక్షించారు. ఈ మేరకు చిత్ర బృందాన్ని ప్రశంసిస్తూ సినిమాకు రివ్యూ ఇచ్చారు. 'సోదరుడు నాని నటన అద్భుతం. ఆక్షణీయమైన స్క్రిప్టును వెలుగులోకి తెచ్చినందుకు టీమ్ మీద మరింత రెస్పెక్ట్ పెరిగింది. మృణాల్ నటన మనసుకు హత్తుకుంది. ఆ పాత్ర ఆమెకు లాగే బ్యూటిఫుల్‌గా ఉంది. మై డార్లింగ బేబీ కియారా.. నీ క్యూట్‌నెస్‌తో మనసుల్ని కరిగించేశావు. ఇక చాలు స్కూల్‌కి వెళ్లిపో. మిగిలిన ఆర్టిస్టులు కూడా ఎక్కడా పేరు పెట్టడానికి లేకుండా తమ ప్రతిభను చూపించారు. సాంకేతిక నిపుణుల అద్భుతమైన పని తెరపై కనిపిస్తోంది. ముఖ్యంగా కెమెరామెన సాను జాన వర్గీస్, సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వాహబ్ గొప్ప టెక్నీషియన్స అని నిరూపించుకున్నారు. ఇక దర్శకుడు శౌర్యువ్ తొలి చిత్రంతోనే అందరినీ ఆకట్టుకున్నారు. ఎన్నో హృదయాలను హత్తుకునేలా, కంట తడి పెట్టేలా సన్నివేశాలను క్రియేట్ చేశారు. సీన్స్ ప్రజంటేషన్ చాలా బావుంది. ప్రతి సన్నివేశాన్ని చాలా మెచూర్డ్‌గా చిత్రీకరించారు, అద్భుతమైన స్క్రిప్టును ఎంకరేజ్ ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన నిర్మాతలకు అభినందనలు. 'హాయ్ నాన్న' చిత్రం తండ్రులనే కాకుండా ప్రతి కుటుంబ సభ్యుడి హృదయాన్ని హత్తుకుంటుంది' అని అల్లు అర్జున్ ట్వీట్‌లో పేర్కొన్నారు. బన్నీ చేసిన ట్వీట్‌కు నాని స్పందించారు. 'అర్హా తండ్రి ఆమోదించారు. మంచి సినిమా కోసం మీరు ఎప్పుడూ నిలబడతారు. థ్యాంక్యూ సో మచ్ బన్నీ' అని ట్వీట్‌కు రిప్లై ఇచ్చారు నాని.



## నాసామి రంగా నుంచి పాట విడుదల




హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)
సంక్రాంతికి 'నా సామిరంగా' చిత్రంతో సందడి చేయబోతున్నారు నాగార్జున. విజయ్ బిన్నీ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆషికా రంగనాథ్ కథానాయిక. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. ఆదివారం 'నా సామిరంగ' నుంచి 'ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే... రమణి ముద్దుల గుమ్మ నందనా' అంటూ సాగే తొలి గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. చంద్రబోస్ సాహిత్యానికి ఎంఎం కీరవాణి స్వరాలు సమకూర్చారు. రామ్ మిరియాల ఆలపించారు. ప్రసన్నకుమార్ బెజవాడ ఈ చిత్రానికి కథ, మాటలు అందిస్తున్నారు.

## డెవిల్ ఫస్ట్ లుక్ విడుదల




హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)
నందమూరి కల్యాణ్‌రామ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం డెవిల్. ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్ అనేది ఉపశీర్షిక. ఈ చిత్రానికి అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తుండగా.. స్పై థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కుతుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి లాంఛ్ చేసిన కల్యాణ్‌రామ్, మాళవిక నాయర్, ఎల్నాజ్ నొరౌజీ ఫస్ట్ లుక్ పోస్టర్‌లతో పాటు డెవిల్ టీజర్.. నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే ఈ మూవీ నుంచి కొన్నాళ్లుగా ఎలాంటి అప్‌డేట్స్ రాలేదు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కొత్త న్యూస్ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం నయా అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ మూవీ ట్రైలర్‌కు సంబంధించి మేకర్స్ సాలిడ్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ ట్రైలర్‌ను డిసెంబర్ 12న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా తెలిపింది. ఇక ఈ సినిమాను డిసెంబర్ 29న పాన్ ఇండియా లెవల్లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. దేశ ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా డెవిల్ ముసుగేసుకుని బ్రిటీషర్ల కోసం కళ్యాణ్‌రామ్ ఎందుకు పని చేశాడనే కాన్సెప్ట్‌తో పీరియాడిక్ స్పై థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు తెలుస్తుంది. లుక్స్ పరంగా కళ్యాణ్ రామ్ కూడా ఈ సినిమాలో చాలా బాగున్నాడు. అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై అభిషేక్ నామా ఈ సినిమాను నిర్మిస్తున్నాడు.

## పిండం సినిమాకు ఎ సర్టిఫికెట్



హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)
ఒకరికి ఒకరు ఫేమ్ శ్రీరామ్ నటిస్తున్న తాజా చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. కుశీ రవి హీరోయిన్‌గా నటిస్తుండగా.. సాయికిరణ్ దైదా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇక సాయికిరణ్‌కు ఇదే మొదటి మూవీ. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్, ట్రైలర్‌లు విడుదల చేయగా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమా సెన్సార్ కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ మూవీకి 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చింది. ఈ విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తూ.. ఈ సినిమాను గర్భిణీ స్త్రీలు చూడవద్దని సెన్సార్ బోర్డు హెచ్చరిక జారీచేసినట్లు తెలిపింది.

# వివాహబంధంతో ఒక్కటై ఆరేళ్లు పూర్తయ్యాయి

హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)
చాలా మంది సెలబ్రిటీల మాదిరే.. టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ, బాలీవుడ్ హీరోయిన్ అనుష్క శర్మల ప్రేమ బంధం కూడా మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలిపోతుందంటూ సోషల్ మీడియాలో ఎన్నో వదంతులు వచ్చాయి. వాటన్నింటిని పటాపంచలు చేస్తూ.. తమ ప్రేమ బంధాన్ని విరుష్క జోడి పెళ్లి పీటలు వరకు తీసుకెళ్లారు. కోహ్లీ-అనుష్కలు వివాహబంధంతో ఒక్కటై ఆరేళ్లు పూర్తయ్యాయి. దీంతో సోషల్ మీడియాలో ఈ జంటకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. దాంతో విరుష్క ట్రెండింగ్‌లోకి వచ్చింది. 2013లో ఓ షాంపు యాడ్ కోసం చేసిన చిత్రీకరణలో విరాట్ కోహ్లీ, అనుష్క శర్మలు మొదటిసారి కలుసుకున్నారు. ఇద్దరు చిత్రీకరణలో స్నేహితులుగా మారారు. ఆ తర్వాత వీరి స్నేహం కాస్తా ప్రేమగా మారింది. విరుష్క జోడి కొన్నేళ్లు ప్రేమాయణం సాగించారు. ఇరు కుటుంబాల పెద్దలు పెళ్లికి అంగీకరించడంతో.. 2017 డిసెంబర్ 11న ఇటలీలో అతికొద్దిమంది బంధుమిత్రుల సమక్షంలో వివాహబంధంలోకి అడుగుపెట్టారు. వీరి ప్రేమబంధానికి గుర్తింపుగా 'వామిక' అనే కూతురు ఉంది. ప్రస్తుతం అనుష్క గర్భవతి. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్ అనంతరం విరాట్ కోహ్లీ విశ్రాంతి తీసుకుంటున్నాడు. దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్ ద్వారా తిరిగి భారత జట్టులోకి అడుగుపెట్టనున్నాడు.



దక్షిణాఫ్రికా సిరీస్ తర్వాత ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్, ఆపై ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024లో కోహ్లీ ఆడనున్నాడు. ప్రపంచకప్ 2023లో విరాట్ పరుగుల వరద పారించిన విషయం తెలిసిందే. మరోవైపు పెళ్లి అనంతరం అనుష్క శర్మ సినిమాలకు దూరంగా ఉంటూ.. కుటుంబంతో గడుపుతున్నారు.

# కవర్స్ కొనేంత డబ్బు దక్షిణాఫ్రికా వద్ద లేదా?



హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)
భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఆదివారం జరగాల్సిన తొలి టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. డర్బన్‌లో వర్షం ఎంతకీ తగ్గకపోవడంతో టాస్ వేయడం కూడా సాధ్యం కాలేదు. ఒక్క బంతి కూడా పడకపోవడంతో దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డుపై భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ మండిపడ్డారు. మైదానం మొత్తాన్ని కప్పి ఉంచే కవర్స్ కొనేంత డబ్బు కూడా దక్షిణాఫ్రికా వద్ద లేదా? అని విమర్శించారు. మైదానాన్ని కవర్స్‌తో కప్పి ఉంచలేనందుకే వన్డే ప్రపంచకప్ 2019లో ఎన్నో మ్యాచ్‌లు రద్దు అయ్యాయని గుర్తు చేశారు.స్టార్ స్పోర్ట్స్‌లో సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ%ొా% 'మైదానం మొత్తం కవర్స్ కప్పి ఉంచకపోతే.. వర్షం ఆగిన తర్వాత కూడా మ్యాచ్ ఆరంభానికి ఇంకో గంట ఎదురుచూడాల్సి ఉంటుంది. మరోసారి వర్షం కురిస్తే మ్యాచ్ కొనసాగదు. ఈ విషయం అందరికీ తెలుసు. అన్ని క్రికెట్ బోర్డులకు చాలా డబ్బు వస్తోంది. అన్ని క్రికెట్ బోర్డుల దగ్గర పుష్కలంగా డబ్బులు ఉన్నాయి. డబ్బులు లేవని చెబితే అబద్ధం చెబుతున్నట్లే. బీసీసీఐ దగ్గర ఉన్నంత డబ్బు దక్షిణాఫ్రికా బోర్డు వద్ద లేకపోవచ్చు. కానీ మైదానంను కప్పి ఉంచే కవర్స్‌ను కొనేంత డబ్బు ఉంటుంది' అని అన్నారు. 2019 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌లో వాతావరణం అందరినీ నిరాశపరిచిందని బ్యాటింగ్ ఐకాన్ సునీల్ గవాస్కర్ గుర్తుచేశారు. 'మైదానంను కవర్స్‌తో కప్పి ఉంచలేనందుకే ప్రపంచకప్ 2019లో ఎన్నో మ్యాచ్‌లు రద్దు అయ్యాయి. వర్షం ఆగినా అవుట్ ఫీల్డ్ తడిగా ఉండడంతో చాలా జట్లు పాయింట్లు కోల్పోయాయి. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లతో శ్రీలంక ఆడాల్సిన మ్యాచ్‌లు వర్షం కారణంగా టాస్ పడకుండానే రద్దు చేయబడ్డాయి. వెస్టిండీస్‌తో దక్షిణాఫ్రికా తలపడినా ఫలితం రాలేదు. ఈడెన్ గార్డెన్స్ మైదానం మొత్తాన్ని కవర్స్‌తో కప్పి ఉంచుతారు. మ్యాచ్ జరిగేలా సిబ్బంది ఏర్పాట్లు చేస్తారు. ఈడెన్ మైదానాన్ని గొప్పగా చేయడానికి సౌరవ్ గంగూలీ కారణం' అని గవాస్కర్ పేర్కొన్నారు.

# రెండో టీ20 మ్యాచ్ కూడా సందేహమే!

హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)

భారత క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికా పర్యటన ఆశించిన స్థాయిలో ప్రారంభం కాలేదు. దక్షిణాఫ్రికా-భారత్‌ల మధ్య డర్బన్‌లోని కింగ్స్‌మీడ్ స్టేడియంలో జరగాల్సిన తొలి టీ20 మ్యాచ్ వర్షం కారణంగా ఒక్క బంతి కూడా వేయకుండానే రద్దయింది. ఇప్పుడు రెండో మ్యాచ్‌కి ఇరు జట్లు సిద్ధమయ్యాయి. భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య డిసెంబర్ 12వ తేదీ మంగళవారం గెబారాలోని సెయింట్ జార్జ్ పార్క్ వేదికగా రెండో టీ20 మ్యాచ్ జరగనుంది. అయితే ఈ మ్యాచ్ కూడా జరగడం అనుమానమేనని తెలుస్తోంది. టాస్ కుదరకపోవడంతో డర్బన్‌లో జరగాల్సిన మ్యాచ్‌ను రద్దు చేశారు. ఇది అభిమానులను నిరాశకు గురి చేసింది. ఇప్పుడు మంగళవారం జరగనున్న రెండో టీ20కి కూడా వర్షం అంతరాయం కలుగుతుందని సమాచారం. భారత్-ఆఫ్రికా రెండో టీ20 మ్యాచ్ రోజు. వర్షం పడే అవకాశం 45 శాతం ఉంది. అయితే, మరికొద్ది నెలల్లో టీ20 ప్రపంచకప్ రానున్న నేపథ్యంలో ఆటగాళ్లకు ఇది పెద్ద దెబ్బగా మారనుంది.భారతదేశం %జం% దక్షిణాఫ్రికా 2వ %ు%20 మ్యాచ్ స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. డిస్నీం హాట్‌స్టార్ మ్యాచ్‌లను ఆన్‌లైన్‌లో ఉచితంగా చూడొచ్చు. భారత్ వర్సెస్ సౌతాఫ్రికా రెండో టీ20 మ్యాచ్ భారత కాలమాణం ప్రకారంర రాత్రి 8:30 గంటలకు ప్రారంభం కానుంది. రెండు టీ20 మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నందున రెండు మ్యాచ్‌లు గెలిచిన జట్టు సిరీస్‌ను కైవసం చేసుకుంటుంది.

భారత టీ20 జట్టు: యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), రింకూ సింగ్, శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), జితేష్ శర్మ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా (వైస్ కెప్టెన్). వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్, మహ్మద్ సిరాజ్, ముఖేష్ కుమార్.ఇప్పటివరకు, దక్షిణాఫ్రికా మరియు భారతదేశం మధ్య 25 %ు%20 అంతర్జాతీయ మ్యాచ్‌లు జరిగాయి, వీటిలో టీం ఇండియా 13 మరియు దక్షిణాఫ్రికా 10 గెలిచాయి, 2 మ్యాచ్‌లు ఫలితం లేకుండానే ఉన్నాయి. దక్షిణాఫ్రికా మైదానంలో ఇరు జట్ల మధ్య 8 మ్యాచ్‌లు జరగగా, అందులో భారత జట్టు 5, ప్రొటీస్ 2 మ్యాచ్‌లు గెలిచాయి. గతేడాది ప్రొటీస్ గడ్డపై జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 2-1 తేడాతో కైవసం చేసుకుంది.

# పింక్ బాల్ టెస్టుల నిర్వహణపై బీసీసీఐ అనాసక్తి

హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)

ఇకపై భారత్‌లో డే-నైట్ టెస్టు మ్యాచ్‌లు జరగడం అనుమానమే. పింక్ బాల్‌తో డే-నైట్ టెస్ట్ మ్యాచ్ ఆడడం మనకు తెలిసిందే. ఇకపై ఈ మ్యాచ్‌లను భారత మైదానంలో నిర్వహణపై భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకున్నట్లు వస్తున్నాయి. %దీజజ×% ఇకపై డొమెస్టిక్ సీజన్‌లో పురుషుల క్రికెట్ లేదా మహిళల ఈవెంట్‌లలో డే-నైట్ టెస్ట్ మ్యాచ్‌ను నిర్వహించదు. పింక్ బాల్ టెస్టుల నిర్వహణపై బీసీసీఐ ఆసక్తి చూపడం లేదని చెబుతున్నారు. నివేదిక ప్రకారం, బీసీసీఐ సెక్రటరీ జైషా విలేకరులతో మాట్లాడుతూ పింక్ బాల్ టెస్ట్‌పై భారత బోర్డు ఆసక్తి చూపడం లేదని, ఇది 4 లేదా 5 రోజులకు బదులుగా 2 నుంచి 3 రోజుల్లో ముగుస్తుందని చెప్పుకొచ్చారు. పింక్ బాల్ టెస్టును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీసీసీఐ అన్ని విధాలా కృషి చేసిందని జైషా అన్నారు. ఇప్పటివరకు గులాబీ బంతితో ఆడిన టెస్టులన్నీ కేవలం 2-3 రోజుల్లోనే ముగిశాయి. ప్రజలు 4 నుంచి 5 రోజుల పాటు టెస్ట్ మ్యాచ్‌లను చూడటానికి ఇష్టపడతారు. కానీ, అది త్వరగా ముగుస్తుంది. దీంతో భారత్‌లో దీన్ని నిలిపివేయాలని బీసీసీఐ నిర్ణయించినట్లు తెలుస్తోంది. పింక్ బాల్ టెస్ట్ చివరిగా ఆస్ట్రేలియాలో నిర్వహించారు. ఆ తర్వాత మరే ఇతర దేశం దీనికి ఆతిథ్యం ఇవ్వలేదు. టీమ్ ఇండియా ఇప్పటివరకు 4 పింక్ బాల్ టెస్టులు ఆడగా, 3 గెలిచింది. ఒక మ్యాచ్‌లో ఓడిపోయింది. బెంగళూరు ఎం. చిన్నస్వామి స్టేడియంలో శ్రీలంకతో భారత్ చివరి పింక్ బాల్ టెస్ట్ మ్యాచ్ ఆడింది. అది కూడా 3 రోజుల్లో ముగిసింది. భారత మహిళల క్రికెట్ జట్టు 2021లో ఆస్ట్రేలియాతో ఇప్పటివరకు ఒకే ఒక్క పింక్ బాల్ టెస్టు ఆడింది. క్వీన్స్‌లాండ్‌లో జరిగిన టెస్టు డ్రాగా ముగిసింది. బీసీసీఐ సెక్రటరీ చేసిన ఈ ప్రకటన తర్వాత టీమ్‌ఇండియా పింక్ బాల్‌తో టెస్టు మ్యాచ్ ఆడడం అనుమానంగా మారింది. ప్రస్తుతం భారత పురుషుల జట్టు దక్షిణాఫ్రికా పర్యటనలో ఉంది. అక్కడ డిసెంబర్ 26 నుంచి 2 టెస్టుల సిరీస్ ఆడాల్సి ఉంది. ఈ రెండు టెస్టులు ఎర్ర బంతితో నిర్వహించనున్నారు.

# పీక్స్‌కు చేరిన పాక్ ఆటగాడి సెలబ్రేషన్స్





హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)

భారత్ వర్సెస్ పాకిస్థాన్ క్రికెట్ పోటీ ఏ స్థాయిలో ఆడినా ఎప్పుడూ ఉత్కంఠగా ఉంటుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఆదివారం జరిగిన అండర్-19 ఆసియా కప్ 2023 మ్యాచ్‌లో ఇరుజట్లు తలపడ్డాయి. అండర్-19 ఆసియా కప్ ఐదవ మ్యాచ్ దుబాయ్‌లో జరిగింది. ఇందులో పాకిస్థాన్ 8 వికెట్ల తేడాతో భారత్ (%×చీణ జం౧ాూఖ%)ని ఓడించింది. ఈ టోర్నీలో టీమిండియాకు ఇదే తొలి ఓటమి. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఉదయ్ సహారన్ సారథ్యంలోని భారత జట్టుకు శుభారంభం లభించలేదు. దీంతో ఆ జట్టు స్కోరు 46 వద్ద రెండు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత ఆదర్శ్ సింగ్ (62), సహారన్ (60), సచిన్ దాస్ (58) అర్ధ సెంచరీలతో భారత్ 9 వికెట్ల నష్టానికి 259 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 47 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. పాక్ తరఫున అజాన్ అవైస్ అద్భుత సెంచరీ ఆడాడు. అతను 130 బంతుల్లో పది ఫోర్లతో అజేయంగా 105 పరుగులు చేశాడు. భారత్‌పై పాకిస్థాన్ అద్భుత విజయంపై ట్విట్టర్‌లో విపరీతమైన స్పందన వస్తోంది. అయితే, ఈ మ్యచ్‌లో పాకిస్థాన్ పేసర్ మహ్మద్ జీషాన్ దూకుడైన సెలబ్రేషన్స్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరలవుతోంది. పాక్ వికెట్ కీపర్ సాద్ బేగ్ చేతుల్లోకి బంతి చేరడంతో భారత బ్యాటర్ రుద్ర పటేల్ పెవిలియన్ చేరాల్సి వచ్చింది. పాకిస్తాన్ పేసర్ ఈ వికెట్‌తో చాలా ఉప్పొంగిపోయాడు. అయితే, అతని భావోద్వేగంతో సెలబ్రేషన్స్ పీక్స్‌కి చేరాయి. 12వ ఓవర్లో ఈ ఘటన చోటుచేసుకుంది. రుద్ర కవర్స్ ద్వారా బంతిని కొట్టాలని చూశాడు. కానీ భారత స్టార్ బ్యాట్‌ను ముద్దాడిన తర్వాత బంతి వికెట్ కీపర్ చేతుల్లోకి చేరింది. పాకిస్థాన్ %ఖ%19 ప్లేయింగ్ %శ×%: షామిల్ హుస్సేన్, షాజైబ్ ఖాన్, అజాన్ అవైస్, సాద్ బేగ్(కీపర్/కెప్టెన్), మహ్మద్ జీషన్, మహ్మద్ రియాజుల్లా, తయ్యబ్ ఆరిఫ్, అరాఫత్ మిన్హాస్, అలీ అస్ఫంద్, అమీర్ హసన్, ఉబైద్ షా.

ఇండియా %ఖ%19 ప్లేయింగ్ %శ×%: ఆదర్శ్ సింగ్, అర్షిన్ కులకర్ణి, రుద్ర పటేల్, ఉదయ్ సహారన్ (కెప్టెన్), ముషీర్ ఖాన్, సచిన్ దాస్, అరవెల్లి అవనీష్ (కీపర్), సౌమీ పాండే, మురుగన్ అభిషేక్, రాజ్ లింబాని , నమన్ తివారీ.

# రోహిత్ గాయం మానేదెన్నడో?



హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)కొన్ని గాయాలు త్వరగా నయం అవుతాయి. మరికొన్ని ఎక్కువ కాలం మానకుండా ఇబ్బంది పెడుతుంటాయి. టీమ్ ఇండియాకు తగిలిన గాయం అంత తేలికగా మానడం లేదు. 2023 సంవత్సరంలో భారత క్రికెట్ జట్టుకు చాలా దెబ్బలే తగిలాయి. ముఖ్యంగా ఈ సంవత్సరం %ూణ×% ప్రపంచకప్ ఫైనల్‌లో ఓటమికి సంబంధం ఉంది. భారత జట్టు ఏడాది పొడవునా మెరుగైన క్రికెట్‌ను ప్రదర్శించిందనడంలో సందేహం లేదు. కానీ, ప్రపంచకప్ సమయానికి వచ్చేసరికి పరాభవాలతో ఫ్యాన్స్‌ను తీవ్రంగా నిరాశపరుస్తూనే ఉంటుంది. ఆ క్షణం గురించి ఆలోచిస్తే, భారత క్రికెటర్లు కూడా ప్రపంచ ఛాంపియన్‌లుగా మారనప్పుడు, ఏడాది పొడవునా మెరుగైన క్రికెట్ ఆడటం వల్ల ప్రయోజనం ఏమిటని తమను తాము ప్రశ్నించుకుంటారు. ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో అజేయంగా నిలిచి టీం ఇండియా ఫైనల్స్‌కు చేరుకుంది. ప్రపంచకప్ ట్రోఫీని చేజిక్కించుకుంటారని అందరూ భావించారు. ఆస్ట్రేలియా లాంటి టోర్నీ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్టులో కూడా భారత ఆటగాళ్ల భయం కనిపించింది. కానీ, టోర్నీ అంతటా చూపిన ఆకర్షణీయ ప్రదర్శనను ఫైనల్‌లో భారత్ నిలబెట్టుకోలేకపోయింది. ఫలితంగా ఆస్ట్రేలియా మరోసారి ప్రపంచ ఛాంపియన్‌గా అవతరించేందుకు మార్గం సుగమమైంది. ఈ భారీ ఓటమి బాధను భరించడం అంత సులువు కాదు. భారత ఆటగాళ్ల ముఖాల్లో ఇది స్పష్టంగా కనిపించింది. ఈ నొప్పి ముఖ్యంగా ఆటగాళ్లకు మరింత బాధాకరంగా ఉంది. వారి కెరీర్‌లో ఇది చివరి ప్రపంచ కప్ కావచ్చు. వచ్చే ప్రపంచకప్‌లో ఆడని ఆటగాళ్ల గురించి మాట్లాడితే.. వయస్సు మాత్రమే కాదు, ఫిట్‌నెస్ కూడా ఇక్కడ పెద్ద అంశంగా మారింది. ఇటువంటి ఆటగాళ్లలో అతిపెద్ద పేరు కెప్టెన్ రోహిత్ శర్మ. తన కెప్టెన్సీలో ఈసారి భారత్‌ను ప్రపంచ ఛాంపియన్‌గా మార్చే సువర్ణావకాశాన్ని కలిగి ఉన్నాడు. కానీ, అలా చేయలేకపోయినందుకు బాధపడతాడనడంలో ఎలాంటి సందేహం లేదు. తదుపరి వన్డే ప్రపంచకప్‌లో కూడా విరాట్ కనిపిస్తాడా లేదా అనేది చెప్పడం కష్టం. అయితే, అతను 2011లో ప్రపంచకప్ గెలిచిన టీమ్ ఇండియాలో సభ్యుడిగా నిలిచాడు. వీరే కాకుండా షమీ, బుమ్రా ఆడతారా లేదా అనేది వారు ఎంత ఫిట్‌గా ఉన్నారనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే వారిద్దరూ నిరంతరం గాయాలతో పోరాడుతున్నారు. రవీంద్ర జడేజా ఆడుతూనే ఉంటే మళ్లీ ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకోగలడా? అయితే, 2023 ప్రపంచకప్ బాధ ఈ ఆటగాళ్లకు జీవితాంతం మిగిలిపోవచ్చు అనే ప్రశ్నల మధ్య.. రాబోయే సిరీస్‌ల్లో వీరి ప్రదర్శన ఎలా ఉంటుందోనని అంతా ఆందోళనలో ఉన్నారు.

## బెయిల్స్ మాత్రం ఎగరలేదు



హైదరాబాద్,డిసెంబర్11 (అక్షరం న్యూస్)

ఫాస్ట్ బౌలర్ విసిరిన అద్భుతమైన బాల్‌కు మిడిల్ స్టంప్ కిందపడింది. బ్యాట్స్‌మెన్ కూడా క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఇది గమనించిన బ్యాటర్ కూడా ఔట్ అని భావించి, ఫీల్డ్ వదిలి వెళ్లబోయేందుకు సిద్ధమయ్యాడు. అయితే అంపైర్ నాటౌట్ అని ప్రకటించడంతో అంతా షాక్ అయ్యారు. ఇలాంటి వింత నిర్ణయానికి ఆస్ట్రేలియాలో జరిగిన ఓ క్లబ్ మ్యాచ్ సాక్షిగా నిలిచింది. మెల్‌బోర్న్ క్లబ్ క్రికెట్‌లో జరిగిన ఓ మ్యాచ్‌లో బ్యాటర్ క్లీన్ బౌలింగ్ చేశాడు. అంతే ఆ బంతి నో బాల్ కానేకాదు. అయినా, బ్యాటర్‌ను నాటౌట్‌గా ప్రకటించడంతో ఎవరికీ ఏం అర్థం కాలేదు. అసలేం జరిగిందో ఇప్పుడు తెలుసుకుందాం.. ఇక్కడ మిడిల్ స్టంప్ చూస్తే అసలు విషయం అర్థమవుతుంది. బాల్ చాలా అద్భుతంగా ఉంది. అయితే, ఆ బాల్ మిడిల్ స్టంప్‌ను తాకింది. దీంతో మిడిల్ వికెట్ పడిపోయింది. అయితే, ఇక్కడే ఉంది అసలు విషయం. మిడిల్ వికెట్ పడిపోయింది. కానీ, స్టంప్స్ మాత్రం అలాగే ఉండిపోయాయి. దీంతో అంపైర్ నాటౌట్‌గా ప్రకటించాడు. ఈ మేరకే ఐసీసీ నిబంధనల ప్రకారం అంపైర్ ట్విస్ట్ ఇచ్చాడు. ఐసీసీ నిబంధనల ప్రకారం, బౌల్డ్ అవుట్‌గా నిర్ణయించబడాలంటే బంతులు స్టంప్స్‌ను కింద పడేయాల్సి ఉంటుంది. అయితే ఈ మ్యాచ్‌లో మిడిల్ స్టంప్ కింద పడినా.. బెయిల్స్ మాత్రం ఎగరలేదు. దీంతో ఫీల్డ్ అంపైర్ నాటౌట్ అని నిర్ధారణకు వచ్చారు. ఇప్పుడు బౌల్డ్ చేసిన నాటౌట్ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అంతకుముందు, 2019 వన్డే ప్రపంచకప్ సమయంలో, జింగ్ బేల్స్ చాలా చర్చనీయాంశమైంది. ఐసీసీ అందించిన లైటింగ్ బేల్స్ బౌల్డ్ అయినప్పటికీ పడకపోవడమే సర్వత్రా ఆగ్రహానికి కారణంగా నిలిచింది. ముఖ్యంగా 2019 వన్డే ప్రపంచకప్‌లో బౌల్డ్ అయినప్పటికీ, బెయిల్స్ పడకపోవడంతో ఐదుగురు బ్యాట్స్‌మెన్స్ నాటౌట్‌గా నిలిచారు. దీనిపై పుకార్లు వచ్చాయి. దీని తర్వాత, బేల్స్ రూపకల్పనపై ఐసీసీ మరింత దృష్టి సారించింది.

# గ్రామాలకు ప్రభుత్వ పథకాలు చేరాలి

### సమర్థంగా కార్యక్రమాలను అమలు చేయాలి

### అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు



హైదరాబాద్,డిసెంబర్11అక్షరం న్యూస్)

గ్రామీణ ప్రాంత ప్రజలకు నిత్యం ఎంతో ఉపయోగ పడే కార్యక్రమాలు సమర్ధవంతముగా ప్రజలందరికి చేరువయ్యేలాగా అధికారుల అనుభవాన్ని ఉపయోగించి, బాగా కష్టపడి పనిచేయాలని, మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్య నిర్వహణ, పౌరులకు గ్రామాల్లోనే వివిధ రకాల సేవలను ఈ-పంచాయతీ ద్వారా అందించడం, గ్రామపంచాయతీ అభివృద్ధి కొరకు నిర్వహించే వివిధ రకాల కార్యక్రమల గురించి అడిగి తెలుసుకున్నారు. సెర్ప్ మహిళా సంఘాలు, సెర్ప్ బ్యాంక్ లింకేజ్, వికలాంగుల సదరం సర్టిఫికేట్ జారీ, అన్ని రకాల పెన్షన్ లు, మహిళా రైతు ఉత్పత్తి దారుల సంఘాల కార్యక్రమాలు, స్త్రీ నిధి ద్వారా మహిళా సంఘాల పారదర్శకమైన పద్ధతిలో ఋణాల మంజూరీ వంటివి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో చేపట్టే వివిధ రకాల రోడ్లు వేయు కార్యక్రమాల గురించి వివరంగా తెలీసుకున్నారు. అదేవిధముగా శాఖ ద్వారా జరిగే కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో అధికారుల పనితీరును ప్రశంసించారు. పంచాయితీరాజ్ శాఖపై సోమవారం శాఖ ఉన్నతాధికారులతో సమావేశమై శాఖ పని తీరును సమీక్షించారు. ఈ సమావేశశానికి పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియాతో పాటు ఆ శాఖ స్పెషల్ కమిషనర్ ప్రదీప్ కుమార్ శెట్టి, ఇంజనీర్ ఇన్ చీఫ్ సంజీవ రావ్ , స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్ రెడ్డి గారు పాల్గొని ఆయా విభాగాల వారీగా కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం,వాటర్ షెడ్స్, రూర్బన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్, ఈ.జి.ఎమ్.ఎమ్ , 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ గురించి వారు వివరించారు. గ్రామీణాభివృదిశాఖ ఇతర ఉన్నతాధికారులు, డిప్యూటీ కమిషనర్లు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మహిళల బస్సు ప్రయాణాల పరిశీలన

### పలు రూట్లలో మహిళలతో మాట్లాడిన ఎండి సజ్జన్నార్

హైదరాబాద్,డిసెంబర్11అక్షరం న్యూస్)

తెలంగాణలో 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ బస్ స్టేషన్ ను టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పథకం అమలును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జేబీఎస్ - ప్రజ్ఞాపూర్, జేబీఎస్ - జనగామకు వెళ్లే ప్లలె వెలుగు బస్సుల్లో, బాన్సువాడకు వెళ్లే ఎక్స్ ప్రెస్ బస్సులోని మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణ సౌకర్యం అమలవుతున్న తీరును వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేబీఎస్ - వెంకట్ రెడ్డి నగర్ సిటీ ఆర్డినరీ బస్సులో మెట్టుగూడ వరకు ఆయన ప్రయాణించారు. అందులో మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ అందజేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన 'మహాలక్ష్మి - మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం' పథకానికి మంచి స్పందన లభిస్తోందని సజ్జనార్ తెలిపారు. మహిళలకు ప్రయాణ ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన గొప్ప పథకమని చెప్పారు. ఈ సౌకర్యాన్ని మహిళలు, బాలికలు, విద్యార్థినులు, థర్డ్ జెండర్లు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ పథకంలో టీఎస్‌ఆర్టీసీ భాగస్వామ్యం చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. మహిళా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్పష్టం చేశారు. ఉచిత బస్ ప్రయాణ స్కీమ్ కు సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేసి, వాటిపై 40 వేల మంది సిబ్బందికి అవగాహన కల్పించామని చెప్పారు. పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో ప్రయాణించే మహిళలందరూ స్థానికతను నిర్ధారించుకునేందుకు తమ ఆధార్ కార్డులు సిబ్బందికి చూపించి సంస్థకు సహకరించాలని కోరారు. ఉచిత ప్రయాణ సౌకర్యం వల్ల రద్దీ పెరిగిందని, అందుకు అనుగుణంగా బస్సులు నడిపేలా ప్రణాళిక రూపొందించినట్లు స్పష్టం చేశారు. రద్దీ సమయాల్లో ప్రయాణికులు సంయమనం పాటించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

# పెద్దపులి సంచారంతో భయంభయం

నాగర్‌కర్నూల్,డిసెంబర్11అక్షరం న్యూస్)

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలో పెద్దపులి సంచారం కలకలం సృష్టిస్తోంది. అమరగిరి గ్రామం శివారులో కృష్ణా నది ఒడ్డున పెద్ద పులి కనిపించినట్లు స్థానికులు తెలిపారు. పెద్ద పులి సంచారంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.దీంతో స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఒంటరిగా బయటకు రావొద్దని అధికారులు సూచించారు. పెద్ద పులి సంచారం పట్ల అప్రమత్తంగా ఉండి, తమకు సమాచారం అందించాలని కోరారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609